సత్యమేవ జయతే

సాక్షి

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 112

శనివారం 13-7-2024


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
II
విజయవాడ
శనివారం ॥ 13-7-2024


● కుటుంబ సభ్యులతో ముఖేష్ అంబానీ, నీతా అంబానీ


● అనంత్ అంబానీ – రాధికా మర్చంట్


● రాధికా పరిణయం


● తండ్రి మురిపెం.. తనయుడి దరహాసం


● రజనీకాంత్



● అమితాబ్, జయ


● సల్మాన్ ఖాన్


● టోనీ బ్లెయిర్, చెర్రీ బ్లెయిర్


● ధోనీ ఫ్యామిలీ


● ఉపాసన, రామ్‌చరణ్


● రణబీర్ కపూర్, అలియా భట్

ఆకాశ పందిరి తారలు తలంబ్రాలు


● షారుక్ ఖాన్, గౌరి


● సైరా బాను, ఏఆర్ రెహమాన్


● మిహీక, రానా


● అట్లీ, ప్రియ




● ప్రియాంకా చోప్రా


● వెంకటేశ్


● మహేశ్‌బాబు

కుబేరులు వియ్యంకులైతే ఒక కల్యాణం ఎంత ఘనంగా జరగాలో అంత ఘనంగా జరుగుతుంది. దేవతల వంటి అతిథులు, పుష్పక విమానాలు, పారిజాతాలు, శతభక్ష్య పరమాన్నాలు, సువర్ణ తోరణాలు, వెండి ద్వారాలు, స్త్రీల మెడల్లో పచ్చలు, కెంపులు, వజ్రవైఢూర్యాలు, కళ్లు చెదిరే పట్టు పీతాంబరాలు...

ముఖేష్ అంబానీ–నీతా అంబానీ తమ కుమారుడు అనంత్ అంబానీ వివాహాన్ని విరెన్ మర్చంట్–శైలా మర్చంట్‌ల కుమార్తె రాధికా మర్చంట్‌తో జులై 12 రాత్రి జరప నిశ్చయించడంతో ముంబై లోని జియో వరల్డ్ కన్వెన్షన్ అందుకు భారీ వేదికైంది. దేశ, విదేశాల అతిథులను విమానాలు మోసుకొచ్చాయి. శనివారం 'శుభ్ ఆశీర్వాద్' పేరుతో వేడుక, ఆదివారం రోజు 'మంగళ్ ఉత్సవ్' పేరున భారీ రిసెప్షన్ జరుగనున్నాయి.

తరలి వచ్చిన అతిథులు

ఒకవైపు తేలికపాటి చినుకులు పడుతూ ఉంటే అనంత్–రాధికల పెళ్లి కోసం అంబానీ గృహధామం ఎంటిలియాతో పాటు వివాహవేదిక జియో వరల్డ్ కన్వెన్షన్‌లో అతిథుల తాకిడి మొదలైంది. 'దుల్హేరాజా' అనంత్ బారాత్‌ను సర్వాంగ సుందరంగా తయారు చేసిన కారులో కొనసాగింది. సాయంత్రం నుంచే అతిథుల రాక మొదలైంది. బ్రిటన్ మాజీ ప్రధాని టోని బ్లెయిర్ మొదలు అమెరికా మీడియా పర్సనాలిటీ కిమ్ కర్దాషియన్ వరకు హాలీవుడ్ నటుడు జాన్ సీనా నుంచి తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ వరకూ ఎందరో అరుదెంచారు. బాలీవుడ్ నుంచి షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్, రణబీర్ కపూర్, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా– నిక్ జోన్స్, అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్ తదితరులు హాజరయ్యారు. క్రికెటర్లలో మహేంద్ర సింగ్ ధోని, నాటి మేటి ఆటగాడు శ్రీకాంత్, బుమ్రా, కేఎల్ రాహుల్, సూర్యకుమార్ యాదవ్ హాజరయ్యారు.

దక్షిణాది తారాతోరణం

అనంత్– రాధికల వివాహంలో దక్షిణాది తారలు తళుకులీనారు. మహేష్‌బాబు తన భార్య నమ్రత, కుమార్తె సితారతో హాజరవగా, రామ్‌చరణ్–ఉపాసన జోడీగా వచ్చారు. వెంకటేష్, రాణ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. సంగీత దిగ్గజం ఏ.ఆర్. రెహమాన్ సతీసమేతంగా హాజరయ్యారు. సూపర్ స్టార్ రజనీకాంత్ కుటుంబ సమేతంగా వచ్చారు. నయనతార–విగ్నేష్ శివన్, సూర్య –జ్యోతిక వేడుకకు తళుకులు అద్దారు.


● సూర్య, జ్యోతిక


● విఘ్నేష్ శివన్, నయనతార

హెల్దీ డైట్
రాగి-బనానా పాన్ కేక్



కావలసినవి: అరటి పండు– 1; రాగి పిండి – కప్పు; బెల్లం పొడి– అర కప్పు; పాలు – కప్పు; నెయ్యి– 2 టేబుల్ స్పూన్లు ; పండ్ల ముక్కలు – డెకరేషన్ కోసం కొన్ని.

తయారీ: ● ఒక పాత్రలో బెల్లం పొడి వేయాలి. అందులో అరటి పండు గుజ్జు, రాగి పిండి వేసి మూడు సమంగా కలిసేటట్లు వేళ్లతో బాగా చిదుముతూ కలపాలి. కలిపేటప్పుడు పాలు కొద్ది కొద్దిగా వేసుకుంటూ ఉండాలి. ఇలా కలిపితే మిశ్రమం బాగా మృదువుగా వస్తుంది ● నాన్ స్టిక్ పెనం వేడి చేసి కొద్దిగా నెయ్యి రాసి పైన కలిపి సిద్ధంగా ఉంచుకున్న మిశ్రమాన్ని ఒక గరిటె వేసి అంతా ఒకే మందంలో ఉండేటట్లు సర్దాలి ● చిన్న మంట మీద కాలనివ్వాలి. పెనం వైపు దోరగా కాలేకొద్దీ పై వైపు బుడగలు మొదలవుతాయి. అప్పుడు కేక్‌ను తిరగేసి రెండవ వైపు కూడా దోరగా కాలనివ్వాలి ● రెండు వైపులా కాలిన కేక్‌ను ప్లేట్‌లోకి తీసుకుని తాజా పండ్ల ముక్కలతో గార్నిష్ చేయాలి.

ఇది గ్లూటెన్ ఫ్రీ ఫుడ్. ఐరన్, క్యాల్షియం పొటాషియం సమృద్ధిగా ఉండి మంచి శక్తినిచ్చే ఆహారం. ఇందులో దాదాపుగా 200 కిలోకేలరీల శక్తి, 40 గ్రాముల కార్బోహైడ్రేట్‌లు, 6 గ్రాముల ప్రొటీన్‌లు, ఆరు గ్రాముల ఫ్యాట్, 4 గ్రాముల ఫైబర్, 15 గ్రాముల చక్కెరలు ఉంటాయి.


– డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ & వెల్‌నెస్ కోచ్

ఆర్వోతో వడపోత మేలేనా?
● అవసరమైన లవణాలు కోల్పోతామా?

దేహంలోని అన్ని జీవక్రియలకు కావాల్సింది నీరు. అది కలుషితమైతే వెంటనే జబ్బు పడతాం. అందుకే నీళ్లైనంత శుభ్రమైన నీళ్లే తాగాలి. ఇప్పుడు లభ్యమవుతున్న నీటిలో ఎన్నో కాలుష్యాలు! అందుకే వడపోత తప్పనిసరి. ఈ ప్రక్రియలో అత్యాధునికమైనది ఆర్వో అని పిలిచే రివర్స్ ఆస్మాసిస్. అయితే ఈ పద్ధతిలో దేహానికి అవసరమైన మరి కొన్ని ఖనిజ లవణాలూ కోల్పోయే ప్రమాదముందనేది చాలా మంది అభిప్రాయం. దాన్లో కొంత నిజమున్నా... ఈ వడపోతకు ఆర్వో ఎందుకు సురక్షితం, కోల్పోయే ఖనిజలవణాల కోసం ఏం చేయాలి?... తెలుసుకుందాం రండి.



వడపోతకు పలుచటి వస్త్రాన్ని వాడటం, అంత కంటే కాచి చల్లార్చాక నీటిని పల్చటి బట్టతో వడపోయడం మరింత రక్షణ, కొన్ని పరిస్థితుల్లో గుల=కరాళ్లు, ఇసుక, చార్‌కోల్ (బొగ్గులు) ముక్కలు వాడటం... ఇవన్నీ చేయవచ్చు. కానీ ఇవేవీ నీళ్లలోని బ్యాక్టీరియాను పూర్తిగా నశింపజేయలేవు. కానీ రివర్స్ ఆస్మాసిస్ అన్నింటికంటే సురక్షితం.

లవణాల సాంద్రతను కొలిచేదిలా...

ఏ నీళ్లలోనైనా అనివార్యంగా కొన్ని లవణాలు ఉంటాయి. వీటిని టోటల్ డిజాల్వబుల్ సాల్ట్స్ (టీడీఎస్) అంటారు. ఈ 'టీడీఎస్'ను పార్ట్స్ పర్ మిల్లీ (పీపీఎమ్)లో కొలుస్తారు.

నీళ్లలోని టీడీఎస్ (పీపీఎమ్‌లలో)	తాగడానికి ఏ మేరకు మంచిది
50 - 150 మధ్యన	అద్భుతం (ఎక్సలెంట్)
150 - 250 వరకు	మంచివే (గుడ్)
250 - 300 వరకు	పర్లేదు (ఫెయిర్)
300 - 500 వరకు	అంత మంచిది కాదు (పూర్)

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రకారం మన దేశంలోని తాగు నీటి టీడీఎస్ 500 లోపు ఉండాలి. కానీ డబ్ల్యుహెచ్ఓ మాత్రం 300లోపు ఉంటేనే మంచిదంటోంది.

కోల్పోయిన మినరల్స్, నీటి స్వాభావిక రుచి పొందేందుకు...

● **మినరల్ క్యాట్రిడ్జ్‌లను ఉపయోగించడం ద్వారా** కొన్ని ప్యూరిఫైయర్లలో మినరల్ క్యాట్రిడ్జ్‌లను ఉపయోగించడం ద్వారా నీటిలోకి మినరల్స్ తిరిగి చేర్చవచ్చు.

● **మినరల్ డ్రాప్స్ / టాబ్లెట్స్ ద్వారా:** మార్కెట్లో తేలికగా, చవగ్గా దొరికే మినరల్ డ్రాప్‌లు లేదా టాబ్లెట్స్‌తో కోల్పోయిన మినరల్స్ పొందవచ్చు.

● **ఫిల్టర్లను మార్చడం ద్వారా:** కొన్ని ప్యూరిఫైయర్స్‌లో మినరల్స్ కోల్పోకుండా చేయడానికి ప్రత్యేకమైన ఫిల్టర్స్ ఉంటాయి.

● **తరచూ ప్యూరిఫైయర్‌లు మారుస్తూ ఉండడం ద్వారా:** నీటి రుచి, ఫ్లేవర్‌ను మెరుగు పరచవచ్చు.

● **ప్రకృతిలోని స్వాభావిక పదార్థాలతో:** తాగే నీటిలో కాస్త తేనె, నిమ్మరసం, లవంగాలు వంటివి కలుపుకోవడం ద్వారా రుచికరమైన, ఆరోగ్యకరమైన నీటిని పొందవచ్చు.

ఆర్వో తో అవసరమైన లవణాలు కోల్పోవడం జరగదా?

అవును... జరుగుతుంది. అయితే ఆర్వో ఇప్పుడు అందుబాటులో ఉన్న అత్యాధునిక వడపోత ప్రక్రియ. దీంట్లో మనకు అవసరమైన ఖనిజాలూ, లవణాలూ చాలావరకు కోల్పోతాం. అయితే కాలుష్యాలూ, హెవీ మెటల్స్ ఉన్న నీటిని తాగడం కంటే... కొంతమేరకు క్యాల్షియమ్, మెగ్నీషియమ్, జింక్ లాంటి ఎసెన్షియల్ సాల్ట్స్ కోల్పోయినా, వాటిని ఇతర మార్గాల్లో భర్తీ చేసుకోవడం మేలు.

మరి లవణాల భర్తీ ఎలా?

రోజువారీ ఆహారంలో తాజా ఆకుకూరలు, పండ్లు, నట్స్ వంటివి తగినంతగా తీసుకుంటూ ఉంటే ఆర్వోలో కోల్పోయిన ఖనిజాలూ, లవణాలను భర్తీ చేసుకోవచ్చు.


డాక్టర్ ఆరతి బెల్లారి
కన్సల్టెంట్, ఇంటర్నల్ మెడిసిన్

రివర్స్ ఆస్మాసిస్ అంటే...


ఆస్మాసిస్‌లో తక్కువ గాఢత ఉన్న ద్రవం వడపోతకు గురై ఎక్కువ గాఢత ఉన్న వైపునకు వెళ్తుంది. దీనికి భిన్నంగా బాగా గాఢంగా ఉన్న కలుషితమైన నీరు వడపోతకు గురయ్యాక తక్కువ గాఢత వైపునకు రావడాన్ని 'రివర్స్ ఆస్మాసిస్' అంటారు. ఇందులో కలుషిత పదార్థాలు, ఖనిజాలూ, లవణాలు మొదలైనవి ఉన్న నీటిని యంత్రసహాయంతో ఒత్తిడికి గురి చేస్తూ ఒక ఫిల్టరేషన్ పొర (సెమీ పర్మియబుల్ మెంబ్రేన్) ద్వారా వడపోస్తారు.

ఆర్వో ప్రక్రియ ఎందుకంటే...

మన నీటి వనరుల్లోకి అనేక కలుషితమైన పదార్థాలే కాకుండా పారిశ్రామిక వ్యర్థాల కారణంగా హెవీ మెటల్స్ కూడా ఉంటాయి. ఈ నీళ్లు తాగితే కొంతకాలానికి కిడ్నీలు, కాలేయం దెబ్బతినడం ఖాయం. అయితే ఆర్వో ప్రక్రియ ద్వారా వడపోయడం వల్ల ఆ నీటి నుంచి కాలుష్యాలన్నీ అన్నివిధాలా పూర్తి స్థాయిలో తొలగిపోయి... పరిశుభ్రమవుతాయి.

బ్యూటిప్స్
అందమైన చేతులు, నాజూకైన పాదాల కోసం

● టేబుల్ స్పూన్ శనగపిండిలో చిటికెడు పసుపు వేసి అందులో తగిన మోతాదులో పాలు లేదా పెరుగు వేసి మరీ గట్టిగా కాకుండా జారుడుగా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ని చేతులకు, పాదాలకు పట్టించి పదిహేను – ఇరవై నిమిషాల పాటు ఉంచాలి. ఆ తరవాత వేళ్లతో వలయాకారంగా మర్దన చేస్తూ చర్మం నుంచి శనగపిండి ప్యాక్‌ను వదిలించిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే చేతులు, పాదాల చర్మం మృదువుగా మారుతుంది.



● చేతులు, పాదాల చర్మం గరుకుగా మారినప్పుడు... టీ స్పూన్ నిమ్మరసంలో టీ స్పూన్ చక్కెర కలిపి (చక్కెర పూర్తిగా కరగాల్సిన అవసరం లేదు. గరుకుగానే ఉండాలి), ఆ మిశ్రమాన్ని చేతులకు, పాదాలకూ పట్టించి పది నిమిషాల తర్వాత వేళ్లతో నెమ్మదిగా మర్దన చేయాలి. ఇలా చేస్తే మృత కణాలు తొలగిపోతాయి, చేతులు, పాదాల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. పొడి చర్మం ఉన్న వాళ్లు ఈ ప్యాక్‌లో నాలుగు చుక్కల కొబ్బరి నూనె లేదా బాదం నూనె కలుపుకోవాలి.

● చేతి వేళ్లు, పాదాలు ఆకర్షణీయంగా కనిపించాలంటే... అలోవెరా జెల్‌లో రెండు చుక్కల బాదం నూనె లేదా గ్లిజరిన్ కలిపి రాత్రి పడుకునే ముందు చేతులకు, పాదాలకు రాసుకోవాలి. అలాగే టీ స్పూన్ టొమాటో రసం, అదే మోతాదులో గ్లిజరిన్, నిమ్మరసం కలిపి రాసినా కూడా మంచి ఫలితం ఉంటుంది.


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 112

శనివారం 13-7-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆకాశ పందిరి తారలు తలంబ్రాలు

అంగరంగ వైభవంగా అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ వివాహం...

తరలివచ్చిన అతిరథులు

- వివరాలు ఫ్యామిలీలో

సుప్రీం కోర్టు వారించినా వినరా?

కక్ష సాధింపుతో కోర్టు ధిక్కారానికి తెగించిన రాష్ట్ర ప్రభుత్వం

ఎమ్మెల్యే రఘురామ ఈ మెయిల్‌తో కేసు నమోదు

ఐపీఎస్‌లు సునీల్‌కుమార్, పీఎస్ఆర్‌తోపాటు మాజీ సీఎం జగన్‌పై కేసులు

గతంలో ఇదే అంశంపై కోర్టులను ఆశ్రయించిన రఘురామ

ఆయన ఆరోపణల్లో వాస్తవం లేదని తేల్చి చెప్పిన వైద్య నివేదిక

దాంతో ఆ పిటిషన్‌ను తోసిపుచ్చిన హైకోర్టు, సుప్రీం కోర్టు

అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను లెక్క చేయకుండా తాజాగా కేసు నమోదు

చంద్రబాబు సర్కారు తీరుపై తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్న న్యాయ నిపుణులు

2లో



ఎవరి సంతోషం కోసం మూడేళ్లకు అక్రమ కేసు?



దురుద్దేశం, రాజకీయ కక్షతోనే కేసు నమోదు

పోలీసులు ఓ కొత్త సంప్రదాయానికి తెర తీశారు

- ఇది ఏమాత్రం సమంజసం కాదు
- భవిష్యత్తులో అది వారికే ఇబ్బందిగా మారుతుంది
- మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి
- తప్పుడు కేసుపై పోలీసులే బాధ్యత వహించాలి
- వ్యక్తిగత ద్వేషంతోనే రఘురామ ఆరోపణలు
- నాటి వాంగ్మూలానికి నేటి ఫిర్యాదుకు పొంతన ఉందా?

3లో

ఉన్మాదానికి పరాకాష్ట

రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి టీడీపీ అరాచకాలకు హద్దే లేకుండా పోయింది.. ఆ పార్టీ శ్రేణుల ఉన్మాదం పరాకాష్టకు చేరింది. పార్టీ అధికారంలోకి వస్తే ఏం చేసినా అడ్డుకునే వారుండరనే సరికొత్త విష సంస్కృతికి బీజం పడింది.. పర్యవసానంగా ఇష్టానుసారం వందల సంఖ్యలో దాడులు.. విధ్వంసాలు.. హత్యాయత్నాలు.. వ్యాపారాల్లో ఉచిత వాటాలు.. ఊరూరా రావణ కాష్టం రగులుతోంది.. "ప్రభుత్వం మనదే.. చంపేసెయ్" అని ఆచరణలో చేసి చూపిస్తున్నారంటే ఏమనాలి? పట్టణ నడి బొడ్డున జీపుతో మోటార్ బైక్‌ను ఢీకొట్టి కిడ్నాప్ చేయడాన్ని ఎలా చూడాలి? అంతటితో ఆగకుండా ఎమ్మెల్యే సమక్షంలోనే చంపడానికి ఉపక్రమించడం దేనికి సంకేతం? కాపాడాల్సిన పోలీసులు 'అమ్మా.. అమ్మా.. చితకబాదండి.. కానీ అతన్ని చంపొద్దు ప్లీజ్..' అంటూ ఉన్నతాధికారులు ఓ ఎమ్మెల్యేను అడుక్కోవడం ఖాకీ యూనిఫాంకే అవమానం. పంటను అమ్ముకునేందుకు వీలు లేదన్న హుకుంలపై బీహార్ విస్తుపోతోంది. ఊళ్లొదలకపోతే దాడులు.. అడవుల్లో తల దాచుకోవాల్సిన దుస్థితి.. మహిళలు, వృద్ధులు, చిన్నారులు అనే తేడానే లేదు.. కిడ్నాప్‌లు, అత్యాచారాలు, హత్యలు.. తప్పుడు కేసులు.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్‌ల తీరే ఇందుకు కారణం.. ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్రంలో తాలిబన్ల పాలనను మరిపిస్తున్నారు.

రేప్ చేసి, చంపేసి.. కాలువలో పడేశారు!

మలుపులు తిరుగుతున్న బాలిక కిడ్నాప్ వ్యవహారం

ఆరు రోజులుగా నిద్రలేని ముచ్చుమర్రి గ్రామం

ఈ దారుణానికి ఒడిగట్టింది తామేనన్న ముగ్గురు మైనర్ బాలురు.. ఆపై మాట మార్పు

జీపుతో ఢీకొట్టి కిడ్నాప్

ఆపై ఎమ్మెల్యే ఇంట్లోకి ఎత్తుకెళ్లి విచక్షణారహితంగా దాడి

ఆళ్లగడ్డలో టీడీపీ కార్యకర్తల బరితెగింపు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై హత్యాయత్నం

ప్రభుత్వం మనదే.. చంపేసెయ్

ట్రాక్టర్‌తో తొక్కించి దళిత మహిళ దారుణ హత్య

ఆదోని నియోజకవర్గంలో టీడీపీ నేతల దాష్టీకం

2లో



తల్లికి వందనంపై సర్కారు దొంగాట!

- 'ఈచ్ మదర్' అని ఉత్తర్వుల్లో ఇచ్చి, ఇప్పుడు బొంకుతున్న ప్రభుత్వం
- 'ఎంత మంది పిల్లలున్నా ఇస్తాం' అని ప్రకటన చేయకుండా దోబూచులాట
- ఈ విషయంపై నోరు మెదపని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్
- ఆ శాఖ కార్యదర్శికి స్పందించే బాధ్యత అప్పగించి మోసం దాచివేతకు యత్నం

11లో

ఇదండీ సంగతి



అసత్యాలు చెబుతున్న షర్మిల.. ఇవిగో వాస్తవాలు

- 'అమ్మకు వందనం' పథకంపై బాబు యూటర్న్.. సర్వత్రా విమర్శలతో సంకటస్థితిలో టీడీపీ ప్రభుత్వం
- సరిగ్గా ఈ సమయంలో నేనున్నానంటూ రంగంలోకి దిగిన షర్మిల
- టీడీపీ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు
- అమ్మ ఒడి పథకంపై దుష్ప్రచారంతో కూటమిని కాపాడే యత్నం

3లో

ఈ ఉచితం చాలా కాస్ట్లీ!



- ఇసుక ఫ్రీనే కానీ.. ప్రతి రేణువుకూ రేటుంది
- టన్నుల లెక్కన బోర్డులు పెట్టి మరీ ముక్కు పిండి వసూలు
- స్టాక్ పాయింట్ నుంచి రవాణా చార్జీలు, పన్నులు అదనం

10లో



సీజే ఠాకూర్‌ని కలిసిన సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ని సీఎం చంద్రబాబు శుక్రవారం కలిశారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత బాబు తొలిసారి సీజే ఇంటికి వెళ్లారు. శాశ్వత హైకోర్టు నిర్మాణం, కోర్టుల్లో మౌలిక సదుపాయాల కల్పన, న్యాయాధికారుల పోస్టుల భర్తీపై వీరు చర్చించినట్లు తెలిసింది. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో న్యాయవాదులు, కక్షిదారులు, సిబ్బంది, జడ్జిలు ఎదుర్కొంటున్న ఇబ్బందులూ చర్చకు వచ్చినట్లు తెలిసింది.

రేప్ చేసి, చంపేసి..

కాలువలో పడేశారు!

మలుపులు తిరుగుతున్న బాలిక కిడ్నాప్ వ్యవహారం

- ఆరు రోజులుగా నిద్రలేని ముచ్చుమర్రి గ్రామం
- ఈ దారుణానికి ఒడిగట్టింది తామేనన్న ముగ్గురు మైనర్‌లు
- కాలువలో పడేశామని ఒక రోజు, పంప్‌హౌజ్‌లో అని మరో రోజు మాట మార్చిన వైనం
- నిందితుల్లో ఇద్దరు పది, ఒకరు ఆరో తరగతి విద్యార్థులు
- ముచ్చుమర్రి పోలీసుస్టేషన్ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, నంద్యాల/పగిద్యాల/నందికొట్కూరు : అభం శుభం తెలియని తొమ్మిదేళ్ల చిన్నారి అదృశ్యమై ఆరు రోజులు గడుస్తున్నా ఆచూకీ తెలియక పోవడం సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. అత్యాచారం చేసి, చంపేశామని అనుమానిత బాలురు చెబుతుండటంతో బాలిక కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులకు నిద్ర కరువైంది. రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ ఘటనపై కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు నోరు మెదపక పోవడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. మహిళా హోంమంత్రి సైతం ఈ విషయంలో చొరవ చూపకపోవడం పట్ల గ్రామస్తులు నిప్పులు చెరుగుతున్నారు. ఇదే సమయంలో పోలీసుల విచారణ నత్త నడకను తలపిస్తోంది. దీంతో తమ బిడ్డ ఆచూకీ తెలియజేయండని బాలిక తల్లిదండ్రులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం కొత్త ఎల్లాలకు చెందిన తొమ్మిదేళ్ల బాలికపై అదే మండలం కొత్త ముచ్చుమర్రి గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ బాలురు అత్యాచారం చేశారు. బాలిక ఆదివారం ఉదయం నుంచి కనిపించకుండా పోయింది. అదే రోజు రాత్రి చిన్నారి తల్లిదండ్రులు తమ కూతురు కనిపించడం లేదని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదు. పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో సోమవారం రాత్రి పోలీసులు మేల్కొన్నారు. మంగళవారం ఉదయం ఘటన జరిగిన ప్రదేశంలో సీసీ కెమెరాలు పరిశీలించడంతో పాటు కొత్త ముచ్చుమర్రి పార్క్‌లో పనిచేసే సిబ్బందిని విచారించారు. ముగ్గురు మైనర్ బాలురపై అనుమానం రావడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు.

అన్ని చోట్లా వెతికినా ఫలితం శూన్యం

నిందితులు ఇచ్చిన సమాచారంతో బుధవారం తెల్లవారుజాము నుంచి ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌కు చెందిన సుమారు 30 మంది సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. బాలికను కృష్ణా నది నుంచి ముచ్చుమర్రి పంప్‌హౌజ్ వరకు ఉన్న లింక్ చానల్‌లో పడేశామని చెప్పడంతో పోలీసు సిబ్బంది కాలువను జల్లెడ పట్టారు. స్పీడ్ బోట్లతో కాలువ మొత్తం గాలించారు. గజ ఈత గాళ్ల సాయం తీసుకున్నారు. వలలు వేసి వెతికినా బాలిక ఆచూకీ దొరకలేదు. దీంతో అనుమానం వచ్చి నిందితులను మరోసారి విచారించగా లింక్ చానల్‌లో కాదు.. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్‌లో పడేశామని చెప్పారు. దీంతో పోలీసు సిబ్బంది ఆ ప్రాంతంలోనూ గాలింపు చేపట్టారు. బుధ, గురువారాలు రెండు రోజుల పాటు ఎంత వెతికినా చిన్నారి ఆచూకీ తెలియలేదు. నిందితుల్లో ఇద్దరు పదో తరగతి, మరొకరు ఆరో తరగతి చదువుతున్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇద్దరూ నేరం తాను చేయలేదని వాడే చేశాడంటూ ఒకరిపై ఒకరు చెబుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి తనకేమీ తెలియదని, బాలికను వారిద్దరే చంపేశారని పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. ముగ్గురు విద్యార్థులు మైనర్లు కావడంతో పోలీసులు ఆచితూచి విచారిస్తున్నారు.

నీటి కుక్కలు తినేశాయా?

చిన్నారిని ఆదివారం రాత్రే గొంతు నులిమి విద్యార్థులు హత్య చేసినట్లు సమాచారం. వీరికి పెద్దలు ఎవరైనా సహకారం అందించారా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఒక వేళ లింక్ చానల్‌లో పడేసినట్లయితే మూడు రోజులకే మృతదేహం నీటిపై తేలుతుందని పోలీసులు చెబుతున్నారు. అయితే ఇక్కడ ఉన్న నీటి కుక్కలు శవాన్ని పీక్కుతినేశాయా అనే అనుమానం పోలీసులను వేధిస్తోంది. శుక్రవారం సీన్ రీ కన్‌స్ట్రక్షన్ (బాలికను ఎక్కడి నుంచి ఎక్కడికి తీసుకెళ్లారు.. ఎక్కడ రేప్ చేశారు.. ఎలా గొంతు నులిమి చంపేశారు.. అన్న వివరాలను నిందితుల నుంచి స్పాట్‌కు తీసుకెళ్లి రాబట్టడం) చేసినట్లు తెలిసింది. అయినా బాలిక ఆచూకీ తెలుసుకోలేక పోవడంతో పోలీసులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డీఐజీ విజయరావు ఘటనా స్థలికి ఇలా వచ్చి.. అలా వెళ్లారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మైనర్ బాలిక ఫ్లెక్సీతో బంధువులంతా రోడ్డెక్కి 'వుయ్ వాంట్ జస్టిస్' అని నినదించారు. కొత్త ముచ్చుమర్రి నుంచి పాత ముచ్చుమర్రి క్రాస్ రోడ్డుకు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టి స్టేషన్‌ను ముట్టడించి రోడ్డుపై బైఠాయించారు. ఆరు రోజులైనా తమ పాప ఆచూకీ దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీఐజీ ఒక్క మాట కూడా మాట్లాడక పోవడం బాధ కలిగిస్తోందన్నారు. ఎస్ఐ జయశేఖర్ మాట్లాడుతూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, సంయమనం పాటించాలని కోరారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుకీయా బేగం పరామర్శించారు.

బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని అడ్డుకున్న పోలీసులు



కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై సిద్ధార్థరెడ్డి కారును అడ్డుకున్న పోలీసులు

బాలికను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పడానికి వెళ్తున్న ఆయన్ను పోలీసులు బ్రాహ్మణకొట్కూరు వద్ద అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. బాధితుల వద్దకు వెళ్లడానికి వీల్లేదని చెప్పారు. ఎట్టకేలకు బాధిత చిన్నారి తండ్రినే అక్కడికి పిలిపించారు. ఈ సందర్భంగా సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు బీహార్, మణిపూర్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోనే ప్రతిపక్ష పార్టీల నాయకులను బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు పంపిస్తున్నారన్నారు. పోలీసులు ఎవరి ఒత్తిళ్లతో ఇలా చేస్తున్నారని ప్రశ్నించారు. తన సొంత గ్రామంలో బాలిక హత్య జరిగితే, ఆ కుటుంబాన్ని పరామర్శించే హక్కు లేదా అని పోలీసులపై మండిపడ్డారు. ముచ్చుమర్రికి తాను వెళితే నిజాలు బయటకు వస్తాయని అధికార పార్టీ నాయకులు భయపడుతున్నారా అని నిలదీశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ శ్రేణులు కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివరామకృష్ణారెడ్డి, చంద్రమౌళి, రవియాదవ్, తులసిరెడ్డి, రమేష్ నాయుడు, ఉపేంద్రారెడ్డి, శివనాగిరెడ్డి, ఓంకారరెడ్డి, శ్రీకాంత్, నాగభూషణంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మనదే..

చంపేసెయ్..

ట్రాక్టర్‌తో తొక్కించి దళిత మహిళ దారుణ హత్య

ఆదోని నియోజకవర్గంలో టీడీపీ నేతల దాష్టీకం..



మాల గుండమ్మ మృతదేహం

- ఐదేళ్ల క్రితం నాలుగెకరాల పొలం కొనుగోలు చేసిన గుండమ్మ
- తనకూ భాగం ఉందంటూ సాగు చేసుకోనివ్వని టీడీపీ నేత
- పొలం అమ్మిన వారిని వదిలేసి దళిత మహిళపై దౌర్జన్యం
- రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయనడంతో చంపేసిన వైనం



పురుషోత్తంరెడ్డిపై దాడి చేస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: టీడీపీ నేతలు ఓ దళిత మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాథహళ్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని టీడీపీ నేత రాఘవేంద్రరెడ్డి అలియాస్ రాగప్పరెడ్డి చిన్నమ్మ తిరుమలమ్మ నుంచి మాల గుండమ్మ (55) నాలుగు ఎకరాల భూమిని 2019లో కొనుగోలు చేసింది. ఈ పొలంలో తనకు కూడా భాగం ఉందని రాఘవేంద్రరెడ్డి ఐదేళ్లుగా గుండమ్మను సాగు చేయకుండా అడ్డుకుంటున్నాడు. శుక్రవారం పొలాన్ని దున్నేందుకు మాల గుండమ్మ, ఆమె కుమారుడు కిషోర్ వెళ్లారు. విషయం తెలుసుకున్న రాఘవేంద్రరెడ్డి, ఆయన కుమారుడు శ్రీధర్‌రెడ్డి పొలంలో ట్రాక్టర్‌ను అడ్డగించి గుండమ్మతో వాగ్వాదానికి దిగారు. కర్రతో కొట్టి చంపేస్తామంటూ బెదిరించారు. ఇది మంచి పద్ధతి కాదని, తను డబ్బులిచ్చి కొన్న పొలాన్ని తాను సాగు చేసుకుంటానని.. తన వద్ద పొలానికి సంబంధించి అన్ని రికార్డులు సక్రమంగా ఉన్నాయని, మీకు భాగం ఉంటే పొలం అమ్మిన తిరుమలమ్మతో మాట్లాడుకోవాలని ఆమె చెప్పినా రాఘవేంద్రరెడ్డి ససేమిరా అన్నాడు. ఈ నేపథ్యంలోనే కోపోద్రిక్తుడైన రాఘవేంద్రరెడ్డి.. 'దీన్ని (మాల గుండమ్మ) ట్రాక్టర్‌తో తొక్కించి చంపేసెయ్.. ప్రభుత్వం మనదే.. ఎవడు అడ్డొస్తాడో చూద్దాం' అని తన కుమారుడు శ్రీధర్‌రెడ్డిని ఆదేశించాడు. అక్కడే ఉన్న మధ్యవర్తి పురుషోత్తంరెడ్డి వారించేందుకు ప్రయత్నించినా పట్టించుకోకుండా గట్టిగా తోసేస్తూ అతనిపైనా దాడి చేశారు. అనంతరం రాఘవేంద్రరెడ్డి, శ్రీధర్‌రెడ్డి గుండమ్మపై కర్రతో దాడి చేశారు. అనంతరం కింద పడిపోయిన ఆమెపై శ్రీధర్‌రెడ్డి ట్రాక్టర్ ఎక్కించాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఘటన స్థలికి చేరుకున్నారు. గాయపడ్డ పురుషోత్తంరెడ్డిని చికిత్స నిమిత్తం ఆదోని ఆస్పత్రికి తరలించారు. ఇస్వీ పోలీసులు మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాఘవేంద్రరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కె.డి.నాగరాజ్, రామకృష్ణ, సోమశేఖర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

అధికారాన్ని అడ్డుపెట్టుకుని హత్య

దళిత మహిళ మాల గుండమ్మను టీడీపీ నాయకుడు రాఘవేంద్రరెడ్డి అలియాస్ రాగప్పరెడ్డి, ఆయన కుమారుడు, ఇతర టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని హత్య చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మున్సిపల్ ౖచైర్మన్ దేవదాసు, వైస్ చైర్మన్ నరసింహులు, మండలాధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు దేవాలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గుండమ్మ మృతదేహాన్ని పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధికారంలో ఉన్నామని ఇలా దాడులు, హత్యలు చేసుకుంటూ పోతే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా, గుండమ్మను హత్య చేసిన వారు ఏ పార్టీకి చెందిన వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తి లేదని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. మృతదేహాన్ని పరిశీలించిన ఆయన బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

జీపుతో ఢీకొట్టి కిడ్నాప్..

- ఆపై ఎమ్మెల్యే ఇంట్లోకి ఎత్తుకెళ్లి విచక్షణారహితంగా దాడి
- ఆళ్లగడ్డలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్తల హత్యాయత్నం



చాకలి శ్రీనును కొట్టి పొలాల్లో పడేసిన దృశ్యం

ఆళ్లగడ్డ: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో టీడీపీ కార్యకర్తలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. పట్టణ నడిబొడ్డున అందరూ చూస్తుండగా మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త చాకలి శ్రీనును జీపుతో ఢీకొట్టి.. ఆపై కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే అఖిల ప్రియ ఇంట్లో.. ఆమె సమక్షంలో తీవ్రంగా కొట్టి పట్టణ శివారులో పడేసి వెళ్లిపోయారు. ఈ ఘటన శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. బాధితుల కథనం మేరకు.. ఆళ్లగడ్డకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత భూమా కిషోర్‌రెడ్డికి లింగందిన్నెకు చెందిన చాకలి శ్రీను అనుచరుడు. శుక్రవారం ఆరోగ్యం సరిగాలేదని ఆళ్లగడ్డలోని మెడికల్ స్టోర్‌కు వచ్చి, మందులు తీసుకుని మరో యువకుడితో కలిసి బైక్‌పై లింగందిన్నెకు బయలుదేరాడు. వారిని వాహనంలో వెంబడిస్తూ వచ్చిన ఎమ్మెల్యే అఖిలప్రియ అనుచరులు బైక్‌ను ఢీకొట్టారు. దీంతో శ్రీను, మరో యువకుడు కిందపడ్డారు. వెంటనే కర్రలు, రాడ్లతో వాహనంలోంచి దిగిన టీడీపీ రౌడీ మూకలు శ్రీనును కొట్టుకుంటూ వాహనంలో వేసుకుని ఎమ్మెల్యే ఇంట్లోకి తీసుకెళ్లారు. మరో యువకుడు పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని శ్రీనును కిడ్నాప్ చేసి ఎమ్మెల్యే ఇంట్లో బంధించారని పోలీసులకు చెప్పినా ఫలితం లేదు. తుదకు శ్రీనును చంపొద్దని బతిమాలడంతో స్పృహ కోల్పోయేలా కొట్టి పొలాల్లో పడేశారు. ఆపై పోలీసులు 108లో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

3 గంటలకు పైగా ఉత్కంఠ

శ్రీనును కిడ్నాప్ చేసి ఎమ్మెల్యే ఇంట్లో బంధించిన విషయం పట్టణంలో దావానలంలా వ్యాపించింది. టీవీ చానళ్లలో ప్రముఖంగా ప్రసారమైంది. అయినా పోలీసులు చలనం లేకుండాపోయింది. సుమారు 3 గంటలకు పైగా బాధితుడిని ఇంట్లో ఉంచి కొడుతున్నా.. అరుపులు బయటకు వినిపిస్తున్నా.. పోలీసులు మౌనం వహించారు. బాధిత కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే.. విడిచి పెట్టాలని కోరుతున్నామని చెప్పారే తప్ప కనీసం ఆ ఇంటి వద్దకు కూడా వెళ్లక పోవడం విమర్శలకు తావిస్తోంది. విషయం వైరల్ కావడంతో పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని.. టీడీపీ శ్రేణులతో చర్చలు కొనసాగించినట్లు తెలుస్తోంది. కొట్టి పొలాల్లో పడేస్తామని వారు పోలీసులకు చెప్పినట్లు సమాచారం. దీంతో ముందుగానే పోలీసులు 108 వాహనాన్ని సిద్ధం చేసుకుని ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుడికి ఆళ్లగడ్డలో ప్రథమ చికిత్స కూడా చేయించకుండా 50 కి.మీ దూరంలోని నంద్యాల వైద్యశాలకు తరలించడం గమనార్హం.

'సుప్రీం' తిరస్కరించాక ఎఫ్ఐఆరా?

ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ విస్మయం

సాక్షి, అమరావతి: సుప్రీంకోర్టు తిరస్కరించాక కూడా పోలీసులు తాజాగా తనపై కేసు నమోదు చేయడం పట్ల సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ విస్మయం వ్యక్తం చేశారు. 'సుప్రీంకోర్టులో మూడేళ్ల నడిచి.. సాక్షాత్తూ సుప్రీంకోర్టే తిరస్కరించిన కేసులో కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని ఏమనాలో మీ విజ్ఞతకే వదిలేస్తున్నా' అని ఆయన ఎక్స్‌లో శుక్రవారం పోస్టు చేశారు.

కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే జగన్‌పై కేసు

మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేష్




నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): మాజీ సీఎం వైఎస్ జగన్‌పై చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును అడ్డం పెట్టుకుని జగన్‌పై కేసు పెట్టించారన్నారు. 2021లో జరిగిన ఘటనపై ఫిర్యాదు చేస్తే పోలీసు కేసు నమోదు చేయటం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని స్పష్టం చేశారు. పోలీసుల వైఖరిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయన్నారు. రఘురామ ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుపై కేసు నమోదు చేయడం తగదన్నారు. కక్ష సాధింపు చర్యలు ఆపకపోతే భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఏపీకి కేరళ క్యాడర్ ఐఏఎస్ వీఆర్‌కే తేజ బదిలీ

సాక్షి, అమరావతి: కేరళ క్యాడర్ ఐఏఎస్ అధికారిగా పనిచేస్తున్న వీఆర్‌కే తేజ మైలవరపును ఏపీకి బదిలీ చేస్తూ కేంద్ర ప్రభుత్వ శాఖ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ) శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. అయితే వీఆర్‌కే తేజను డిప్యూటీసీఎం పవన్ కళ్యాణ్‌కు చెందిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు కేటాయిస్తారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం సాగింది.

సుప్రీంకోర్టు వారించినా వినరా?

కక్ష సాధింపుతో కోర్టు ధిక్కారానికి తెగించిన రాష్ట్ర ప్రభుత్వం



UPON hearing the counsel the Court made the following
ORDER

SLP(Crl.) No.3785/2021

Leave granted.

The appeal is allowed in terms of the signed order.

Pending application(s), if any, stands disposed of.

SLP (Crl.) No.3809 of 2021

Heard learned senior counsel for the parties.

In view of the order dated 17.05.2021 passed in this special leave petition as well as the order dated 21.05.2021 in Criminal Appeal No.515 of 2021 @ out of SLP(Crl.) No.3785/2021, no further order need be passed in this special leave petition.

The special leave petition is disposed of accordingly.

Pending application(s), if any, stands disposed of.

(ARJUN BISHT)
COURT MASTER(SH)

(R.S. NARAYANAN)
COURT MASTER (NSH)

(signed order is placed on the file)

రఘురామ పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు

సుప్రీం తీర్పులు పట్టవా?

ఏదైనా కేసులో 77 రోజుల తరువాత సాక్షులను విచారించడం సరికాదని సుప్రీంకోర్టు గతంలోనే తీర్పు చెప్పింది. రఘురామ ఫిర్యాదు విషయంలో ఏకంగా మూడేళ్ల తరువాత... అదీ అప్పటికే ఆ ఆరోపణలతో దాఖలైన పిటిషన్లను హైకోర్టు, సుప్రీంకోర్టు తిరస్కరించిన అంశాలతో చంద్రబాబు ప్రభుత్వం కేసు నమోదు చేయడం విస్మయపరుస్తోందని న్యాయ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వం, పోలీసుల చర్య కచ్చితంగా కక్ష సాధింపేనని స్పష్టం చేస్తున్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు ఇప్పటికే తోసిపుచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేయడం కోర్టు ధిక్కారమేనని తేల్చి చెబుతున్నారు.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబు సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కాకుండా నారా లోకేశ్ తయారు చేసుకున్న రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతున్నట్లు మరోసారి నిరూపితమైంది! ఏకంగా హైకోర్టు, సుప్రీం కోర్టు మూడేళ్ల క్రితం తోసిపుచ్చిన ఆరోపణల ఆధారంగా కూటమి సర్కారు తాజాగా తప్పుడు కేసు నమోదు చేయడమే అందుకు తాజా నిదర్శనం. 2021లో తనను సీఐడీ అధికారుల కస్టడీలో గుర్తు తెలియని వ్యక్తులు తీవ్రంగా కొట్టారని.. హింసించారని నాటి ఎంపీ కనుమూరి రఘురామకృష్ణరాజు చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని వైద్య పరీక్షలు గతంలోనే నిర్ధారించాయి. ఆ ఆరోపణల ఆధారంగా రఘురామకు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించగా, అదే ఆరోపణల ఆధారంగా సీబీఐ విచారణకు ఆదేశించేందుకు సుప్రీం కోర్టు సైతం తిరస్కరించింది. తాజాగా అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధంగా వ్యవహరించేందుకు బరి తెగించింది. నాడు న్యాయస్థానాలు తోసిపుచ్చిన ఆరోపణలతోనే రఘురామరాజు మూడేళ్ల తరువాత మెయిల్‌లో ఫిర్యాదు చేయడం... ఆ వెనువెంటనే ఐపీఎస్ అధికారులు పీవీ సునీల్ కుమార్, పీఎస్ఆర్ ఆంజనేయులు, నాటి గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిలతోపాటు మాజీ సీఎం వైఎస్ జగన్‌పై కేసులు నమోదు చేయడం విస్మయపరుస్తోంది. చంద్రబాబు ప్రభుత్వ చర్య కక్ష సాధింపే కాదు.. కోర్టు ధిక్కారమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో అరాచకానికి ఈ పరిణామాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

బెడిసికొట్టిన పన్నాగం..

రఘురామను హింసించలేదన్న వైద్య నివేదికలు

సమాజంలో వర్గ విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న కె.రఘురామకృష్ణరాజుపై సీఐడీ అధికారులు 2021 మే నెలలో కేసు నమోదు చేశారు. ఆయన్ను హైదరాబాద్‌లో అరెస్ట్ చేసే సమయంలో సీఐడీ అధికారులపై దాడికి పాల్పడినా ఎంతో సంయమనం పాటిస్తూ మంగళగిరిలోని ప్రధాన కార్యాలయానికి తరలించి విచారించారు. ఈ క్రమంలో రఘురామరాజు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన ప్లేటు ఫిరాయించి గుంటూరు మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచిన సమయంలో అసత్య ఆరోపణలు చేశారు. కస్టడీలో సీఐడీ అధికారులు తనను కొట్టారని... హింసించారని ఆరోపిస్తూ బెయిల్ ఇవ్వాలని కోరారు. మరోవైపు తనను సీఐడీ అధికారులు కస్టడీలో హింసించారని ఆరోపిస్తూ దానిపై విచారణ జరిపించాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాంతో ఆయనకు వైద్యుల బృందంతో పరీక్షలు నిర్వహించి నివేదిక సమర్పించాలని గుంటూరు జీజీహెచ్ వైద్య అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి నేతృత్వంలో నలుగురు వైద్యుల బృందం రఘురామకు వైద్య పరీక్షలు నిర్వహించింది. ఎక్స్‌రే, స్కాన్లు తీసింది. రఘురామ శరీరంపై ఎలాంటి గాయాలు లేవని.. సీఐడీ అధికారులు కస్టడీలో ఆయన్ను శారీరకంగా హింసించలేదని నిర్ధారించింది. అదే విషయాన్ని హైకోర్టుకు నివేదించింది. సీఐడీ అధికారులు నిజంగానే కస్టడీలో శారీరకంగా హింసించి ఉంటే అవి ఎక్స్‌రే, స్కాన్ రిపోర్టులలో బయటపడేవి. అలాంటిది ఏమీ లేకపోవడంతో వైద్య బృందంలోని నలుగురు డాక్టర్లు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తూ నివేదిక సమర్పించారు. ఒకవేళ నలుగురు వైద్యుల్లో ఎవరైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసి ఉంటే మరోసారి వైద్య పరీక్షలు చేయాలని ఇతర ఆస్పత్రులకు హైకోర్టు అప్పుడే ఆదేశించి ఉండేది. ఈ నేపథ్యంలో రఘురామను సీఐడీ అధికారులు శారీరకంగా హింసించలేదని పూర్తి ఆధారాలతో వైద్యులు నిగ్గు తేల్చిన నివేదికను హైకోర్టు ఆమోదించింది. ఆయనకు బెయిల్ మంజూరు చేసేందుకు న్యాయస్థానం నిరాకరించడంతో రఘురామను జ్యుడిషియల్ కస్టడీ కోసం గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. తమ కస్టడీలో ఉన్న నిందితుడిని జైలుకు తరలించడంతో సీఐడీ / పోలీసు అధికారుల బాధ్యత ముగుస్తుంది. తరువాత పరిణామాలతో వారికి సంబంధం ఉండదు.

ఆరోపణలు తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

సీబీఐ విచారణకు తిరస్కరణ

హైకోర్టులో చుక్కెదురు కావడంతో రఘురామ దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుంటూరు జిల్లా జైలులో ఒక రోజు ఉన్న తరువాత సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం అక్కడి నుంచి పోలీసుల వాహనంలో కాకుండా తన సొంత వాహనంలో హైదరాబాద్‌లోని ఆర్మీ ఆసుపత్రికి వెళ్లారు. రెండు రోజుల తరువాత ఆర్మీ ఆసుపత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన్ను పోలీసులు కొట్టినట్టు ఆ వైద్య పరీక్షల్లోనూ వెల్లడి కాలేదు. అయితే సుప్రీంకోర్టును మరోసారి ఆశ్రయించిన ఆయన.. సీఐడీ కస్టడీలో తనను గుర్తు తెలియని వ్యక్తులు తీవ్రంగా కొట్టారని ఆరోపిస్తూ సీబీఐతో విచారణ నిర్వహించాలని కోరారు. హైదరాబాద్ ఆర్మీ ఆసుపత్రి వైద్యులు ఇచ్చిన నివేదికను పరిశీలించిన సుప్రీంకోర్టు రఘురామరాజు ఆరోపణలను తోసిపుచ్చింది. సీబీఐ విచారణ నిర్వహించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. దాంతో రఘురామ ఎత్తుగడ బెడిసికొట్టింది. తనను సీఐడీ అధికారులు తీవ్రంగా కొట్టారని, శారీరకంగా హింసించారంటూ రఘురామ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని నిర్ధారణ అయ్యింది. దాంతో ఆ అధ్యాయానికి తెర పడింది.

కక్ష సాధింపుతో తప్పుడు కేసు..

ఒక రోజు ముందే పోలీసులకు ఉప్పు..

రెడ్ బుక్ రాజ్యాంగాన్నే తమ ప్రభుత్వం అనుసరిస్తుందని సీఎం చంద్రబాబు మరోసారి నిరూపించారు. రఘురామను సీఐడీ అధికారులు కస్టడీలో హింసించలేదని నిర్ధారిస్తూ హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను బేఖాతర్ చేశారు. గుంటూరు జీజీహెచ్, హైదరాబాద్ ఆర్మీ ఆసుపత్రి వైద్యుల నివేదికలను బుట్ట దాఖలు చేస్తూ కేవలం కక్ష సాధింపే తమ విధానమని మరోసారి చాటుకున్నారు. 2021 మేలో తనను సీఐడీ అధికారులు కస్టడీలో హింసించారని ఆరోపిస్తూ మూడేళ్ల తరువాత రఘురామరాజు ఈ ఏడాది జూన్ 11న పోలీసులకు ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. మూడేళ్ల క్రితం తనను గుర్తు తెలియని వ్యక్తులు కొట్టారని కోర్టులో పిటిషన్ వేసిన ఆయన.. ఇప్పుడు ఇచ్చిన ఫిర్యాదులో మాత్రం 2021లో సీఐడీ అదనపు డీజీగా ఉన్న పీవీ సునీల్‌కుమార్, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న పీఎస్ఆర్ ఆంజనేయులు(వాస్తవానికి అప్పట్లో ఏసీబీ అదనపు డీజీగా ఉన్నారు)తోపాటు నాటి సీఎం జగన్‌ను నిందితులుగా పేర్కొనడం గమనార్హం. వారితోపాటు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ ప్రభావతి, సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌పై కూడా ఆరోపణలు చేశారు. మరో విచిత్రమేంటంటే రఘురామరాజు ఈ ఏడాది జూన్ 11న ఫిర్యాదు చేయగా అంతకు ఒకరోజు ముందే అంటే జూన్ 10నే ఆయన ఫిర్యాదుపై పోలీసులు న్యాయ సలహా కోరారు. అంటే చంద్రబాబు ప్రభుత్వం ఎంత కుట్రపూరితంగా వ్యవహరిస్తోందో స్పష్టమవుతోంది. రఘురామ ఫిర్యాదు ఆధారంగా గుంటూరు నగరపాలెం పోలీసులు ఈనెల 11న కేసు నమోదు చేశారు. వైఎస్ జగన్, ఐపీఎస్ అధికారులు సునీల్ కుమార్, ఆంజనేయులు, సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్, డాక్టర్ ప్రభావతిలతోపాటు మరికొందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

క్లుప్తంగా...

సీఎం ఇంటి వద్ద ప్రజలకు అనుమతి నిరాకరణ

- వినతులతో కరకట్ట రోడ్డుపై జనం పడిగాపులు

సాక్షి, అమరావతి: తమ బాధలు చెప్పుకోవడానికి గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం వద్దకు వచ్చిన ప్రజలకు సీఎం భద్రతాధికారులు శుక్రవారం అనుమతి నిరాకరించారు. దీంతో ఏం చేయాలో తెలియక వారు కరకట్ట రోడ్డుపైనే చంద్రబాబు కోసం గంటల తరబడి పడిగాపులు కాశారు. బాబు తన నివాసం నుంచి కాన్వాయ్‌లో బయటకు వెళుతున్న క్రమంలో రోడ్డుపై వేచి ఉన్న వారి నుంచి వినతులు తీసుకున్నారు.

కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పునరుద్ధరణ

- చైర్మన్‌గా చిత్తూరు జిల్లా కలెక్టర్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు తన నియోజకవర్గం కుప్పం అభివృద్ధిపై ఇప్పుడు దృష్టి సారించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులిచ్చారు. కుప్పం డెవలప్‌మెంట్ అథారిటీకి చిత్తూరు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని, సబ్ కలెక్టర్ స్థాయి ఐఏఎస్ అధికారిని అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తారని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కుప్పం సమగ్రాభివృద్ధికి ప్రణాళికల రూపకల్పన, కార్యక్రమాల అమలు, ప్రాజెక్టులు చేపట్టడం వంటి పూర్తి బాధ్యతలు ప్రాజెక్టు డైరెక్టర్ చూస్తారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి 19 పోస్టులను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని అదనపు ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తారు. తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను రెవెన్యూ శాఖ నుంచి డిప్యుటేషన్‌పై, మిగతా పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి అవసరమైన బడ్జెట్‌ను ఏటా ఆర్థిక శాఖ కేటాయించాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఆ నిర్మాణాలపై ఐఐటీ ఇంజనీర్లతో అధ్యయనం

- మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ



సాక్షి, అమరావతి: సీఆర్డీఏ పరిధిలో నిలిచిపోయిన నిర్మాణాల పటిష్టతను తెలుసుకునేందుకు ఐఐటీ ఇంజనీర్లతో అధ్యయనం చేయించనున్నట్లు మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐకానిక్ భవనాల ఫౌండేషన్ పటిష్టతను నిర్ధారించే బాధ్యతను ఐఐటీ మద్రాస్‌కు అప్పగించనున్నామని, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల క్వార్టర్ల పటిష్టత నిర్ధారణ ఐఐటీ హైదరాబాద్ ఇంజనీర్లకు అప్పగిస్తామన్నారు. గతంలో సీఆర్డీఏ కోసం పనిచేసిన 47 మంది కన్సల్టెంట్లు వెళ్లిపోయారని, మళ్లీ కొత్తగా టెండర్లు పిలిచి కన్సల్టెంట్లను నియమించుకోవాలన్నారు. సీఆర్డీఏలో సిబ్బంది కొరత ఉందని, గతంలో ఉన్న సిబ్బందిలో 528 మంది తక్కువగా ఉన్నారన్నారు.


త్వరలో నూతన పారిశ్రామిక విధానం

- బాధ్యతలు స్వీకరించిన పరిశ్రమలశాఖ డైరెక్టర్ శ్రీధర్

సాక్షి, అమరావతి: పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో త్వరలోనే నూతన పారిశ్రామిక విధానం తీసుకురానున్నట్లు పరిశ్రమల శాఖ డైరెక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రకటించారు. ఇందుకోసం వియత్నాం, థాయిలాండ్, ఇండోనేషియా, దుబాయి, అబుదాబి వంటి పారిశ్రామిక విధానాలతో పాటు దేశంలో అత్యధికంగా పెట్టుబడులను ఆకర్షిస్తున్న తమిళనాడు, గుజరాత్, హరియాణా, మహారాష్ట్రల పారిశ్రామిక విధానాలు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ చెరుకూరి శ్రీధర్ బాధ్యతలు స్వీకరించి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు కావలసిన నైపుణ్య శిక్షణ కోసం ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి పెద్దపీట

- మంత్రి కొలుసు పార్థసారథి



లబ్బీపేట (విజయవాడ తూర్పు): రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. విజయవాడలోని వివంత హోటల్లో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా, దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంయుక్త ఆధ్వర్యంలో 'ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అవకాశాలు' అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పార్థసారథి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు తరలిరావాలని కోరారు. మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ అదనపు కార్యదర్శి మిన్హజ్ ఆలం, దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జాతీయ అధ్యక్షులు నర్రా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసత్యాలు చెబుతున్న షర్మిల..
ఇవిగో వాస్తవాలు

'అమ్మకు వందనం' పథకంపై చంద్రబాబు యూటర్న్

సర్వత్రా విమర్శలతో సంకటస్థితిలో టీడీపీ ప్రభుత్వం

సరిగ్గా ఈ సమయంలో నేనున్నానంటూ రంగంలోకి దిగిన షర్మిల

షర్మిల ఇకనైనా తెలుసుకో..

ఇదీ వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో - 2019

అమ్మఒడి
- పిల్లల చదువులకు ఏ పేదింటి తల్లీ భయపడొద్దు.
- పిల్లలని బడికి పంపితే చాలు ప్రతి తల్లికి సంవత్సరానికి రూ.15,000 ఇస్తాం.

బడికి పిల్లలను పంపితే చాలు ప్రతి తల్లికి ఏడాదికి రూ.15వేలు ఇస్తామని పేర్కొన్న వైఎస్సార్‌సీపీ 2019 ఎన్నికల మేనిఫెస్టో ఇది

ఇదీ కూటమి మేనిఫెస్టో - 2024

సూపర్ సిక్స్
- యువతకు 20 లక్షల ఉద్యోగాలు / నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం

స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు ఇస్తామని పేర్కొన్న టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో-2024 ఇది

సాక్షి, అమరావతి: 'అమ్మ ఒడి' పథకం విషయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలను మోసం చేశారని ఏపీసీసీ చీఫ్ షర్మిల వ్యాఖ్యానించడం పట్ల సర్వత్రా ఆశ్చర్యం, ఆగ్రహం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వంలో చెప్పింది చెప్పినట్లు అమలు చేసి చూపిన చరిత్ర వైఎస్ జగన్‌ది. పిల్లలను బడికి పంపే తల్లులకు ఏటా రూ.15 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు మాట నిలుపుకున్నారు. జగన్ ప్రతి తల్లికి రూ.15 వేలు ఇచ్చారని, తాము అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు సహా కూటమి నేతలంతా హామీ ఇచ్చారు. జగన్, చంద్రబాబు హామీ మధ్య తేడా ఇంత స్పష్టంగా కనిపిస్తోంటే ఎవరు మోసం చేసింది షర్మిలకు కనిపించడం లేదు కాబోలు. జగన్ కూడా ఎంత మంది పిల్లలుంటే అంత మందికి ఇస్తానని చెప్పారని ఇప్పుడు షర్మిల చెప్పడం.. ముమ్మాటికీ మాట తప్పిన చంద్రబాబును కాపాడటానికేనని స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా కనిపించే మూడు పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ అయితే.. కనిపించని నాలుగో పార్టీనే రాష్ట్ర కాంగ్రెస్ అన్నది షర్మిల మాటలను బట్టి మరోసారి నిరూపితమైంది. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను చూడకుండానే శుక్రవారం ఆమె విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్ జగన్‌పై ఆరోపణలు గుప్పించడం విస్తుగొలుపుతోంది. ప్రతిపక్ష పార్టీగా అధికార పక్ష హామీలపై నిలదీయాల్సింది పోయి.. జగన్‌ను తప్పు పట్టడం విస్తుగొలుపుతోంది. అసాధ్యమైన హామీలతో ప్రజల్ని మోసగించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మేనిఫెస్టో అమలు చేయలేక ఆత్మరక్షణలో పడగానే షర్మిల హఠాత్తుగా తెరపైకి వచ్చారు. తల్లికి వందనం పథకంపై చంద్రబాబు యూటర్న్ తీసుకోవడాన్ని ప్రశ్నిస్తారని అంతా భావించారు. సూపర్ సిక్స్ మేనిఫెస్టోను ఎప్పటి నుంచి అమలు చేస్తారని నిలదీస్తారనుకున్నారు. కానీ అందుకు విరుద్ధంగా షర్మిల చంద్రబాబుకు రాజకీయంగా వత్తాసు పలకడం ద్వారా చంద్రబాబు వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకేనని స్పష్టమైంది. చంద్రబాబు 'తల్లికి వందనం' పథకం అమలులో ప్రజలను మోసగించిన తీరును వివరిస్తూ సాక్షి పత్రిక ప్రచురించిన కథనాన్ని చూపిస్తూ షర్మిల వైఎస్సార్‌సీపీని విమర్శిస్తూ చంద్రబాబు స్క్రిప్ట్‌ను వినిపించడం విస్మయపరిచింది.

జగనన్న అమ్మ ఒడితో విద్యా విప్లవం

- 'జగనన్న అమ్మ ఒడి పథకం' దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. విద్యా రంగంలో విప్లవాన్ని తీసుకురావడమే కాకుండా సామాజిక, సాంఘిక సంస్కరణగా గుర్తింపు పొందింది. జగన్ కచ్చితమైన క్యాలెండర్‌ను అనుసరిస్తూ ఈ పథకం కింద నాలుగేళ్లలో రూ.26,067.28 కోట్లు తల్లుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేశారు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే అన్ని పథకాలు ఈపాటికి సక్రమంగా అమలయ్యేవని ప్రజలు ఇప్పటికే గుర్తించారు. ఇప్పటికే జగనన్న అమ్మ ఒడి పథకం రూ.6,500 కోట్లు తల్లుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అయ్యేవి. విద్యా దీవెన పథకం రెండు విడతల్లో రూ.1,400 కోట్లు ఖాతాల్లో వేసేవారు. వసతి దీవెన పథకం కింద రెండు విడతల కింద రూ.1,100 కోట్లు లబ్ధిదారులకు అందేవి. వైఎస్సార్ రైతు భరోసా మొదటి విడత కింద రూ.7 వేల కోట్లకుపైగా అన్నదాతలకు జమ చేసేవారు. మత్స్యకార భరోసా కింద రూ.130 కోట్లు మత్స్యకారులకు దక్కేవి. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పథకం కింద రూ.1,400 కోట్లు అందేవి.
- ఈ విషయాలన్నీ చెబుతూ షర్మిల చంద్రబాబును నిలదీయాలి. సూపర్ సిక్స్ పథకాలు ఎప్పటి నుంచి అమలు చేస్తారని ప్రశ్నించాలి. రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం, పిల్లలందరికీ రూ.15 వేలు, మత్స్యకార భరోసా, 1.85కోట్ల మంది మహిళలకు నెలకు రూ.1,500, 1.60 కోట్ల మంది నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణం, ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఎప్పుడు ఇస్తారని అడగాలి. బాబుకు మేలు చేసేందుకే ఆమె రాజకీయం చేస్తున్నారని ప్రజలు గమనించారు. అందుకే ఆమెకు కడప లోక్‌సభ ఎన్నికల్లో డిపాజిట్ దక్కలేదు. రాష్ట్రంలో పేదల గొంతును వినిపించేది.. సంక్షేమం, అభివృద్ధి కోసం పోరాడేది వైఎస్సార్‌సీపీయేనని ప్రజలు గుర్తించారన్నది సుస్పష్టం.

బీజేపీ, చంద్రబాబు కోసమే
షర్మిల రాజకీయాలు



- మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం
- షర్మిల.. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో చదవాలి
- శ్వేతపత్రాల పేరుతో చంద్రబాబు పచ్చి అబద్ధాలు
- పోలవరాన్ని నాశనం చేసింది చంద్రబాబే
- తల్లికి వందనంపై మాట తప్పారు
- ఇప్పుడు జగన్ ఉండి ఉంటే అమ్మ ఒడి, మత్స్యకార భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన అమలై ఉండేవి
- రెడ్ బుక్ కేసులన్నీ అధికార అహంభావాన్ని తీర్చుకునేందుకే

సాక్షి, అమరావతి: షర్మిల కాంగ్రెస్ పార్టీలో ఉంటూ బీజేపీ, చంద్రబాబు కోసమే రాజకీయం చేస్తున్నారని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) మండిపడ్డారు. 'షర్మిల ఉన్నది ఏ పార్టీ? సొంత పార్టీనా? కాంగ్రెస్ పార్టీనా? కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తెలుగుదేశం పార్టీకి అనుకూలమా? వ్యతిరేకమా? ప్రస్తుతం వ్యతిరేకమే కదా! టీడీపీ, జనసేన, బీజేపీలకు వ్యతిరేకంగా రాజకీయాలు చేసే కాంగ్రెస్ పార్టీలో షర్మిల ఉన్నారు. కానీ ఆ పార్టీలన్నీ కలిసి ఏపీలో ఏర్పాటు చేసిన ప్రభుత్వాన్ని ఆమె వెనకేసుకొస్తూ సమర్థిస్తున్నారు. షర్మిల ప్రతిపక్షంలో ఉన్న ఒక రాజకీయ పార్టీని(వైఎస్సార్‌సీపీని) విమర్శిస్తున్నారంటే అంటే ఎవరి కోసం రాజకీయాలు చేస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. బీజేపీ, టీడీపీ.. ఈ ఇద్దరి కోసం ఆంధ్రప్రదేశ్‌లో షర్మిల రాజకీయాలు చేస్తున్నారనేది నిజం' అని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తాము కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ పలు అంశాల్లో మోసం చేశారు అని మాట్లాడితే, కూటమిలో ఎవరో ఒకరు సమాధానం చెప్పాల్సింది పోయి.. కాంగ్రెస్ సమాధానం చెబుతుండటం విడ్డూరం అన్నారు. కాంగ్రెస్ పార్టీ మమ్మల్ని విమర్శిస్తూ.. బీజేపీ, టీడీపీ ప్రభుత్వాన్ని సమర్థిస్తోందంటే రాజకీయాలు ఏ స్థాయికి దిగజారాయో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. 'పిల్లలను బడులకు పంపించే తల్లులకు 'అమ్మ ఒడి' ఇస్తామని మేనిఫెస్టోలో మేం ప్రకటించాం. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో చదివి విమర్శలు చేస్తే బాగుంటుంది. చదవకుండా నోటికొచ్చినట్లు మాట్లాడటం, కూటమి ప్రభుత్వాన్ని సమర్థించే విధంగా మాట్లాడటం ద్వారా షర్మిల ఏం పొందాలనుకుంటున్నారో ప్రజలకు అర్థమవుతోంది. మేనిఫెస్టోను తు.చ.తప్పకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసింది. మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తీసేసిన చరిత్ర చంద్రబాబు సొంతం. ఇప్పుడు కూడా అదే చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను వ్యతిరేకించకుండా, సమర్థించడం ఏమిటో ప్రజలకు షర్మిల సమాధానం చెప్పాలి' అని నిలదీశారు. పేర్ని నాని ఇంకా ఏమన్నారంటే..

ఇది తప్పుడు కేసు కాదా?

- 2021లో రఘురామకృష్ణరాజును అరెస్టు చేసినప్పుడు హత్య చేయబోయారని, ఆ విషయంలో జగన్ మూడో ముద్దాయి అని ఇప్పుడు కేసు పెట్టడం ఏమిటి? అప్పుడు రఘురామకృష్ణరాజు ఒకరోజు మాత్రమే జైల్లో ఉన్నారు. ఆ తర్వాత బెయిల్ మీద బయటకొచ్చారు. ఆ సమయంలో తనను పోలీసులు కొట్టారంటూ రఘురామ కోర్టుకు తెలిపారు. దానిపై హైకోర్టు సూచనల మేరకు గుంటూరు జీజీహెచ్ వైద్యుల బృందం పరీక్షించి దెబ్బలేమీ కొట్టలేదని రిపోర్టు ఇచ్చింది. జైలు నుంచి విడుదలయ్యాక సికింద్రాబాద్ మిలటరీ ఆస్పత్రిలో చేరారు. వాళ్లు కూడా దెబ్బలేమీ లేవని రిపోర్టు ఇచ్చారు. దీనిపై సీబీఐ విచారణ చేయాలని కోరితే సుప్రీంకోర్టు నిరాకరించింది.
- రఘురామకు దెబ్బలు లేవని చెప్పినా, మూడేళ్ల తర్వాత ఇప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఏమిటి? ఇది తప్పుడు కేసు కాదా? ఇది రెడ్ బుక్ కేసు అని అర్థం అవుతోంది. అధికార అహంభావాన్ని తీర్చుకునేందుకే ఇలాంటి రెడ్ బుక్ కేసులు పెడుతున్నారు. ఈ కేసులేవీ నిలబడవు.

తప్పుడు లెక్కలతో శ్వేత పత్రాలు

- ఏపీలో కూటమి ప్రభుత్వం అసత్యాలతో, తప్పుడు లెక్కలతో శ్వేతపత్రాలు విడుదల చేస్తోంది. అందులో పేర్కొన్నవన్నీ పచ్చి అబద్ధాలే. చంద్రబాబు అంటే ఆరడుగుల అబద్ధం. గత ప్రభుత్వంపై నిందలు మోపడమే ధ్యేయం. మోసం.. అనేదే చంద్రబాబు నైజం. ఆయన 30 రోజుల పాలనలోనే అది స్పష్టమైంది. చార్జీలు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ ఇస్తామన్నారు. ఇప్పుడు ఎక్కువగా బిల్లులు వేస్తున్నారు. విలేకరులు అడిగితే చంద్రబాబు దబాయిస్తున్నారు.
- అమరావతి నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పడం లేదు. సంపద సృష్టిస్తామంటూ.. అదే పనిగా అప్పులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. తల్లికి మాత్రమే వందనం.. అంటూ పిల్లలకు ఎగనామం పెట్టారు. అమరావతి, పోలవరం పనులపైనా స్పష్టత లేదు. ఉచిత ఇసుకలో ఉచితం ఉండదు. నాడు సినిమా టికెట్ల విషయంలో వైఎస్ జగన్‌ని తప్పు బట్టారు. ఇప్పుడు అదే జీఓను అనుసరిస్తున్నారు. ఇప్పుడు జగన్ ఉండి ఉంటే ఈ పాటికే అమ్మ ఒడి, మత్స్యకార భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన అన్ని పథకాలు అంది ఉండేవి.
- చంద్రబాబు చేసేవన్నీ మోసాలేనని పదే పదే రుజువు అవుతోంది. రాష్ట్రం అప్పులపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వాస్తవాలు చెబుతున్నా, పట్టించుకోకుండా రాద్ధాంతం చేస్తున్నారు. 2014, 2024లో టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోలన్నీ మోసం, దగా. అసత్యాలు, తప్పుడు లెక్కలు. గతంలో 600కు పైగా హామీలిచ్చి.. ఏ ఒక్కటీ అమలు చేయలేదు.

కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిందే

- పలువురు అధికారులకు కోర్టు ధిక్కారం కింద జరిమానా
- శాంతిప్రభకు 6 నెలల జైలుశిక్ష.. హైకోర్టు తీర్పు
- అప్పీల్‌కు వీలుగా ఆరు వారాలపాటు తీర్పు నిలుపుదల

సాక్షి, అమరావతి: కోర్టు ఇచ్చిన ఆదేశాలకు ఎలాంటి భాష్యం చెప్పకుండా వాటిని యథాతథంగా అమలు చేయాల్సిందేనని హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ బాధ్యత ఉన్నతాధికారులదేనని స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేయనందుకు అప్పటి వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.కృష్ణబాబు, వైద్య, ఆరోగ్య విభాగం సంచాలకుడు వి.రామిరెడ్డి, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి ఎస్.శాంతిప్రభలపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వీరంతా కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని తేల్చింది. ఈ నేపథ్యంలో కృష్ణబాబు, రామిరెడ్డి, కృతికా శుక్లా రూ.2 వేల చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశించింది. శాంతిప్రభకు ఆరు నెలల సాధారణ జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. అయితే ఈ తీర్పుపై అప్పీల్ చేసుకునేందుకు తీర్పు అమలును ఆరు వారాల పాటు నిలుపుదల చేసింది. ఈలోపు అప్పీల్ దాఖలు చేయకుంటే నలుగురు అధికారులు ఆగస్టు 19 సాయంత్రం 5 గంటల కల్లా హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) ముందు లొంగిపోవాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల తీర్పు వెలువరించారు. గతంలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ నియామకాలకు సంబంధించి పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. సుదీర్ఘ విచారణ జరిపిన హైకోర్టు పిటిషనర్లకు ఉద్యోగాలు ఇవ్వాలని 2022లో ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అయితే అధికారులు ఈ ఆదేశాలను అమలు చేయలేదంటూ అభ్యర్థులు మళ్లీ హైకోర్టులో వేర్వేరుగా కోర్టు ధిక్కార వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఇందులో కృష్ణబాబు, రామిరెడ్డి, కృతికా శుక్లా, శాంతిప్రభలను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారు. ఈ ధిక్కార వ్యాజ్యాలపై జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల విచారణ జరిపారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పు వెలువరిస్తూ అధికారుల తీరును తప్పుపట్టారు. కోర్టు ఆదేశాలు ఇచ్చిన వారికి కాకుండా తమకు నచ్చిన వారిని మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లుగా నియమించారంటూ ఆక్షేపించారు. ముఖ్యంగా శాంతిప్రభ తీరును తప్పుపట్టారు. కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా ఆమె సొంత నిర్ణయం తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశించిన వారిని కాకుండా తనకు నచ్చిన వారిని నియమించుకోవడం కోర్టు ఆదేశాలను ధిక్కరించడమే అవుతుందన్నారు. మిగిలిన ముగ్గురు ఉన్నతాధికారులకు కోర్టు ఆదేశాలు అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. అయితే వారు ఆమెపై నెట్టేశారన్నారు.

ఎవరి సంతోషం కోసం
మూడేళ్లకు అక్రమ కేసు?

- దురుద్దేశం, రాజకీయ కక్షతోనే వైఎస్ జగన్‌పై కేసు నమోదు
- పోలీసులు ఓ కొత్త సంప్రదాయానికి తెర తీశారు
- ఇది ఏమాత్రం సమంజసం కాదు
- మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పక్కా పన్నాగంతో తప్పుడు కేసు నమోదు చేశారని మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, వ్యక్తిగత ద్వేషంతోనే రఘురామకృష్ణరాజు అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. అరెస్ట్ చేసిన తరువాత ఆయన్ను కస్టడీలో వేధించినట్లు చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఆయన అరెస్ట్ విషయంలో, ఆ తరువాత కూడా సీఐడీ అధికారులు నిబంధనల మేరకే వ్యవహరించారని స్పష్టం చేశారు. ఎవరి సంతోషం కోసమో మూడేళ్ల తర్వాత తప్పుడు కేసు నమోదు చేసి పోలీసులు ఓ సాంప్రదాయానికి తెర తీశారని చెప్పారు. ఈ చర్యకు భవిష్యత్తులో వారే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

ఎవరినో సంతోషపెట్టడం.. మరెవరినో ఇబ్బంది పెట్టడం కోసమే

2021 మే 14న అప్పటి ఎంపీ రఘురామకృష్ణరాజుపై కేసు నమోదు కాగా ఆయన్ను హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి సంబంధిత జ్యూరిస్ డిక్షన్ పరిధిలోని గుంటూరు కోర్టుకు తీసుకొచ్చారని పొన్నవోలు చెప్పారు. 'పోలీస్ కస్టడీలో తనను టార్చర్ చేశారంటూ రఘురామకృష్ణరాజు విచిత్రంగా మూడేళ్ల తర్వాత.. గత నెల 11న గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈనెల 11న కేసు నమోదు చేశారు. ఆ ఫిర్యాదుపై నెల రోజుల తరవాత పోలీసులు స్పందించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో పాటు కొందరు పోలీస్ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల మీద ఎఫ్ఐఆర్ నమోదు చేసి 307 సెక్షన్ కింద కేసు పెట్టారు. ఎవరినో సంతోషపెట్టడం, మరెవరినో ఇబ్బంది పెట్టడం కోసమే ఈ కేసు నమోదు చేసినట్లు స్పష్టమవుతోంది' అని పేర్కొన్నారు.

వాంగ్మూలం ఒకటి.. ఫిర్యాదు మరొకటి

2021లో రఘురామకృష్ణరాజును గుంటూరు కోర్టులో హాజరు పర్చినప్పుడు ఆయన చెప్పిన మాటలకు, ఇప్పుడు ఫిర్యాదులో చేసిన ఆరోపణలకు ఏమాత్రం పొంతన లేదు. ముఖానికి రుమాలు కట్టుకున్న గుర్తు తెలియని వ్యక్తులు పోలీసు కస్టడీలో తనను టార్చర్ చేశారని నాడు మెజిస్ట్రేట్ ఎదుట ఆయన వాంగ్మూలం ఇచ్చారు. కానీ గత నెలలో చేసిన ఫిర్యాదులో మాత్రం విచిత్రంగా పోలీసు ఉన్నతాధికారుల పేర్లు చెప్పారు. సీనియర్ ఐపీఎస్ అధికారులు సునీల్, సీతారామాంజనేయుల పేర్లు ప్రస్తావించారు. తనను హింసిస్తున్న వీడియోను వైఎస్ జగన్ చూశారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇంతకన్నా తప్పుడు కేసు ఉండదు

మూడేళ్ల తర్వాత ఫిర్యాదు చేస్తే.. అందులో ప్రస్తావించిన వారందరిపైనా ఇప్పుడు కేసు నమోదు చేయడం పూర్తిగా అసమంజసం. అసలు ఈ కేసులో వైఎస్ జగన్ ఎలా నిందితుడు అవుతారు? ఇంతకన్నా తప్పుడు కేసు మరొకటి ఉండదు. కేవలం దురుద్దేశం, ద్వేషంతో రఘురామరాజు ఫిర్యాదు చేస్తే పోలీసులు అత్యుత్సాహంగా స్పందించారు. నాడు మెజిస్ట్రేట్ ఎదుట రఘురామ చెప్పిందేమిటి? మూడేళ్ల తర్వాత ఫిర్యాదు చేయడం ఏమిటి? అని పోలీసులు కనీసం ఆలోచించరా?

టార్చర్ చేయనేలేదు

రఘురామరాజును నాడు సీఐడీ కస్టడీలో ఏమాత్రం టార్చర్ చేయలేదు. ఆయన కోరడంతో కోర్టు ఆదేశాల మేరకు వైద్య బృందం పరీక్షించి రఘురామ శరీరంపై ఎలాంటి గాయాలు లేవని నివేదిక ఇచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదల అయిన తరువాత రఘురామరాజు ఒక్కరే తన సొంత వాహనంలో హైదరాబాద్‌లోని ఆర్మీ ఆస్పత్రికి వెళ్లారు. పోలీసుల సూచనను బేఖాతర్ చేస్తూ అలా వెళ్లిన రఘురామరాజు ఆర్మీ ఆస్పత్రిలో తన శరీరంపై గాయాలు చూపారు. దాన్నిబట్టి ఆయన ప్రయాణంలో ఏం జరిగి ఉంటుందన్నది అందరూ అర్థం చేసుకోవాలి.

ముందే కల గన్నారా?

రఘురామరాజు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి వైఎస్ జగన్‌ను, డాక్టర్‌ను కూడా ముద్దాయిలుగా చేర్చడం సరికాదు. పాలించే వ్యక్తి మారితే చట్టం మారుతుందా? ఆ వ్యక్తికి వంత పాడుతుందా? అసలు చట్టం, న్యాయం, ప్రాథమిక సూత్రాలు ఏం చెబుతున్నాయో పట్టించుకోరా? 77 రోజుల తర్వాత సాక్షులను విచారించడమే సరికాదని సుప్రీంకోర్టు గతంలో చెప్పిన విషయం తెలియదా? అలాంటప్పుడు మూడేళ్ల తర్వాత విచారిస్తే ఏం జరుగుతుంది? రఘురామ గత నెల 11న ఈ-మెయిల్ ద్వారా గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేస్తే అంతకు ఒక రోజు ముందే అంటే జూన్ 10వ తేదీనే పోలీసులు లీగల్ ఒపీనియన్ ఎలా పొందారో చెప్పాలి. రఘురామ ఫిర్యాదు చేస్తారని పోలీసులు ముందుగానే కల గన్నారా?

చట్టపరంగానే ఎదుర్కొంటాం

ఈ తప్పుడు కేసును చట్టపరంగా, న్యాయపరంగా ఎదుర్కొంటాం. ఈ కేసు విషయంలో పోలీసులు వ్యవహరించిన విధానం సరికాదు. ఇదో సంప్రదాయంగా మారితే భవిష్యత్తులో పోలీసులకు కూడా రక్షణ లేకుండా పోతుంది. ఈ పరిణామం ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకం. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుపై గత ప్రభుత్వ హయాంలో కేసు నమోదు చేయలేదు. 2015లోనే టీడీపీ హయాంలోనే డైరెక్టర్ జనరల్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ఆ కేసు నమోదు చేసింది.

ఏ విధంగానైతే సాయంకాలం కాగానే అంతదాకా ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతూండే పక్షులన్నీ తిరిగి తమ నివాస స్థానాలైన చెట్లపై వాలి, నిశ్చింతగా విశ్రాంతి తీసుకుంటాయో, అదే విధంగా పంచభూతాలు, పంచ ప్రాణాల లాంటివన్నీ ఆ పరబ్రహ్మలో సుఖపూర్వకంగా ఆశ్రయం తీసుకుంటాయి.

– ప్రశ్నోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 13 జూలై 2024

విజ్ఞత మరిచిన నాటో!

వ్యక్తిగా ఒక్కరు తీసుకునే నిర్ణయం కంటే సమష్టి నిర్ణయమే ఎప్పుడూ సరైందని పెద్దలు చెబుతారు. కానీ వాషింగ్టన్‌లో మూడు రోజులపాటు జరిగిన నాటో 75 ఏళ్ల వార్షికోత్సవాల్లో దేశాధినేతలు మాట్లాడిన తీరు చూసినా, చివరిలో ప్రకటించిన డిక్లరేషన్ గమనించినా పరిణతికన్నా పరమ మూర్ఖత్వమే కనబడుతుంది. మూడో ప్రపంచ యుద్ధం దిశగా ప్రపంచ దేశాలను కదిలించే ప్రయత్నం దర్శనమిస్తుంది. రష్యా దురాక్రమణపై పోరాడుతున్న ఉక్రెయిన్‌కు వచ్చే ఏడాదిలోగా సైనిక సాయం రూపంలో కనీసం 4,000 కోట్ల యూరోలు అందజేయాలని నాటో సంకల్పించింది. అంటే రెండున్నరేళ్లుగా వేలాదిమంది మరణాలకూ, కోట్లాది డాలర్ల ఆస్తుల విధ్వంసానికీ కారణమైన ఆ యుద్ధాన్ని మరింత ఎగదోస్తూ పోతారన్నమాట! ఇంకా విడ్డూరమేమంటే నెదర్లాండ్స్ భూభాగంలో ఎఫ్–16 యుద్ధ విమానాలను మోహరించి రష్యాపై దాడులకు ఉక్రెయిన్‌ను పురిగొల్పుతారు. అంతేకాదు... ఎన్నడూ లేనివిధంగా తొలిసారి చైనాపై నాటో నిప్పులు చెరిగింది. దురాక్రమణ యుద్ధం కొనసాగించేందుకు రష్యాకు దన్నూ, ధైర్యమూ ఇస్తున్నది చైనాయేనని డిక్లరేషన్ ఆరోపించింది. నాటో ఎప్పుడూ చైనా జోలికి పోలేదు. అయిదేళ్లుగా చైనా వ్యవహారశైలిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న మాట వాస్తవం. అది కూడా చాలా మర్యాదైన, మృదువైన పదాలతోనే! ఇప్పుడేమైంది? నాటో కొత్త రాగం వెనకున్న కారణమేమిటి?

నిజానికి నాటో సదస్సులో ఈసారి జో బైడెన్ ఆరోగ్యం, ఉక్రెయిన్ యుద్ధం, గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ ప్రస్తావనకొస్తాయని అందరూ ఆశించారు. అమెరికా అధ్యక్ష పదవి రేసులో బైడెన్ ఆరోగ్యం ప్రధాన అంశంగా మారింది. ఆయన కొనసాగితే ఓటమి ఖాయమని డెమాక్రాట్లు నిర్ణయానికొచ్చారు. సర్వేలు సైతం రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ బలపడుతున్న వైనాన్ని ఏకరువు పెడుతున్నాయి. అందుకే నాటో స్వరం మారిందని విశ్లేషకుల ఆరోపణ. ట్రంప్ వస్తే నాటో ఉనికే ప్రశ్నార్థకం కావటం ఖాయం. ఉక్రెయిన్ భవిష్యత్తు అనిశ్చితం. గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ వల్ల ఇంతవరకూ 1,86,000 మంది పౌరులు మరణించారని లాన్సెట్ నివేదిక అంచనా. ఈ నేపథ్యంలో ఆ యుద్ధాన్ని నివారించటంపై నాటో దృష్టి పెడుతుందని అందరూ అంచనా వేయగా, తీరా దాని గురి చైనా వైపు మళ్లింది! మరోపక్క భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెటీ... ఘర్షణల సమయంలో 'వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి' ఉండదంటూ పరోక్షంగా మనల్ని హెచ్చరించారు. 'అవసర సమయాల్లో' భారత్, అమెరికాలు సమష్టిగా పనిచేయాల్సి వుంటుందని చెప్పారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ రష్యా పర్యటనపై లోపాయికారీగా మన అధికారుల వద్ద అమెరికా అసంతృప్తి వ్యక్తంచేసినట్టు కథనాలొచ్చాయి. గార్సెటీ దాన్నే బహిరంగంగా చెప్పారు.

రెండేళ్లక్రితం తాను చెప్పిందేమిటో అమెరికాకు గుర్తుందా? ఉక్రెయిన్‌కు చేయూతగా పోలాండ్ నుంచి మిగ్–29 యుద్ధ విమానాలను రంగంలోకి దించటానికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తామని 2022 మార్చిలో అమెరికా విదేశాంగమంత్రి బ్లింకెన్ చేసిన ప్రకటనను అమెరికా రక్షణ శాఖ తప్పుబట్టింది. ఇందువల్ల రష్యా తీవ్రంగా ప్రతిస్పందించే ప్రమాదం వుంటుందని పెంటగాన్ ప్రతినిధి జాన్ కిర్బీ హెచ్చరించారు. ఆ సమయంలోనే జో బైడెన్ సైతం ఉక్రెయిన్ గగనతలంపై నాటో నో ఫ్లైజోన్ విధించాలన్న ప్రతిపాదనను కొట్టిపడేశారు. దాన్ని అమలు చేయటానికి నాటో నేరుగా యుద్ధరంగంలోకి దిగాల్సివస్తుందని చెప్పారు. మూడో ప్రపంచ యుద్ధం ప్రారంభించాలని అమెరికా భావించటం లేదని అన్నారు. ఆఖరికి నాటోలో ప్రధాన భాగస్వాములైన జర్మనీ, ఫ్రాన్స్ సైతం అదే ఉద్దేశంతో ఉన్నాయి. నిరుడు ఫిబ్రవరిలో ఒక విందు సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి జర్మనీ చాన్సలర్ ఓలోఫ్ షుల్జ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియేల్ మేక్రాన్‌లు హితవు చెప్పారు. 'ఈ యుద్ధంలో మీరు ఓడిపోబోతున్నారు. కనుక రష్యాతో చర్చలకు సిద్ధపడి సంధి చేసుకోవటం అత్యుత్తమం' అని సలహా ఇచ్చారు. హిట్లర్ కాలంలో జర్మనీ తమ దేశాన్ని దురాక్రమించినా ఆ తర్వాత జర్మనీ, ఫ్రాన్స్‌లు రెండూ పాత వైరాన్ని మరిచిపోయిన సంగతిని గుర్తుచేశారు. 'నువ్వు గొప్ప యుద్ధ వీరుడివే కావొచ్చుగానీ... ఈ వైరంలో రాజనీతిజ్ఞత అవసరం. నొప్పి కలిగించినా కష్టమైన నిర్ణయం తీసుకోవటానికి సిద్ధపడాలి' అని జెలెన్‌స్కీకి మేక్రాన్ హితబోధ చేశారు. అవన్నీ ఏమైనట్టు?

నాటో పుట్టిననాటి నుంచి దాన్ని కొనసాగించటానికి అమెరికా సాకులు వెదుకుతూనే వుంది. సోవియెట్ యూనియన్ పెను భూతమనీ, అది యూరప్‌ను కబళించబోతున్నదనీ ఊదరగొట్టి ఏర్పరిచిన నాటో ఉనికిని కాపాడేందుకు పడరాని పాట్లు పడుతోంది. 1989లో పనామా పాలకుడు నొరీగా, 1999లో సెర్బియా పాలకుడు స్లొబోదన్ మైలోసెవిక్, 2003లో ఇరాక్ అధినేత సద్దాం హుస్సేన్‌లు ప్రపంచాన్ని కబళించటానికి సిద్ధంగావున్న హిట్లర్‌లుగా చిత్రీకరించి ఆ దేశాలపై అమెరికా, నాటో దళాలు విరుచుకుపడి గుల్లచేశాయి. లక్షలాదిమంది అమాయక పౌరులు బలయ్యారు. ఇన్నాళ్లకు నాటోకు యూరప్‌లో పుతిన్ రూపంలో శత్రువు 'తారసపడ్డాడు'. ఆ లంపటంలోకి ప్రపంచ దేశాలన్నిటినీ దించి లోకరక్షకుడిగా ఆవిర్భవించాలని అమెరికా తలపోస్తున్నట్టు కనబడుతోంది. రష్యా అణ్వాయుధాల ప్రయోగానికి దిగదని అమెరికా, నాటోలు నమ్ముతున్నట్టున్నాయి. ఇలాంటి తప్పుడు సూత్రీకరణలతో, అసంబద్ధ అంచనాలతో ప్రపంచాన్ని యుద్ధంలోకి నెడితే ఊహకందని పర్యవసానాలు ఏర్పడే ప్రమాదముంది. అగ్రరాజ్యాలు విజ్ఞతతో మెలిగి ఉక్రెయిన్, రష్యాల మధ్య సంధికి ప్రయత్నించాలి. ఆ మేరకు ప్రపంచ ప్రజానీకం ఒత్తిడి తేవాలి.

దేశాధినేతల స్నేహ రహస్యం ఏమిటి?

అభిప్రాయం



రంగనాయకమ్మ

ఇటీవలి కాలంలో రష్యా–భారత దేశాల మధ్య సరుకుల వర్తకం 65 బిలియన్ల డాలర్ల మేర జరిగిందని తేలింది. 'వర్తకం' అంటే తెలుసు కదా? ఈ దేశం, ఆ దేశానికీ; ఆ దేశం, ఈ దేశానికీ సరుకులు అమ్మడమూ, కొనడమూ! రెండు దేశాల మధ్యా వర్తకం అన్నప్పుడు, యంత్రాలూ, ముడి ఆయిలూ, మరీ ముఖ్యంగా మారణాయుధాలూ, ఎన్నో! ముఖ్యంగా రష్యా నించి యుద్ధ సామగ్రిని భారత ప్రభుత్వం, పెద్ద ఎత్తున కొన్నది. ఇంతకీ, ఈ దేశాధినేతలు చేసేది ఏమిటి? రెండు దేశాల పెట్టుబడిదారీ వర్గాల తరపున ప్రతినిధులుగా వ్యవహరించడమే! అంటే, సరుకుల్ని అమ్ముకోడానికీ, కొనుక్కోడానికీ, దేశాధినేతలు స్నేహాలు ప్రకటిస్తూ, ఒకరిని ఒకరు ఆకాశానికి ఎత్తేసుకుంటారు!

నిన్నగాక మొన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా వెళ్ళినప్పుడు, రష్యా ప్రెసిడెంటు పుతిన్ అన్న మాటలు ఇవి: ''నా ప్రియాతి ప్రియమైన స్నేహితుణ్ణి కలిసినందుకు ఎంతో సంతోషంగా వుంది.''

''ఇచ్చొనమ్మా వాయినం, పుచ్చుకున్నానమ్మా వాయినం'' అన్నట్టు, పుతిన్ గురించి మోదీ కూడా ఏదో అనాలి కదా? ఆ మాటలు ఇవి: ''నా ప్రియమిత్రుడు పుతిన్, రష్యా–భారత్‌ల మధ్య స్నేహాన్ని శిఖరాగ్రాలకు తీసికెళ్ళాడు''అని!

ఇద్దరూ కలవగానే భారత ప్రధాని, తన ప్రత్యేకమైన అలవాటు ప్రకారం, ఆ ప్రియ మిత్రుణ్ణి 'ఆత్మీయ ఆలింగనం' చేసుకున్న దృశ్యాలు అందరూ చూసే వుంటారు. అంతేనా? పుతిన్, మోదీని, తన గుర్రపు శాలకి తీసికెళ్ళడం, అక్కడ వాళ్ళిద్దరూ చెరో గుర్రానికీ ఏదో తినిపిస్తూ, ముద్దు చెయ్యడం! ఇంతేనా! బుజ్జి కారులో మోదీని ఎక్కించుకుని, పుతినే ఆ బుజ్జిని స్వయంగా నడుపుతూ, తన పెద్ద ఎస్టేట్‌లో విలాసంగా తిప్పడం! ఆ ప్రియ స్నేహితులిద్దరికీ అంతా సరదాగా జరిగిపోయింది. ఈ రెండు దేశాల అగ్రనేతలూ ఎందుకు కలిశారంటారు?

ఇటీవలి కాలంలో రష్యా–భారత దేశాల మధ్య సరుకుల వర్తకం 65 బిలియన్ల డాలర్లది (సుమారు 542 లక్షల కోట్ల రూపాయలది) జరిగిందని తేలింది. 'వర్తకం' అంటే తెలుసు కదా? ఈ దేశం, ఆ దేశానికీ; ఆ దేశం, ఈ దేశానికీ సరుకులు అమ్మడమూ, కొనడమూ! ఈ భారీ వర్తకం వల్ల వచ్చిన మొత్తంలో, భారత దేశానికి వచ్చింది, దాదాపు 20 శాతమేనట! రష్యాకి 80 శాతం! రెండు దేశాల మధ్యా వర్తకం అన్నప్పుడు, యంత్రాలూ, ముడి ఆయిలూ, మరీ ముఖ్యంగా మారణాయుధాలూ, ఎన్నో! ముఖ్యంగా రష్యా నించి యుద్ధ సామగ్రిని భారత ప్రభుత్వం, పెద్ద ఎత్తున కొన్నది.

రెండు దేశాల అధినేతలు కలిసినప్పుడు, ఏమేమి మాట్లాడుకునేదీ, ఏ రకం ఒప్పందాలు చేసుకునేదీ, అన్నీ క్షుణ్ణంగా అంతకు ముందే, రెండు దేశాల మంత్రులూ, అధికారులూ, సిద్ధం చేసి వుంచుతారు. మోదీకి ఎర్ర తివాచీలూ, సైనిక వందనాలూ, విందు భోజనాలూ, వగైరాలు అయ్యాక, దేశాధినేతలు సరుకుల గురించి అధికారికంగా, లాంఛనంగా, కాసేపు ముచ్చటించుకుంటారు.

వర్తకంలో, ఎగుమతులుగా, దిగుమతులుగా, ఇటూ అటూ తిరిగిన ఆ సరుకుల తయారీదారులు, ఆ రెండు దేశాల కార్మికులే! కార్మికుల యజమానులు, ఆ దేశాల పెట్టుబడిదారులు! కొన్ని సరుకులు ప్రభుత్వ రంగ సంస్థలలో తయారైనవైతే, ప్రభుత్వాలు కూడా పెట్టుబడిదారులే!



'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ' పురస్కారాన్ని ప్రదానం చేసిన అనంతరం, మోదీతో కరచాలనం చేస్తున్న పుతిన్

ఇంతకీ, ఈ దేశాధినేతలు చేసేది ఏమిటి? రెండు దేశాల పెట్టుబడిదారీ వర్గాల తరపున ప్రతినిధులుగా వ్యవహరించడమే! 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక' అనే 1848 నాటి రచనలో, మార్క్స్, ఎంగెల్సులు చెప్పినట్టు: ''ఆధునిక రాజ్యంలో, ప్రభుత్వం (ఎగ్జిక్యూటివ్) అనేది, మొత్తం బూర్జువా వర్గపు సమష్టి వ్యవహారాలను చక్కబెట్టే కమిటీ మాత్రమే!'' మైకెల్ పెరెంటీ అనే ఒక అమెరికన్ రాజకీయ శాస్త్రవేత్త అయితే, మార్క్స్, ఎంగెల్సులకన్నా ఒక అడుగు ముందుకు వేసి, అనేక ఆధారాలు చూపుతూ, ''కొద్దిమందికే ప్రజాస్వామ్యం'' అనే తన పుస్తకంలో, 'ప్రెసిడెంట్' అనే దేశాధినేత గురించి, మామూలు మాటల్లో చెప్పాలంటే, 'సరుకులు అమ్మేవాడు' (''సేల్సుమాన్ ఆఫ్ ది సిస్టం'') అంటాడు!

అంటే, సరుకుల్ని అమ్ముకోడానికీ, కొనుక్కోడానికీ, దేశాధినేతలు స్నేహాలు ప్రకటిస్తూ, ఒకరిని ఒకరు ఆకాశానికి ఎత్తేసుకుంటారు! తమ దేశాల్లో వున్న అత్యున్నత బిరుదుల్ని ఒకరికి ఒకరు ఇచ్చుకోవడం కూడా! అదే జరిగింది నిన్న! పాతకాలపు రష్యాలో, 'సనాతన చర్చి'ని ('ఆర్థొడాక్స్ చర్చ్') స్థాపించిన మత బోధకుడైన 'సెయింటు ఆండ్రూ' పేరుతో వున్న 'అత్యున్నత బిరుదు'గా ఆ దేశం కీర్తించే బిరుదుని మోదీకి, పుతిన్ ఇచ్చి సత్కరించాడు. ఈ బిరుదుని జారు చక్రవర్తి 1698లో ప్రవేశ పెట్టాడు. దీనిని 1917లో, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన విప్లవం జరిగాక, 1918లో రద్దు చేశారు. 1998లో, 'ఎల్ట్‌సిన్' అనే మాజీ కామ్రేడు తిరిగి దానిని ప్రవేశపెట్టాడు. ఈ కామ్రేడే 1991లో 'సోవియట్ కమ్యూనిస్టు పార్టీ'ని రద్దు చేసినవాడు! అదే సంవత్సరం సోవియట్ యూనియన్‌ని కూడా రద్దు చేశాడు!

భారతదేశపు సనాతన మతాభిమానుల్లో అగ్రగణ్యుడైన వ్యక్తికి, ఆ దేశ సనాతన మత బోధకుడి పేరన వున్న బిరుదు దొరికింది! ఎంత సముచిత సత్కారం!

మోదీ రష్యా పర్యటనలో, కొసమెరుపు అనదగ్గ సంగతి ఒకటి వుంది. ఉక్రెయిన్ దేశ అధ్యక్షుడు జెలెనిస్కీ, మోదీ రష్యాలో పర్యటించడాన్ని ఇలా తప్పుపట్టాడు: ''ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామ్యపు దేశాధినేత, మాస్కోలో, రక్త పిపాసిని (పుతిన్‌ని) కావలించుకోవడం నిరాశాజనకం'' అని! ఈ జెలెనిస్కీని కూడా, ఈ మోదీయే, నిన్న పుతిన్‌ని కావిలించుకున్నట్టే, మొన్న, అంటే, ఆ మధ్య, ఇటలీలో గట్టిగా కావిలించుకున్నాడు! ఈ కావిలింతలు మోదీకి రాజకీయ వెన్నతో పెట్టిన విద్య!

ఉక్రెయిన్‌లో పిల్లల ఆసుపత్రి మీద రష్యా బాంబులు పడి, అనేక మంది చచ్చిపోయిన కొన్ని గంటల తర్వాత, మోదీ రష్యానేల మీద అడుగు పెట్టాడు. ఆ వార్త విమానం దిగుతూ విన్నాడేమో! తర్వాత, మొక్కుబడిగా పుతిన్‌తో అన్నమాటలు: ''యుద్ధం పరిష్కారం కాదు. మానవుల ప్రాణాలు అమూల్యం, అమాయక పిల్లల మరణాలు చూస్తే, హృదయం ద్రవిస్తుంది!'' అబ్బా! ఎంత సున్నిత హృదయం! ఈ మాటలు మోదీ అంటున్నప్పుడు, పుతిన్ బెల్లం కొట్టిన రాయిలాగా ముభావంగా వుండిపోయాడు! 'ఈ రకం మొక్కుబడి మాటలు అన్ని దేశాల అధినేతలకీ మామూలేలే' అన్నట్టు!

మరి, ఏ సమస్యకీ యుద్ధం పరిష్కారం కాదని, మోదీ భావించినప్పుడు, రష్యా నించీ, అమెరికా నించీ, ఫ్రాన్స్ నించీ, ఇజ్రాయిల్ నించీ కుప్పలు కుప్పలుగా, లక్షల కోట్ల ఖర్చుతో మారణాయుధాలు ఎందుకు కొన్నట్టు? పైగా, ఉక్రెయిన్ మీద రష్యా దాడిని ఖండిస్తూ, ఐక్య రాజ్య సమితిలో కొన్ని దేశాలు తీర్మానాలు చేసినప్పుడు, మోదీ ప్రభుత్వం ఓటింగులో పాల్గొననే లేదు! దీన్ని ఏమనాలి? 'యుద్ధం వద్దు! అది పరిష్కారం కాదు!' అనే నీతి వచనాలా! దురాక్రమణ యుద్ధం చేస్తున్న దేశపు ప్రభుత్వం ఇచ్చే ఆ దేశపు 'అత్యున్నత' బిరుదుని మోదీ, ఏ శాంతి నీతితో తీసుకున్నట్టు?

ఈ రెండు దేశాధినేతల స్నేహ రహస్యం తెలిసిందా?

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అదొక బలహీనత



గెలవడం, ఓడటం జీవితంలో జరుగుతూనే ఉంటాయి. స్మృతి ఇరానీ, ఆ మాటకొస్తే ఏ నాయకురాలి పట్ల అయినా అగౌరవమైన, అసహ్యకరమైన వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని నేను ప్రతి ఒక్కరినీ అభ్యర్థిస్తున్నా. జనాన్ని చిన్నబుచ్చడం, అవమానించడం అనేవి మనిషి బలహీనతకు సంకేతం, బలానికి కాదు.

– రాహుల్ గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు

మారాల్సిన వ్యూహం



జమ్ములో తరచుగా జరుగుతున్న తీవ్రవాద దాడులు ఆందోళనకరం. మన కౌంటర్–టెర్రరిజం వ్యూహాలను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరాన్ని ఇది ఎత్తిచూపుతోంది. ఇవి గుడ్డిగా జరిగిన దాడులు కాదు. తీవ్రవాద రంగస్థలాన్ని కశ్మీర్ నుంచి జమ్ముకు మార్చడం పాకిస్తాన్ వ్యూహాత్మక నిర్ణయం. కశ్మీర్‌కు భిన్నంగా జమ్ము భౌగోళికంగా, జనాభాపరంగా ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. సంప్రదాయ వ్యూహాలు ఇక్కడ పనికిరావు.

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

ప్రాచీన స్మృతి



న్యాయశాస్త్ర విద్యార్థులు మనుస్మృతిని ఎందుకు చదవకూడదు? చరిత్రలో తొట్టతొలిగా రూపొందించిన న్యాయసూత్రాల్లో అదీ ఒకటి. కాబట్టి కచ్చితంగా అధ్యయనం చేయాలి.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

కష్టమే!



పాకిస్తాన్ ప్రధానమంత్రిగా షెహబాజ్ షరీఫ్ ఈ సంవత్సరం చివరివరకు కొనసాగినా, దానికదే పెద్ద విజయం కిందే లెక్క.

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

సొంత మనిషనా?



గౌతమ్ గంభీర్‌ను భారత క్రికెట్ జట్టుకు కోచ్‌గా నియమించాలన్న నిర్ణయంలో ఆయన బీజేపీ మనిషి అనేది ఎంత ప్రభావితం చేసింది, క్రికెట్‌లో ఆయన 'సూక్ష్మబుద్ధి' ఎంత అనే ప్రశ్నను లేవనెత్తాల్సి ఉంది. షా కోరుకున్నది ఆయన నెరవేర్చవచ్చు, కానీ ఆయన ఉత్తమ ఎంపికేనా?

– ప్రదీప్ మ్యాగజీన్, రచయిత


అలా జరిగివుంటే...



ఒకవేళ కృష్ణదేవరాయలు పోర్చుగీసు వారి నుంచి ముద్రణా పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకుని ఉండి, వేద సర్వస్వాలు, సిద్ధాంతాలను విస్తారంగా ప్రచురించడాన్ని ఊహించండి! పుస్తకాలు ఏ ఒక్క కులానికో చెందడం అనేది ఉండకపోవును. భారత్‌లో ఎంతగానో అవసరం ఉండిన ఆ సంస్కరణ కోసం ఈస్టిండియా కంపెనీ పాలన దాకా వేచివుండవలసి వచ్చింది. ప్రయత్నించివుంటే రాయలకు ప్రతిఘటన వచ్చేదా?

– జోసెఫ్ టి. నూనీ, థింకర్

కారణం ముఖ్యం



మనుస్మృతిని ఇప్పుడు ఎందుకు అధ్యయనం చేస్తున్నాం అనేది ముఖ్యం. ఒక చారిత్రక ఆసక్తితో అయితే సరే. జనాలు అరిస్టాటిల్‌ను కూడా అధ్యయనం చేస్తారు. కానీ ఆయన చాలా ఆలోచనలు ఇప్పటి కాలానికి సరిపోవు. అలాగే, మనుస్మృతిని అమలులోకి తేవడం కోసమే చదవడం అయితే సరికాదు.

– రాజీవ్ చోప్రా, ఫొటోగ్రాఫర్

అవయవ వ్యాపారానికి బలి

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అక్రమ అవయవ వ్యాపారం ధనవంతుల జీవన ప్రమాణాలను పెంచుతూ మధ్యవర్తులకు లాభాలపంటను పండిస్తోంది. అదే సమయంలో పేదలను మాత్రం 'సమాధి' చేస్తోంది. ఇటీవల ఢిల్లీ, విజయవాడల్లో వెలుగుచూసిన ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. సోషల్ మీడియా ద్వారానూ ఈ ఆర్గాన్ రాకెట్ యథేచ్ఛగా కొనసాగుతుండడం ఆందోళనకు గురి చేస్తున్నది.

మానవ అవయవ మార్పిడి రాకెట్‌ను ఇటీవల ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఒక మహిళా డాక్టర్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. ఇందులో దాతలు, గ్రహీతలతోపాటు కీలక సూత్రధారి బంగ్లాదేశ్‌కు చెందిన వానిగా గుర్తించారు. అవయవ గ్రహీత నుంచి రూ. 25 నుంచి రూ. 30 లక్షలు వసూలు చేస్తున్నారని భావిస్తున్నారు. బంగ్లాదేశ్‌కు చెందిన ఈ రాకెట్ ఢిల్లీలోని ఒక మహిళా డాక్టర్ సహాయంతో నోయిడాలోని ఆస్పత్రిలో 15 నుండి 16 కిడ్నీలు మార్పిడి చేసినట్లు గుర్తించారు.

ఇండియాలో వెలుగు చూసిన పలు ఆర్గాన్స్ రాకెట్స్‌కు అంతర్జాతీయ సంబంధాలు ఉన్నట్లు తేలింది. 2024 మేలో ఓ యువకుడు అనారోగ్యంతో మృతి చెందగా, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కిడ్నీ రాకెట్ ముఠా గుట్టురట్టు చేశారు పోలీసులు. ఈ ముఠా పేద యువకులను లక్ష్యంగా చేసుకుని ఒక్కో కిడ్నీకి రూ. 20 లక్షలు ఇస్తామని ఆశజూపి.. ఇరాన్‌కు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. అక్కడ కిడ్నీలు తీసుకుని తిరిగి ఇండియాకు తీసుకొస్తున్నట్లు నిర్ధారించారు. హైదరాబాద్, కేరళకు చెందిన 40 మంది యువకులను ఇలా ఇరాన్‌కు తీసుకువెళ్లి కిడ్నీ మార్పిడి చేయించినట్లు పోలీసులు గుర్తించారు. శ్రీలంక, ఈజిప్ట్, టర్కీలకు సైతం తీసుకెళ్లి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు కొన్ని కేసుల్లో తేలింది. గుంటూరుకు చెందిన ఆటో డ్రైవర్ ఆర్థిక పరిస్థితి, అతడి అప్పులను ఆసరాగా చేసుకొని కిడ్నీ తీసుకున్న ఘటన ఇటీవల విజయవాడలో కలకలం రేపింది. అయితే రూ. 30 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని రూ. 1.10 లక్షలు మాత్రమే చెల్లించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

సోషల్ మీడియా ద్వారానూ అక్రమ అవయవ వ్యాపారం కొనసాగుతున్నట్లు అర్థమవుతున్నది. గుంటూరుకు చెందిన గార్లపాటి మధుబాబుకు సోషల్ మీడియా ద్వారా పరిచయమైన బాషా కిడ్నీ అమ్మి డబ్బులు సంపాదించుకోవచ్చని సలహా ఇవ్వడంతోనే మధుబాబు దానికి ఒప్పుకున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు మానవ అవయవాలను విక్రయించేందుకు ఓ ప్రముఖ ఆస్పత్రి వెబ్‌సైట్‌ను పోలి ఉన్న ఓ నకిలీ వెబ్సైట్‌ను రూపొందించినట్లు 2023లో గుర్తించారు.

ఎవరికైనా బ్రెయిన్ డెడ్ అయితే వారి బంధువుల అనుమతితో అవయవదానం చేయవచ్చు. అలాగే రక్త సంబంధీకులు వారి కుటుంబ సభ్యులకు అవయవదానం చేయవచ్చు. అయితే అవయవదానం చేయాలంటే ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అలా చేయకుండా ఎవరైనా అవయవదానం చేస్తే అది నేరం.

– ఖిజర్ పాషా, సామాజిక కార్యకర్త । 8008710143

అనాథల డాక్టర్

భారతదేశం నుంచి వైద్యశాస్త్ర పట్టా పొందిన మూడవ మహిళ గురుబాయి కర్మార్కర్. 1862 అక్టోబర్ 10న జన్మించారు. సొంతూరు బెళ్గాం. ఆమె భర్త రెవరెండ్ సుమంత్ రావు కర్మార్కర్ ఒక థియలాజికల్ సెమినార్ కోసం అమెరికా వెళ్ళినప్పుడు గురుబాయి కూడా వెళ్లి, పెన్సిల్వేనియా ఉమెన్స్ మెడికల్ కళాశాలలో ప్రవేశం పొందారు. 1892లో ఎమ్‌డీ పట్టా పొంది భర్తతో పాటు భారతదేశానికి మరుసటి ఏడాది తిరిగి వచ్చారు. బొంబాయి ప్రెసిడెన్సీలోనే తొలి మిషనరీ సంస్థ అయిన అమెరికన్ మరాఠీ మిషన్‌లో గుడ్విల్ డిస్పెన్సరీలో చేరి సుమారు నాలుగు దశాబ్దాల పాటు వైద్య సేవలు అందించారు.

వైజ్ఞానిక వేగుచుక్కలు



గురుబాయి కర్మార్కర్

బొంబాయి ప్రాంతంలో కులం, మతం, ధనిక, పేద అనే తేడాలు చూడకుండా గురుబాయి ఆరోగ్యాన్ని పెంచారు, పంచారు. మరీ ముఖ్యంగా మహమ్మదీయులలో చాలా కఠినంగా నియమ నిబంధనలు పాటించే బోహ్రా మహిళలు ఎంతోమంది ఈమె దగ్గర వైద్యం పొందారు. అలాగే తీవ్రమైన కరవు కాలంలో అనారోగ్యం పాలైన పిల్లలకూ, 1916లో ప్లేగు బారిన పడిన చిన్నారులకూ గురుబాయి అలుపెరగని సేవ చేశారు. ఒకవైపు వైద్య సేవలు అందిస్తూనే మరోవైపు మిషనరీ సంస్థ అయిన పెరల్ ఆర్ఫనేజ్, వారి వితంతు శరణాలయం వంటివాటికి కూడా సేవలు అందించేవారు. పేదలకు సేవలందిస్తూనే, క్రైస్తవం పట్ల సానుభూతిపరురాలుగా అభాగ్య మహిళలకు తోడ్పాటుగా ఉండేవారు. బాల్య వివాహాలు, బాలికా వితంతువులు వంటి సమస్యల పట్ల లోతుగా స్పందించడమే కాకుండా ఇతర దేశాల సదస్సుల్లో పాల్గొని భారతీయ మహిళల సామాజిక సమస్యల గురించి ప్రపంచానికి తెలియజేశారు. 1919లో న్యూయార్క్‌లో ఆరు వారాలపాటు 32 దేశాల ప్రతినిధులతో జరిగిన తొలి అంతర్జాతీయ మహిళా వైద్యుల సమావేశంలో గురుబాయి భారతదేశం తరపున పాల్గొనడం విశేషం. అప్పట్లో తీవ్ర సమస్యగా మారిన కుష్ఠు వ్యాధి నిర్మూలనకు చాలా కృషి చేసిన గురుబాయి 1917 అక్టోబర్‌లో కొలంబస్ ఓహియోలో జరిగిన క్రైస్తవ మిషనరీ సమావేశానికి వెళ్ళినప్పుడు డా॥ అర్లే ఇస్సాబెల్ మున్సాన్ హేర్‌ను ప్రేరేపించి తనతో పాటు బొంబాయి తీసుకొచ్చి, షోలాపూర్‌లో కుష్ఠు వ్యాధి నిర్మూలనకు పెద్ద ఎత్తున నడుం బిగించేలా చేశారు.

బాల బాలికలకు విద్యావసతి కల్పించిన గురుబాయి చాలా మంది అనాథలను పెంచుకున్నారు. అలాంటి పెంపుడు కుమారుడైన డా॥ విశ్వాస్ కర్మార్కర్ ఫిలడెల్ఫియాలో వైద్య సేవలు అందిస్తూ 1918లో ఫ్లూ బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ఆమె పదవీ విరమణ తర్వాత సొంత ఊరు బెల్గాం వెళ్లే ముందు అమెరికన్ మరాఠీ మిషన్‌కు సుమారు 60 వేల రూపాయలు విరాళంగా ఇచ్చి లింకన్ హౌస్‌లో డా॥ గురుబాయి కర్మార్కర్ విభాగాన్ని ప్రారంభించారు. చివరికి 1932లో కనుమూశారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్, ఆకాశవాణి విశ్రాంత అధికారి । 9440732392

విశ్వ విలాసం

ఈ విశ్వంలో ఏ ప్రాణినైనా కొంచెం శ్రద్ధగా పరిశీలిస్తే, ఆస్తికుడి బుద్ధికి అందులో ఈశ్వర విలాసమే స్ఫురిస్తుంది. ఎన్నెన్ని చర–అచర ప్రాణ జాతులు! ప్రతి జాతికీ, ప్రతి ప్రాణికీ దానికే ప్రత్యేకమయిన ఎన్నెన్ని విశేష లక్షణాలు!! అన్ని ప్రాణులకూ ఆత్మరక్షణకూ, ఆహార సంపాదనకూ, సంతానోత్పత్తికీ వాటి వాటి విశేష శక్తులూ సామర్థ్యాలూ కల్పించి చోద్యం చూసే సృష్టికర్త ఊహలూ, ప్రణాళికలూ మనుష్యమాత్రుడి బుద్ధికి అందవు. చిన్న దోమను చూడండి. పరిశోధిస్తే దాని వెనకాల ఎంత కథ! దోమలన్నీ మనుషుల రక్తాన్ని పీల్చవు. నిజానికి దోమలు చాలా వరకూ శాకాహారులు. అవి కూడా తుమ్మెదలలా పూదేనెనూ, ఆకుల రసాలనూ పీల్చి బ్రతుకుతాయట. మగదోమలు ఎప్పుడూ శాకాహారులే. ఆడదోమలు మాత్రం గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేసుకొనేందుకు అవసరమయిన బలవర్ధక ఆహారం – టానిక్ – గా అప్పుడప్పుడూ రక్తాన్ని పుచ్చుకొంటాయని గూగుల్ తల్లి సమాచారం.

జ్యోతిర్మయం

అడవిలో అయితే పాములూ, పిట్టల రక్తాన్ని ఈ దోమలు పీలుస్తాయి. దళసరి చర్మం జంతువుల జోలికి పోవు. అందుకే సంజె వేళల్లో మనుషుల మీదికి దాడి చేస్తాయి. దోమ బరువెంత! దాని బలమెంత! కానీ మహా బలులైన పహిల్వానులు కూడా దాని చురుకుతనం ముందు దాసోహమై, రక్త బిందువుల కప్పం చెల్లించాల్సిందే తప్ప ధర్మ యుద్ధంలో దోమను జయించలేరు. దాని ఒడుపు ప్రకృతి సిద్ధం!

ప్రాణికి మరో ప్రాణిని ఆహారంగా విధించిన ఈ సృష్టి క్రీడలో, అన్ని ప్రాణులకూ అనుక్షణమూ శతకోటి ఉపాయాలు పొంచి ఉన్నట్టే, ఆత్మరక్షణకు అనంతకోటి అనూహ్యమైన ఉపాయాలు కూడా అందుబాటులో ఉండడం, విశ్వ విలాసం కాక మరేమిటి? సర్పం బలం సర్పానికి ప్రసాదించిన ప్రకృతి... చలి చీమల బలాన్ని చలి చీమలకూ ప్రసాదించింది!

మిడిసి పడుతున్న మనిషి జాతికి సంవత్సరంన్నర పాటు నోళ్ళు మూసి, కాళ్లు– చేతులు కట్టి, చెంపలు వేయించిన – కంటికి కనరాని చిన్ని కోవిడ్ క్రిమికి ఆ ప్రతాపమంతా ప్రకృతి కట్టబెట్టిన ప్రతిభ కాదూ?

– ఎం. మారుతిశాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం; ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; **తిథి:** శు.సప్తమి ప.12.19 వరకు, తదుపరి అష్టమి; **నక్షత్రం:** హస్త ప.5.31 వరకు, తదుపరి చిత్త; **వర్జ్యం:** రా.2.19 నుండి 4.05 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.5.35 నుండి 7.19 వరకు; **అమృత ఘడియలు:** ఉ.10.52 నుండి 12.36 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు; **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు; **సూర్యోదయం:** 5.36; **సూర్యాస్తమయం:** 6.35

క్లుప్తంగా...

పోలవరంలో పెరుగుతున్న గోదావరి వరద



పోలవరం రూరల్: నదీ పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఏలూరు జిల్లా పోలవరం వద్ద గోదావరి వరద పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 27.040 మీటర్లకు నీటి మట్టం చేరింది. 48 గేట్ల నుంచి సుమారు లక్ష క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. దిగువన కూడా వరద ప్రవాహం ఉధృతంగా ఉంది.

సెప్టెంబర్ 1 నుంచి బెంగళూరు-విజయవాడ ఏఐఎక్స్ సర్వీసు



గన్నవరం: చౌక ధరల విమాన సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి బెంగళూరు-విజయవాడ మధ్య కొత్తగా సర్వీస్‌లను ప్రారంభించనుంది. ఈ సర్వీస్‌కు సంబంధించి ప్రయాణ షెడ్యూల్‌తోపాటు టికెట్ల బుకింగ్‌ను కూడా ఆ సంస్థ ప్రారంభించింది. ఈ సర్వీస్ నిమిత్తం సుమారు 180 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన బోయింగ్ 737 విమానాన్ని నడపనుంది. ఇది రోజూ బెంగళూరు నుంచి సాయంత్రం 4.05కు బయలుదేరి 5.40 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటుంది. తిరిగి ఇక్కడి నుంచి సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరి 7.50కు బెంగళూరు చేరుకుంటుందని సదరు ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు తెలిపారు. ఈ సర్వీస్‌కు సంబంధించి ప్రారంభ టికెట్ ధర రూ.3,790గా నిర్ణయించారు. ఎక్కువ రద్దీగా ఉంటే బెంగళూరు-విజయవాడ రూట్‌లో ఇప్పటి వరకు ఇండిగో ఎయిర్‌లైన్స్ గుత్తాధిపత్యం చలాయిస్తోంది. ఇప్పుడు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీస్ రాకతో విమాన టికెట్ ధరలు అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటాయని ఎయిర్‌పోర్ట్ వర్గాలు పేర్కొంటున్నాయి.


డిగ్రీ అడ్మిషన్లు ఆలస్యం

- బీబీఏ, బీసీఏ కోర్సులకు అనుమతుల్లో జాప్యం
- కౌన్సెలింగ్ షెడ్యూల్ పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డిగ్రీ ప్రవేశాలు ఆలస్యమవుతున్నాయి. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 19 నాటికి సీట్ల కేటాయింపు పూర్తి చేస్తామని ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. అయితే బీబీఏ, బీసీఏ వంటి కోర్సులు అందించే కళాశాలలకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అనుమతి తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది. ఈ నెల 15వ తేదీలోగా కళాశాలలు ఏఐసీటీఈ అనుమతి కోసం దరఖాస్తుకు సమయం ఉంది. దాదాపు 800 కళాశాలలు ఏఐసీటీఈ అనుమతి తీసుకోవాల్సి ఉంది. వీటిల్లో కొన్ని కళాశాలలు అన్ని ప్రక్రియలు పూర్తి చేసుకుని కౌన్సెలింగ్‌కు సిద్ధం కాగా, మరికొన్ని కళాశాలలు సమయం కోరాయి. దీనికి తోడు చాలా కళాశాలలకు వర్సిటీల నుంచి కూడా అఫ్లియేషన్లు రావాల్సి ఉన్నట్టు సమాచారం. దీంతో ఉన్నత విద్యా మండలి కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను పొడిగించింది. ఈ నెల 20వ తేదీ వరకు విద్యార్థుల రిజిస్ట్రేషన్లకు గడువు ఇచ్చింది. ఇప్పటి వరకు డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దాదాపు 1,20,846 దరఖాస్తులు వచ్చాయి. 18 నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన, 23 నుంచి 26 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 27న ఆప్షన్ మార్పునకు అవకాశం కల్పించింది. 31వ తేదీన తుది సీట్లు కేటాయించనుంది. ఆగస్టు 1 నుంచి తరగతులు ప్రారంభించనుంది.

మూడుకు చేరిన అల్ట్రాటెక్ ప్రమాద మృతులు

- చికిత్స పొందుతూ రెగ్యులర్ కార్మికుడి మృతి



అర్జున్ (ఫైల్)

బూదవాడ (జగ్గయ్యపేట)/తాడేపల్లి రూరల్: ఎన్టీఆర్ జిల్లా బూదవాడలోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రెగ్యులర్ కార్మికుడు పరిటాల అర్జున్ (40) చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ నెల 7న అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో బ్లాస్టింగ్ జరిగి 16 మంది తీవ్రంగా గాయపడటంతో 8 మందిని విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో, మరో 8 మందిని మణిపాల్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గతంలో ఇద్దరు మృతి చెందారు. ఇప్పుడు అర్జున్ మృతితో మృతుల సంఖ్య మూడుకు చేరింది. అర్జున్ తండ్రి పరిటాల వెంకటేశ్వర్లు బూదవాడ మాజీ సర్పంచ్. అర్జునకు భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. కాగా, విజయవాడ మణిపాల్ ఆస్పత్రిలో అర్జున్ మృతదేహానికి ప్రభుత్వ మాజీ విప్ సామినేని ఉదయభాను నివాళులర్పించారు. అంబులెన్స్‌లో మృతదేహాన్ని అర్జున్ స్వగృహానికి తీసుకువచ్చి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబానికి కంపెనీ నుంచి మంజూరైన రూ.25 లక్షల నష్టపరిహారాన్ని ఎమ్మెల్యే రాజగోపాల్ అందజేశారు.

టీడీపీ నేతలు చెప్పారు.. అధికారులు వేటేశారు

శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టులో 17 మంది ఉద్యోగుల తొలగింపు

- ఆ ఉద్యోగాలు తమవారికి ఇవ్వాలని బెదిరింపులు
- పచ్చ నేతల హెచ్చరికలకు తలొగ్గిన అధికారులు
- ఆందోళనకు దిగిన బాధితులు, నిర్వాసితులు
- పోర్టుకు భూములివ్వని నాయకుల పెత్తనమేంటని మండిపాటు



మూలపేట పోర్టు గేటు వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు, నిర్వాసితులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/సంతబొమ్మాళి: అధికారమే అండగా టీడీపీ నేతలు బరితెగించారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టులో పనిచేస్తున్న మూలపేట, విష్ణుచక్రం గ్రామాలకు చెందిన 17 మందిని టీడీపీ నేతల బెదిరింపులతో అధికారులు ఉద్యోగాల నుంచి తొలగించారు. ఉద్యోగులు వైఎస్సార్‌సీపీకి చెందినవారని.. వారిని తీసేసి టీడీపీ వారికి ఉద్యోగాలు ఇవ్వాలని అధికారులకు హుకుం జారీ చేశారు. టీడీపీ నేతల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు 17 మందిని ఉద్యోగాల నుంచి తప్పించడంతో బాధితులతోపాటు నిర్వాసితులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. స్థానిక సర్పంచ్ జీరు బాబూరావు ఆధ్వర్యంలో మూలపేట పోర్టులోకి ప్రవేశించి ఉద్యోగాల తొలగింపుపై అధికారులను నిలదీశారు. స్థానిక టీడీపీ నాయకులు తమను బెదిరించడం వల్లే 17 మందిని తొలగించాల్సి వచ్చిందని అధికారులు చెప్పడంతో నిర్వాసితులు మండిపడ్డారు. పోర్టు నిర్మాణానికి భూములు ఇవ్వని టీడీపీ నాయకుల పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. వారు దర్జాగా వారి భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్నారని, పోర్టుకు భూములిచ్చి తాము సర్వం కోల్పోయి నిర్వాసితులుగా మిగిలామని ఆవేదన వ్యక్తం చేశారు. పోర్టులో ఉద్యోగాలు చేసుకుంటున్న తమపై టీడీపీ నాయకులు రాజకీయ కక్ష సాధింపులకు దిగడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కాగా 10 రోజుల పాటు మూలపేట గ్రామస్తులకు పని ఆపుతున్నామని పోర్టు అధికారులు చెప్పారు. దీంతో తమతో పాటు మిగతా గ్రామస్తులకు పని ఆపాలని ఉద్యోగాలు కోల్పోయినవారు డిమాండ్ చేశారు. పోర్టు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదన్నారు. నిర్వాసితులందరికీ ఉద్యోగావకాశాలు కల్పించాలన్నదే తమ అభిమతమని సర్పంచ్ బాబూరావు, గ్రామస్తులు రాంబాబు, శివ, దారపు అప్పలరెడ్డి, రోహిణి, మోహనరావు తదితరులు తెలిపారు. ఇదే విషయాన్ని పోర్టు డీజీఎం ఉమామహేశ్వరరెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ సంతోష్‌లకు తెలియజేశామన్నారు. కాగా, ఉద్యోగుల తొలగింపు నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా టెక్కలి సీఐ సూర్యచంద్రమౌళి, నౌపడ ఎస్ఐ కిషోర్‌వర్మ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని పోర్టు అధికారులకు విన్నవించడానికి వెళ్లిన నిర్వాసితులను తొలుత సెక్యూరిటీ గార్డులు అడ్డుకున్నారు. పోలీసులు అనుమతి ఇవ్వడంతో తర్వాత లోపలకు విడిచిపెట్టారు. మీడియా ప్రతినిధులను సైతం గేటు వద్దే ఆపేశారు.



పోలీసుల సమక్షంలో పోర్టు అధికారులను నిలదీస్తున్న మూలపేట గ్రామస్తులు

మూలపేటపై కాలకూట విషం..

వైఎస్ జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన మూలపేట పోర్టుపై పెత్తనం కోసం టీడీపీ నేతలు తెగ ఆరాటపడుతున్నారు. పోర్టుకు సంబంధించిన సబ్ కాంట్రాక్టులు, ఉద్యోగాల కోసం కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారు. ఇప్పటికే బండ రాళ్లు, ఇసుక, గ్రావెల్ తరలిస్తున్న లారీలను నిలిపివేయించారు. తాజాగా అందులో మొదటి నుంచి పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించేలా అధికారులను బెదిరించారు. దీంతో అటు నిర్మాణానికి కీలకమైన బండ రాళ్లు, గ్రావెల్, ఇసుక రవాణా కాకపోవడంతో ప్రధాన పనులు నిలిచిపోయాయి. ఇప్పుడేమో ఉద్యోగులను కూడా తొలగించి టీడీపీ నేతలు పనులను కూడా అడ్డుకున్నారు. ఒక మంత్రితో కలిసి స్థానిక టీడీపీ నేతలు మూలపేట పోర్టును తమ గుప్పిట్లోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఉన్నంత వరకు ఇక్కడ పనులు శరవేగంగా జరిగాయి. పోర్టులో కీలకమైన సౌత్ బ్రేక్ వాటర్, నార్త్ బ్రేక్ వాటర్ నిర్మాణ పనులు 70 శాతం వరకు పూర్తయ్యాయి. పోర్టు పనులు పూర్తయితే 11 తీర ప్రాంత మండలాల మత్స్యకారులకు మత్స్య సంపద లభించడంతో పాటు జీడిపప్పు, గ్రానైట్, జూట్, ఇనుము ఉక్కు ఎగుమతులకు అవకాశం కలుగుతుంది. అయితే టీడీపీ నేతల దాష్టీకాలతో పోర్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

చంపుతామని బెదిరిస్తున్నారు



ప్రభుత్వం మారిన వెంటనే మమ్మల్ని చంపుతామని టీడీపీ నేతలు బెదిరిస్తున్నారు. పోర్టు కోసం భూములు ఇచ్చిన మమ్మల్ని ఉద్యోగాల నుంచి తొలగించాలని టీడీపీ నాయకులు అధికారులను భయపెట్టారు. నిర్వాసిత గ్రామస్తులందరికీ పోర్టులో పనికల్పించాలని అధికారులకు విన్నవించాం.
– జీరు బాబూరావు, సర్పంచ్, మూలపేట

పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలి

- కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం నిర్వాసితుల డిమాండ్
- ప్రహరీ పనులను అడ్డుకుని నిరసన



పనులు అడ్డుకుని నిరసన తెలియజేస్తున్న కొవ్వాడ గ్రామస్తులు

రణస్థలం: తమకు రావాల్సిన పరిహారం పూర్తిస్థాయిలో చెల్లించాలకే పనులు చేపట్టాలని కొవ్వాడ విద్యుత్ కేంద్ర నిర్వాసితులు తేల్చి చెప్పారు. అణువిద్యుత్ కేంద్రం పనులను అడ్డుకుని నిరసన తెలిపారు. శ్రీకాకుళం జిల్లా, రణస్థలం మండలం, కొవ్వాడ అణువిద్యుత్ పరిశ్రమకు చెందిన ప్రహరీ పనులను టెక్కలి గ్రామ సమీపంలో అధికారులు రెండురోజుల కిందట ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న కొవ్వాడ, రామచంద్రపురం, టెక్కలి గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆ పనులను అడ్డుకున్నారు. ఇంకా 21మందికి భూముల పరిహారం ఇవ్వాలని, ఎచ్చెర్ల మండలం, ధర్మవరం వద్ద పునరావాస కాలనీ త్వరితగతిన నిర్మించాలని, అక్కడే ఫిషింగ్ హార్బర్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మరో16 మందికి యూత్ ప్యాకేజీ, వలస వెళ్లిన ఏడు కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని, జిరాయితీ, ఆక్రమణ, డీపట్టాల్లోని చెట్లకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో మూడు గ్రామాల పెద్దలు అల్లిపల్లి రాముడు, మైలపల్లి జగ్గులు, పట్టయ్య, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్ సుందర్ కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. న్యాయమూర్తికి ఆలయ ఏఈవో రమేష్ స్వాగతం పలికారు. తొలుత ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. - చంద్రగిరి(తిరుచానూరు)

తొలి 'పులస' @ రూ.24,000



గోదావరి జిల్లాల్లో అరుదుగా లభించే పులస చేప డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మలికిపురం మండలం రామరాజులంక గ్రామం బాడవ వశిష్ట గోదావరిలో మత్స్యకారుల వలకు శుక్రవారం చిక్కింది. రుతుపవనాలు విస్తరించి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరికి ఎర్ర నీరు రావడంతో పులసల రాక ఆరంభమైంది. మత్స్యకారులకు లభించిన రెండు కేజీల తొలి పులసను అప్పన రామునిలంక గ్రామ మాజీ సర్పంచ్ బర్రే శ్రీను రూ.24 వేలకు కొనుగోలు చేశారు. – మలికిపురం



విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను మధ్యప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ శుక్రవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా న్యాయమూర్తి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. - ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)

విపత్తుల నుంచి బాలికలను రక్షిద్దాం

- బాలికల హక్కులు, రక్షణపై గిరిజన విద్యా సంస్థల హెచ్ఎంలకు అవగాహన కార్యక్రమం
- ముగిసిన ఐదు రోజుల శిక్షణ

సాక్షి, అమరావతి: ప్రకృతి, మానవ ప్రేరేపిత విపత్తుల నుంచి బాలికలను రక్షించుకుందాం అనే కోణంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐడీఎం) ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చేపట్టింది. విజయవాడ రూరల్ మండలం, కొండపావులూరు ఎన్ఐడీఎం సౌత్ క్యాంపస్‌లో ఐదు రోజులపాటు నిర్వహించిన ఈ శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. 'ప్రకృతి విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో బాలల రక్షణ-హక్కులు' అనే అంశంపై పలువురు నిపుణులు అవగాహన కల్పించారు. విపత్తుల నేపథ్యంలో విద్యాలయంలో భద్రత, బాలల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, పౌష్టికాహారం, మానసిక, శారీరక ఆరోగ్యం, సామాజిక భద్రత వంటి విషయాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని అంశాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. విపత్తులను సమర్థంగా ఎదుర్కోవడంలో బాలికలను సన్నద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐడీఎంకు చెందిన బాలు, నజియా షేక్, కుమార్ రాక, రంజన్ కుమార్, మహ్మద్ ఆసిఫ్, నవీన్ శుక్లా తదితరులు ఆయా అంశాల వారీగా అవగాహన కల్పించారు. తొలి బ్యాచ్‌గా రాష్ట్రంలోని 45 గిరిజన బాలికల విద్యాలయాలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ప్రారంభ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రతిభా భారతి, ముగింపు కార్యక్రమంలో ఇన్‌చార్జి అడిషినల్ డైరెక్టర్ మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.

'బ్యాంక్ ఆఫీసర్స్' ఉపాధ్యక్షుడిగా కె.రవికుమార్



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కె.రవికుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఆయనకు అభినందనలు తెలిపారు. వారు మాట్లాడుతూ గౌహతిలో జరిగిన ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశంలో రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, ఈ పదవిలో ఆయన మూడేళ్లపాటు కొనసాగుతారని పేర్కొన్నారు. రవికుమార్ నియామకంతో కెనరా బ్యాంకు ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

దుర్గమ్మకు 'కాణిపాకం' సారె సమర్పణ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిర్వహిస్తున్న ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం నుంచి సారెను సమర్పించారు. పట్టుచీర, పసుపు, కుంకుమ, పూజా సామగ్రిని పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీమోహన్, ఈవో ఏ.వెంకటేష్ తీసుకురాగా, దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు.

మంత్రి నారాయణ ఆస్పత్రి ప్రాంగణంలో దారుణ హత్య

- గత నెల 30న హత్య.. ఆలస్యంగా వెలుగులోకి
- ఆస్పత్రి ప్రాంగణంలోనే మద్యం తాగిన యువకులు
- మాటా మాటా పెరగడంతో ఓ యువకుడి హత్య
- బయటకు పొక్కనీయని పోలీసులు
- పోలీసుల రహస్య విచారణ

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వంలో మంత్రి పొంగూరు నారాయణకు చెందిన ఆస్పత్రి ప్రాంగణంలో దారుణ హత్య జరిగింది. 12 రోజుల క్రితం జరిగిన ఈ ఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకుడు హత్యకు గురయ్యాడు. అయితే నెల్లూరులోని ఆస్పత్రి మంత్రికి చెందినది కావడంతో హాస్పిటల్ యాజమాన్యం, పోలీసులు ఈ ఘటన బయటకు పొక్కనీయకుండా పటిష్ట చర్యలు తీసుకున్నాయి. పోలీసులు కూడా అత్యంత రహస్యంగా విచారణ చేస్తున్నారు. ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

విశ్వసనీయవర్గాల కథనం ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కొందరు పెయింటర్లు చింతారెడ్డిపాలెంలోని నారాయణ ఆస్పత్రిలో రంగులు వేసేందుకు గతనెల 23, 24 తేదీల్లో వచ్చారు. ఆస్పత్రి ప్రాంగణంలోనే ఉంటూ పెయింట్ పనులు చేస్తున్నారు. వారిలో రవిగౌర్ (27), లాల్‌మోహన్ గత నెల 30న ఆస్పత్రి ప్రాంగణంలోనే మద్యం తాగారు. ఈ క్రమంలో వారి మధ్య మాటామాటా పెరిగింది. కోపోద్రిక్తుడైన లాల్‌మోహన్ కత్తితో రవిగౌర్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ రవిగౌర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సమాచారం అందుకున్న నెల్లూరు రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. హత్యకు దారితీసిన పరిస్థితులను సహచర పెయింటర్లను అడిగి తెలుసుకున్నారు. మంత్రికి చెందిన హాస్పిటల్ కావడంతో గుంటూరు రేంజ్ ఐజీ స్వయంగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. చిన్న ఘటన జరిగితేనే పెద్ద హడావుడి చేసే పోలీసు అధికారులు రవిగౌర్ హత్య జరిగి 12 రోజులైనా బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మృతుని కుటుంబ సభ్యులను స్వయంగా విచారించినట్లు తెలిసింది. హత్య విషయం బయటకు చెప్పవద్దని బాధిత కుటుంబానికి పోలీసులు సూచించినట్లు సమాచారం. హత్యకు మద్యం మత్తే కారణం కాదని, ఇతర కారణాలూ ఉండి ఉంటాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. అతన్ని శనివారం అరెస్ట్ చూపించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

'తల్లికి వందనం.. ప్రైవేటు పాఠశాలలకు వర్తింపజేయాలి'

గుంటూరు ఎడ్యుకేషన్: తల్లికి వందనం ద్వారా ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహాన్ని ప్రైవేటు పాఠశాలలకు జగనన్న అమ్మఒడి తరహాలో యథావిధిగా వర్తింపజేయాలని ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) రాష్ట్ర కో చైర్మన్ మేకల రవీంద్రబాబు డిమాండ్ చేశారు. గుంటూరులో శుక్రవారం జరిగిన అప్సా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగనన్న అమ్మఒడి ఎటువంటి ఆంక్షలు లేకుండా అమలు చేసినట్లే.. ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం అమలు చేయాలని కోరారు.

46 రైళ్లలో జనరల్ బోగీల పెంపు

- రైల్వేశాఖ కీలక నిర్ణయం
- విజయవాడ డివిజన్‌లో 23 జనరల్ కోచ్‌ల ఏర్పాటు



సాక్షి, న్యూఢిల్లీ/రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): దేశవ్యాప్తంగా జనరల్ బోగీలను పెంచాలన్న ప్రయాణికుల డిమాండ్ నేపథ్యంలో రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. తొలిదశలో దేశంలోని 46 ప్రముఖ రైళ్లలో రెండేసి చొప్పున మొత్తం 92 జనరల్ కోచ్‌లను పెంచుతున్నట్లు రైల్వేశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే త్వరలో మరో 22 రైళ్లలో జనరల్ కోచ్‌లను పెంచనున్నట్లు పేర్కొంది. కాగా, విజయవాడ డివిజన్ మీదుగా నడుస్తున్న 12 జతల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా 23 జనరల్ కోచ్‌లను ఏర్పాటు చేసి నడపనున్నట్లు స్థానిక అధికారులు ప్రకటించారు. ఆ జాబితాలో సికింద్రాబాద్-గూడూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (12710/12709) నవంబర్ 8 నుంచి, సికింద్రాబాద్-హౌరా, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12704/12703) నవంబర్ 8 నుంచి, హైదరాబాద్-విశాఖపట్నం, గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728/12727) నవంబర్ 10 నుంచి, కాకినాడ పోర్టు-లింగంపల్లి, గౌతమి ఎక్స్‌ప్రెస్ (12737/12738) నవంబర్ 8 నుంచి, కాకినాడ పోర్టు-భవనగర్, కాకినాడ పోర్టు ఎక్స్‌ప్రెస్ (12755/12756) ఈ నెల 14 నుంచి, కాకినాడ పోర్టు-షిర్డీ సాయినగర్, షిర్డీ ఎక్స్‌ప్రెస్ (17206/17205) నవంబర్ 11 నుంచి, హైదరాబాద్-తాంబరం, చార్మినార్ ఎక్స్‌ప్రెస్ (12760/12759) నవంబర్ 11 నుంచి, కాకినాడ పోర్టు-లింగంపల్లి, కొకనాడ ఎక్స్‌ప్రెస్ (12775/12776) నవంబర్ 12 నుంచి, సికింద్రాబాద్-భువనేశ్వర్, విశాఖ ఎక్స్‌ప్రెస్ (17016/17015) నవంబర్ 14 నుంచి, మచిలీపట్నం-యశ్వంత్‌పూర్, కొండవీడు ఎక్స్‌ప్రెస్ (17211/17212) నవంబర్ 11 నుంచి, మచిలీపట్నం-ధర్మవరం, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17215/17216) ఈ నెల 12 నుంచి, కాకినాడ పోర్టు-లోకమాన్య తిలక్ టెర్మినస్, షిర్డీ ఎక్స్‌ప్రెస్ (17221/17222) నవంబర్ 16 నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. అలాగే తిరుపతి-కొల్లం ఎక్స్‌ప్రెస్ (17421/17422) కూడా ఈ జాబితాలో ఉంది.



జగన్నాథ రహస్యం!

40 ఏళ్ల తర్వాత రేపు తెరుచుకోనున్న రత్నభండార్

లక్షలాది భక్తజనం పాల్గొనే విశ్వవిఖ్యాత రథయాత్రతో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన పూరీ జగన్నాథుని ఆలయం మరోమారు పతాక శీర్షికలకెక్కింది. రాజుల నుంచి మొదలుకుని సామాన్యుల దాకా శతాబ్దాలుగా జగన్నాథస్వామికి సమర్పించుకున్న కానుకల చిట్టా గుట్టు వీడబోతోంది. ఆదివారం ఆలయం దిగువన ఉన్న ఆభరణాల నిల్వ గది(రత్న భండార్)ని దాదాపు 40 సంవత్సరాల తర్వాత లెక్కింపు కోసం తెరవబోతున్నారు. విషసర్పాలు ఉండొచ్చన్న వార్తల నేపథ్యంలో అత్యయిక ఔషధాలను సిద్ధంచేసి వైద్యులు, పాములు పట్టే వాళ్లను వెంటబెట్టుకునిమరీ పురావస్తు, ప్రభుత్వ అధికారులు లోనికి వెళ్లబోతున్నారు. జగన్నాథుడికి చెందిన వజ్ర, వైఢూర్యాలు, గోమేధిక, పుష్యరాగాలు, కెంపులు, రత్నాలు, స్వర్ణాభరణాలు, వెండి తదితరాల బరువును తూచి, వాటి నాణ్యతను పరిశీలించి వేరే గదిలో సురక్షితంగా భద్రపరచాలని నిర్ణయించారు. చాన్నాళ్ల క్రితం గది తాళం చెవులు పోగొట్టి ఒడిశాలోని బిజూజనతాదళ్ సర్కార్ ఆలయ సంపద సంరక్షణలో విఫలమైందని బీజేపీ అసెంబ్లీ ఎన్నికలవేళ ఆరోపణలు గుప్పించడంతో గది తలుపులు తెరచి సంపదను సరిచూడాలన్న డిమాండ్ మళ్లీ ఊపందుకుంది. అయితే గది తెరవడంపై శనివారం తుది నిర్ణయం తీసుకుంటామని ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ శుక్రవారం చెప్పారు.

180 రకాల ఆభరణాలు

1978లో గదిని తెరచి ఆభరణాలు, వెండి, బంగారం నిల్వలను లెక్కించి మళ్లీ పొడవాటి చెక్కపెట్టెల్లో భద్రపరిచారు. ఆనాడు అన్నింటినీ లెక్కించడానికి 70 రోజులు పట్టింది. గదిలో 180 రకాలకు చెందిన అమూల్యమైన ఆభరణాలు స్వామివారికి ఉన్నట్లు సమాచారం. స్వచ్ఛమైన పసిడి ఆభరణాలు 74 రకాలున్నాయి. ఒక్కోటి 100 తులాల బరువైన పురాతన ఆభరణాలూ ఉన్నాయి. '' 1978లో సంపద లెక్కించారు. అయితే జీర్ణావస్థకు చేరిన కొన్ని ఆభరణాల రిపేర్ పనుల కోసం 1985 జూలై 14వ తేదీన గది తెరిచారు. అప్పుడు నేనూ వెళ్లా. 9 అడుగుల పొడవు, 3 అడుగుల ఎత్తు ఉన్న 15 చెక్కపెట్టెల్లో ఆభరణాలను జాగ్రత్తగా భద్రపరిచారు. వెలకట్టలేని ఆభరణాలతోపాటు ఎంతో బంగారం, వెండి నిల్వలు గదిలో దాచారు. పెద్ద సింహాసనం, ఉత్తరభారత భక్తులు జగన్నాథ, బలభద్రులకు సమర్పించిన అరటిపువ్వు ఆకృతి చెవిదిద్దులు ఇలా ఎన్నో విభిన్న ఆభరణాలు అక్కడున్నాయి. తర్వాత గది తలుపులు మూసి రెండు రకాల తాళాలు వేసి సీల్‌వేశారు. తాళం చెవులను ట్రెజరీ ఆఫీస్ నుంచి వచ్చిన కలెక్టర్‌కు అందజేశాం' అని ఆనాటి ఆలయ నిర్వహణ అధికారి రవీంద్ర నారాయణ మిశ్రా రెండేళ్ల క్రితం ఒక టీవీచానల్ ఇంటర్వ్యూలో చెప్పారు. 12వ శతాబ్దంలో పూరీ ప్రాంత రాజుకు లొంగిపోయిన సామంతరాజుల కిరీటాలు, యుద్ధంలో గెల్చుకున్న విలువైన సొత్తునూ రహస్య గదిలో భద్రపరిచారని తెలుస్తోంది.

2018లో మరోసారి ప్రయత్నించి..

పురాతన గది శిథిలమై గోడలకు చెమ్మ రావడంతో గది పటిష్టత, ఆభరణాల పరిరక్షణ నిమిత్తం గది తలుపులు తెరవాలని హైకోర్టు ఆదేశాల మేరకు 2018 ఏప్రిల్ 4వ తేదీన 16 మంది సభ్యుల భారత పురావస్తుశాఖ నిపుణుల బృందం గది తెరిచేందుకు వెళ్లింది. అయితే తాళం చెవి అదృశ్యమయిందన్న వార్తల నడుమ వెనుతిరిగింది. అయితే కిటికీ నుంచి చూసి గది గోడలు దెబ్బతిన్నట్లు, పైకప్పు పెచ్చులు ఊడినట్లు నిర్ధారించుకున్నారు. ఈ తతంగం అంతా 40 నిమిషాల్లో ముగిసింది. చీకటిగదిని మళ్లీ 40 ఏళ్ల తర్వాత తెరుస్తున్న నేపథ్యంలో ఈసారైనా అన్ని ఆభరణాలు, బంగారం, వెండి నిల్వలను సరిచూసి శిథిల గదికి బదులు నూతన గదిలో సురక్షితంగా దాచాలని సగటు పూరీ జగన్నాథుని భక్తుడు కోరుకుంటున్నాడు.

- సాక్షి, నేషనల్ డెస్క్

బైడెన్.. మళ్లీ తడబడెన్!

'అమెరికా ఉపాధ్యక్షుడు ట్రంప్' ● 'ఉక్రెయిన్ అధ్యక్షుడు పుతిన్' ● మీడియా సమావేశంలో నోరుజారిన బైడెన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పట్టువీడటం లేదు. అధ్యక్ష బరి నుంచి తప్పుకోవాలంటూ ఇంటా బయటా డిమాండ్లు నానాటికీ పెరిగిపోతున్నా ఆ ప్రసక్తే లేదని మరోసారి కుండబద్దలు కొట్టారు. 81 ఏళ్ల వయసులోనూ రిపబ్లికన్ ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను ఓడించి మరోసారి అధ్యక్షునిగా పని చేసే సామర్థ్యం తనలో పుష్కలంగా ఉందని చెప్పుకొచ్చారు. నాటో శిఖరాగ్రం ముగింపు సందర్భంగా గురువారం బైడెన్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తన వయసు, ఫిట్‌నెస్‌పై పెరిగిపోతున్న సందేహాల్లో పస లేదని నిరూపించేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. అయితే గంటకు పైగా జరిగిన ఈ భేటీలోనూ ఆయన తడబాట్ల పర్వం కొనసాగడం డెమొక్రాట్ల శిబిరంలో ఆందోళనలను మరింత పెంచింది. ప్రశ్నోత్తరాల సందర్భంగా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అనబోయి ట్రంప్ అంటూ బైడెన్ తికమకపడ్డారు! అధ్యక్ష రేసు నుంచి మీరు తప్పుకుంటే ట్రంప్‌ను ఓడించే సత్తా హారిస్‌కు ఉందా అని విలేకరులు ప్రశ్నించగా, ''అధ్యక్షునిగా పని చేయగల అర్హత, సత్తా ట్రంప్‌కు ఉన్నాయి. కనుకనే ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నా'' అన్నారు. దాంతో అంతా అవాక్కయ్యారు. అయినా బైడెన్ తన వ్యాఖ్యలను సరిచేసుకోలేదు. అంతకుముందు నాటో వేదికపై కూడా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని సభ్య దేశాల ప్రతినిధులకు 'అధ్యక్షుడు పుతిన్' అంటూ పరిచయం చేశారు!! జెలెన్‌స్కీ దీన్ని తేలిగ్గా తీసుకుంటూ నవ్వేసినా ప్రతినిధులంతా తెల్లబోయారు. ఈ నేపథ్యంలో బైడెన్ మానసిక ఆరోగ్యంపై నెలకొన్న సందేహాలు మరింత పెరిగాయి. అయితే వైద్యులు సూచిస్తే మానసిక పరీక్షలకు సిద్ధమని ఆయన ప్రకటించారు. ''అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ఇప్పటిదాకా మూడుసార్లు న్యూరో పరీక్షలు చేయించుకున్నా. తాజా పరీక్ష గత ఫిబ్రవరిలో జరిగింది. నేను మానసికంగా ఫిట్‌గా ఉన్నాననేందుకు అధ్యక్షునిగా నేను తీసుకుంటున్న రోజువారీ నిర్ణయాలే రుజువు. కానీ నేనెంత చేసినా ఎవరూ సంతృప్తి చెందడం లేదు'' అంటూ వాపోయారు! అయితే తన అభ్యర్థిత్వంపై సొంత పార్టీ నేతల్లో భయాలను దూరం చేయాల్సిన అవసరముందని అంగీకరించారు.

ట్రంప్ విసుర్లు

బైడెన్ తనను ఉపాధ్యక్షునిగా పేర్కొనడంపై ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. 'బిగ్ బోయ్ జో మీడియా భేటీ మొదట్లోనే నన్ను తన ఉపాధ్యక్షునిగా చెప్పుకున్నారు'' అని ఎద్దేవా చేస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

బ్రహ్మాండంగా పని చేశా

అధ్యక్ష ఎన్నికల్లో తలపడేందుకు అత్యంత అర్హున్ని తానేనని బైడెన్ చెప్పుకున్నారు. ''ట్రంప్‌ను ఓసారి ఓడించా. మళ్లీ ఓడించి తీరతా. అప్పుడే ఏమీ అయిపోలేదు. ప్రచారంలో ఇంకా చాలా దూరం వెళ్లాల్సి ఉంది'' అన్నారు. నాలుగేళ్లలో అమెరికాను అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చేశానంటూ గణాంకాలు ఏకరువు పెట్టారు. ఆర్థిక రంగంలో తన పనితీరు చాలా బాగుందని ఏకంగా 16 మంది నోబెల్ గ్రహీతలైన ఆర్థికవేత్తలు కితాబిచ్చారని చెప్పుకున్నారు. రాత్రి 8 గంటల తర్వాత ప్రచారంతో పాటు ఎలాంటి కార్యక్రమాలూ పెట్టుకునేది లేదని తానన్నట్టు వచ్చిన వార్తలను బైడెన్ ఖండించారు. విదేశీ వ్యవహారాలు తదితరాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. గాజా ఆక్రమణ కూడదంటూ ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహూను, ఉక్రెయిన్‌పై యుద్ధంలో మద్దతివ్వొద్దంటూ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను హెచ్చరించానని చెప్పుకొచ్చారు. రష్యాతో సాన్నిహిత్యానికి చైనా మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. లాడెన్‌ను చంపగానే అఫ్గాన్ నుంచి అమెరికా పూర్తిగా వైదొలగాల్సిందన్నారు.



పెరుగుతున్న వ్యతిరేకత

తనకు వ్యతిరేకంగా గళమెత్తుతున్న సొంత పార్టీ నేతలు, ఎంపీల విశ్వాసాన్ని చూరగొనడమే లక్ష్యంగా తాజా మీడియా సమావేశంలో బైడెన్ సర్వశక్తులూ ఒడ్డారు. కానీ ఆ ప్రయత్నంలో ఆయన విఫలమయ్యారని పరిశీలకులు అంటున్నారు. బైడెన్ తప్పుకోవాలని సమావేశం ముగియగానే ముగ్గురు ప్రముఖ డెమొక్రాట్ ఎంపీలు జిమ్ హైమ్స్, స్కాట్ పీటర్స్, ఎరిక్ సొరెన్సన్ పిలుపునిచ్చారు! దాంతో ఆయన వైదొలగాలని డిమాండ్ చేస్తున్న సొంత పార్టీ ఎంపీల సంఖ్య 17కు పెరిగింది. నిజానికి గత నెల సీఎన్ఎన్ చానల్లో జరిగిన తొలి అధ్యక్ష డిబేట్‌లో ట్రంప్ ముందు బైడెన్ పూర్తిగా తేలిపోవడం తెలిసిందే. దానితో పోలిస్తే తాజా మీడియా భేటీలో ఆయన మెరుగ్గానే మాట్లాడారు. తాను తీరిక లేని షెడ్యూల్‌తో బిజీగా గడుపుతుంటే ట్రంప్ మాత్రం గోల్ఫ్ ఆడుతూ సేదదీరుతున్నారంటూ దుయ్యబట్టారు. ''ట్రంప్ నాలుగేళ్ల పాలనలో అస్తవ్యస్తం చేసిన నాటో కూటమిని ఎంతగానో శ్రమించి ఒక్కతాటిపైకి తెచ్చా. నాటో శిఖరాగ్రంలో పాల్గొన్న దేశాధినేతలెవరూ నా ఫిట్‌నెస్‌ను, మానసిక ఆరోగ్యాన్ని సందేహించలేదు. పైపెచ్చు ట్రంప్ మళ్లీ రావొద్దని, నేనే గెలవాలని కోరుకుంటున్నట్టు చెప్పారు'' అని అన్నారు.

ఒబామా, పెలోసీ కూడా...

బైడెన్ తప్పుకోవాలంటున్న డెమొక్రాటిక్ పార్టీ నేతల జాబితాలో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ కూడా చేరుతున్న సూచనలు కన్పిస్తున్నాయి. ట్రంప్‌ను ఓడించడం బైడెన్‌కు తలకు మించిన పనేనని వారిద్దరూ తాజాగా ప్రైవేటు సంభాషణలో అభిప్రాయపడ్డట్టు తెలుస్తోంది. నాటో శిఖరాగ్రం అనంతరం బైడెన్ మీడియా సమావేశం చూసి వారు మరింతగా పెదవి విరిచినట్టు డెమొక్రటిక్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ''బైడెన్ అధ్యక్ష అభ్యర్థిత్వం దాదాపుగా ముగిసిన కథే. ఆయనకు మనస్తాపం కలగకుండా, పార్టీ అవకాశాలు దెబ్బ తినకుండా దీన్ని ప్రకటించడం ఎలాగన్నది మాత్రమే తేలాల్సిలి ఉంది. బహుశా బైడెన్ తనంత తానుగా తప్పుకుంటారని ఒబామా, పెలోసీ భావిస్తున్నారు. లేదంటే ఆయనకు నచ్చజెప్పి తప్పించే బాధ్యత తీసుకోగలిగింది వారిద్దరే'' అని పేర్కొంటున్నాయి. ఈ విషయమై ఉన్నత స్థాయి డెమొక్రాట్ నేతలు గురువారం ఉదయం పెలోసీతో సమావేశమైనట్టు అమెరికా మీడియా పేర్కొంది. ''ఇక ట్రంప్‌ను ఓడించడం బైడెన్‌కు శక్తికి మించిన పనేనన్న అభిప్రాయంతో పెలోసీ కూడా ఏకీభవించారు. అయితే నాటో శిఖరాగ్రం జరుగుతున్న నేపథ్యంలో దేశాధినేతల ముందు బైడెన్‌ను ఇబ్బంది పెట్టడం సరికాదని, కనీసం ఒక రోజన్నా ఆగాలని సూచించారు. దాంతో బైడెన్‌ను తప్పించేందుకు ఆమె కూడా సుముఖంగానే ఉన్నట్టు తేలిపోయింది. అందుకే భేటీ తర్వాత పలువురు డెమొక్రాట్ ఎంపీలు బైడెన్ తప్పుకోవాలని బాహాటంగా డిమాండ్ చేశారు'' అంటూ యూఎస్ మీడియాలో జోరుగా కథనాలు వెలువడుతున్నాయి.

నాటో భేటీ వేళ రష్యా యాత్రా?

మోదీ పర్యటనపై అమెరికా అసంతృప్తి

వాషింగ్టన్: నాటో శిఖరాగ్ర సమావేశం జరుగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ రష్యాలో పర్యటించడంపై అమెరికా అసంతృప్తితో ఉన్నట్టు బ్లూంబర్గ్ నివేదిక పేర్కొంది. ఇది భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపగలదని ఆ దేశ ఉన్నతాధికారులు భావిస్తున్నట్టు చెప్పుకొచ్చింది. ''పుతిన్‌ను మోదీ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న తీరు అమెరికా ప్రభుత్వం లోపల, వెలుపల విమర్శలకు దారి తీసింది. వాషింగ్టన్‌లో నాటో సదస్సు జరుగుతుండగా మోదీ రష్యాలో పర్యటించడం బైడెన్ యంత్రాంగానికి చాలా ఇబ్బందికరమైన పరిస్థితిని సృష్టించింది. పుతిన్‌ను అంతర్జాతీయ సమాజంలో ఒంటరిని చేయాలన్న నాటో ప్రయత్నాలకు ఇది గండి కొట్టింది. అందుకే అమెరికా విదేశాంగ శాఖ ఉప మంత్రి కర్ట్ కాంప్‌బెల్ జూలై మొదట్లోనే భారత విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వాత్రాతో మాట్లాడారు. మోదీ రష్యా పర్యటన షెడ్యూల్ మార్చుకోవాల్సిందిగా కోరారు'' అని నివేదిక వివరించింది. ఈ ఉదంతంపై విదేశాంగ శాఖ స్పందించాల్సి ఉంది. అమెరికాతో స్నేహాన్ని తేలిగ్గా తీసుకోవద్దని భారత్‌లో ఆ దేశ రాయబారి ఎరిక్ గార్సెట్టీ గురువారం మీడియాతో సమావేశంలో నర్మగర్భ వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. అవి రష్యా పర్యటనను ఉద్దేశించేనని చెబుతున్నారు. రష్యాను విశ్వసనీయమైన దీర్ఘకాలిక మిత్ర దేశంగా భారత్ పరిగణించడం పొరపాటని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలివాన్ అభిప్రాయపడ్డారు.

జూన్ 25వ తేదీ రాజ్యాంగ హత్యా దినం

కేంద్ర ప్రభుత్వం ప్రకటన

న్యూఢిల్లీ: 1975లో దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించిన జూన్ 25వ తేదీని రాజ్యాంగ హత్యా దినంగా పాటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు హోం శాఖ ఒక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎమర్జెన్సీ సమయంలో ఎంతో వేదనను అనుభవించి, త్యాగాలకు సిద్ధపడిన వారిని గుర్తు చేసుకునేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు హోం మంత్రి అమిత్ షా శుక్రవారం వెల్లడించారు. 'రాజ్యాంగ హత్యా దినం ప్రతి భారతీయుడిలో వ్యక్తి స్వేచ్ఛ కాంక్షను ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యతను సజీవంగా ఉంచడంలో సాయపడుతుంది. తద్వారా కాంగ్రెస్ వంటి నియంతృత్వ శక్తులను నిరోధించవచ్చు' అని తెలిపారు. '1975 జూన్ 25న ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించడం ద్వారా దేశ ప్రజాస్వామ్యం ఆత్మ గొంతు నులిమి నియంతృత్వ మనస్తత్వాన్ని చాటుకున్నారు. లక్షలాది మంది అమాయకులను కటకటాల్లోకి నెట్టారు. మీడియా గొంతు నొక్కారు'అని అమిత్ షా 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు.

రాజ్యాంగం అణచివేతను గుర్తు తెచ్చుకునేందుకే: మోదీ

రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాచిన సమయంలో ఏం జరిగిందో గుర్తు చేసుకునేందుకే జూన్ 25ను రాజ్యాంగ హత్యా దినంగా పాటించాలని నిర్ణయించామని ప్రధాని మోదీ తెలిపారు. 'దేశ చరిత్రలో అదో చీకటి అధ్యాయం. ఆ సమయంలో అనేక కష్టాలను ఎదుర్కొన్న ప్రతి ఒక్కరికీ నివాళిగా ఈ నిర్ణయం తీసుకున్నాం' అన్నారు.

జూన్ 4 మోదీ ముక్తి దివస్: కాంగ్రెస్

కేంద్రం నిర్ణయాన్ని వార్తల్లో నిలిచేందుకు మోదీ చేసిన కుట్రపూరిత యోచనగా కాంగ్రెస్ పేర్కొంది. తాము కూడా 2016లో మోదీ ప్రభుత్వం నోట్ల రద్దు నిర్ణయం ప్రకటించిన నవంబర్ 8ని జీవనోపాధిని చంపిన రోజు (ఆజీవికా హత్యా దివస్)గా పాటించాలంటూ గెజిట్ విడుదల చేస్తామని తెలిపింది. పదేళ్లపాటు దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేసిన మోదీకి ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు నైతిక ఓటమి రుచి చూపిన జూన్ 4 మోదీ ముక్తి దివస్‌గా చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొంది.

జన భారతం @170 కోట్లు!

- 2060 దశకంలో తారాస్థాయికి
- ఆపై దిగిరానున్న భారత జనాభా
- 50–60 ఏళ్లలో 1,030 కోట్లకు చేరనున్న ప్రపంచ జనాభా
- ఐక్యరాజ్యసమితి నివేదిక

ఐక్యరాజ్యసమితి: భారతదేశంలో జనాభా విస్ఫోటం కొనసాగనుందని ఐక్యరాజ్యసమితి కుండబద్దలు కొట్టింది. ఈ శతాబ్దం చివరిదాకా అంటే 2100 సంవత్సరందాకా ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశంగా భారత్‌పేరు నిలిచిపోనుందని ఐరాస ప్రకటించింది. ప్రస్తుత ఏడాదిలో 145 కోట్లుగా ఉన్న భారతదేశ జనాభా 2060 దశకంలో ఏకంగా 170 కోట్లకు చేరుకుంటుందని పేర్కొంది. 'ది వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ 2024' పేరిట ఐరాస ఆర్థిక, సామాజిక వ్యవహారాలు, జనాభా విభాగం తాజాగా ఒక నివేదికను వెల్లడించింది. నివేదికలోని ముఖ్యాంశాలను ఐరాస అధికారి క్లేర్ మెనోంజీ వెల్లడించారు. ''భారత జనసంఖ్య 170 కోట్లకు చేరుకున్నాక నెమ్మదిగా 12 శాతం క్షీణతతో కిందకు దిగొస్తుంది. ప్రస్తుత ఏడాది 820 కోట్లుగా ఉన్న ప్రపంచజనాభా 2080 దశకం మధ్యకల్లా 1030 కోట్లకు చేరుకుంటుంది. ప్రపంచజనాభా గరిష్ట స్థాయికి చేరుకున్నాక 2100 సంవత్సరంకల్లా 1020 కోట్లకు దిగివస్తుంది. జనాభాలో ఇప్పటికే చైనాను దాటేసిన భారత్ తన జన ప్రభంజనాన్ని 2100దాకా కొనసాగిస్తుంది. అంటే అప్పటిదాకా ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశంగా భారత్ పేరిట రికార్డ్ పదిలంగా ఉండనుంది. భారత జనాభా 2054లో 169 కోట్లకు చేరుకుని 2100 నాటికి 150 కోట్లకు పడిపోనుంది'' అని మెనోంజీ అంచనావేశారు.



చైనాలో సగం జనాభా మాయం

''ప్రస్తుత ఏడాది 141 కోట్లుగా ఉన్న చైనా జనాభా 2054 కల్లా 121 కోట్లకు పడిపోనుంది. 2100 నాటికి 63.3 కోట్లకు మరింత తగ్గనుంది. 2024 నుంచి 2054 కాలంలో చైనా జనాభా వేగంగా తగ్గిపోనుంది. ఆ కాలంలో 20.4 కోట్లు తగ్గనుంది. జపాన్‌లో 2.1 కోట్లు, రష్యాలో కోటి జనాభా తగ్గిపోనుంది. 2100 నాటికి చైనాలోనే అత్యంత తక్కువ సంతాన సాఫల్యతా రేటు నమోదు కావ డమే ఈ జనాభా క్షీణతకు అసలు కారణం. 2100 కల్లా చైనాలో 78.6 కోట్ల జనాభా అంతరించిపోనుంది.

126 దేశాల్లో జనాభా పైపైకి..

2054 ఏడాదిదాకా ప్రపంచవ్యాప్తంగా 126 దేశాల్లో మాత్రం జనాభా పెరుగుతూనే పోతుందని ఐరాస అంచనావేసింది. 2100 ఏడాదిదాకా ఈ పెరుగుదల ధోరణి గరిష్టస్థాయికి చేరుకోనుంది. భారత్, ఇండోనేసియా, నైజీరియా, పాకిస్తాన్, అమెరికా వంటి దేశాల్లో ఈ జనాభా విస్ఫోటం కనిపించనుంది.

అమెరికాను దాటేయనున్న పాక్

ప్రపంచవ్యాప్తంగా జననాల రేటు 2.25గా ఉంది. 1990లో ఇది 3.31గా ఉండటం విశేషం. సాధారణంగా ఉండాల్సిన 2.1 కన్నా తక్కువ రేటు ప్రపంచంలోని సగానికిపైగా దేశాల్లో నమోదవుతోంది. 2054కల్లా పాకిస్తాన్ జనాభా అమెరికాను అధిగమించి 38.9 కోట్లకు చేరుకోనుంది. ప్రస్తుతం అమెరికా జనాభా 34.5 కోట్లు. 2054లో పాక్‌కంటే తక్కువగా అమెరికాలో 38.4 కోట్ల జనాభా ఉండనుంది. 2100కల్లా 51.1 కోట్ల జనాభాతో మూడో అతిపెద్ద దేశంగా పాక్ అవతరించనుంది.

తగ్గిన చిన్నారుల మరణాలు..

ప్రపంచ వ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలు 2023లో 5లక్షల లోపుకు దిగొచ్చాయి. ఇంత తక్కువగా నమోదవడం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి. చిన్నారుల మరణాల్లో 95 శాతం జనాభా బాగా పెరుగుతున్న కాంగో, భారత్, పాకిస్తాన్, నైజీరియా వంటి 126 దేశాల్లో నమోదవుతున్నాయి. 2024లో ప్రపంచవ్యాప్తంగా సగటు ఆయుర్దాయం 73.3 ఏళ్లుగా నమోదైంది. 1995తో పోలిస్తే ఆయుర్దాయం 8.4 సంవత్సరాలు పెరగడం విశేషం. 2054 ఏడాదికల్లా ఆయుర్దాయం 77.4 సంవత్సరాలకు పెరగనుంది.

ఈడీ కేసులో కేజ్రీవాల్‌కు ఊరట

సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్

సాక్షి, న్యూఢిల్లీ: మద్యం విధానం కుంభకోణంపై ఈడీ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట దక్కింది. సుప్రీంకోర్టు శుక్రవారం ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. మద్యం విధానం కుంభకోణం ఈడీ కేసులో ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషన్‌లో కేజ్రీవాల్ లేవనెత్తిన అంశాలు సుప్రీంకోర్టులోని విస్తృత ధర్మాసనం పరిశీలించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేసును విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తున్నామని, అదే సమయంలో మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తున్నామని స్పష్టం చేసింది. 'జీవించే హక్కు, స్వేచ్ఛ సర్వోన్నతమైనవని, అందుకే బెయిల్ మంజూరు చేస్తున్నాం. ఈడీ అధికారి ఇష్టాయిష్టాలకు అనుగుణంగా పీఎంఎల్ఏ సెక్షన్ 19 కింద అరెస్టు చేసే అధికారాన్ని వినియోగించడం కుదరదు. ఒక వ్యక్తిని నిర్దోషిగా నిర్ధారించే ఆధారాలను, రికార్డులను ఈడీ అధికారి పట్టించుకోకపోవడం.. ఆమోదయోగ్యం కాని ఫలితాలకు దారితీస్తుంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పీఎంఎల్ఏ సెక్షన్ 19 కింద అరెస్టు చేయాల్సిన అవసరం ఉందా లేదా అనే చట్టపరమైన ప్రశ్నను విస్తృత ధర్మాసనానికి సిఫార్సు చేస్తున్నామని పేర్కొంది. మధ్యంతర బెయిల్‌కు సంబంధించి సుప్రీంకోర్టు కొన్ని షరతులు విధించింది. ''రూ.50వేల పూచీకత్తుతో బాండ్‌ను జైలు సూపరింటెండెంట్‌కు సమర్పించాలి. ఈ సమయంలో సీఎంఓ, సచివాలయాన్ని సందర్శించరాదు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం కోసం అవసరమైతే తప్ప అధికారిక ఫైళ్లపై సంతకం చేయకూడదు. కేసులో తన పాత్రకు సంబంధించి వ్యాఖ్యలు చేయరాదు. సాక్షులతో మాట్లాడకూడదు. కేసుకు సంబంధించిన ఫైళ్లు చూడరాదు'' అని షరతులు విధించింది. మధ్యంతర బెయిల్‌ను విస్తృత ధర్మాసనం పొడిగించవచ్చు, లేదా రీకాల్ చేయొచ్చని అభిప్రాయపడింది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని నడిపే సీఎంను పదవి నుంచి వైదొలగాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయొచ్చా, లేదా అనే అంశాన్ని సీజేఐ దృష్టికి తీసుకువెళ్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

నేపాల్‌లో వరద బీభత్సం... 62 మంది దుర్మరణం!

వారిలో ఏడుగురు భారతీయులు

కఠ్మాండు: నేపాల్‌లో భారీ వరదలకు కొండచరియలు విరిగిపడి రెండు బస్సులు కొట్టుకుపోయాయి. చిట్వాన్ జిల్లా నారాయణ్‌ఘాట్–ముగ్లింగ్ రహదారిపై జరిగిన ఈ ఘోర దుర్ఘటనలో ఏడుగురు భారతీయులతో పాటు 62 మంది గల్లంతయ్యారు. బిర్గునంజ్ నుంచి కఠ్మాండు వైపు 24 మందితో వెళ్తున్న బస్సు, కఠ్మాండు నుంచి గౌర్ వైపు 41 మందితో వెళ్తున్న డీలక్స్ బస్సు శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో సిమల్టాల్ వద్ద త్రిసూలి నదిలో వరదలో చిక్కుకున్నాయి. డీలక్స్ బస్సులోని ముగ్గురు ప్రయాణికులు బయటకు దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. ఆ వెంటనే రెండు బస్సులు వరదలో కొట్టుకుపోయాయి. సహాయక చర్యలు చేపట్టేందుకు సైన్యం రంగంలోకి దిగింది. వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో గురువారం నుంచి 11 మంది చనిపోయారు.

మెక్సికో నగరాల్లో మొసళ్ల సంచారం

మెక్సికో సిటీ: మెక్సికో దేశంలోని తీర ప్రాంత నగరాల్లో ఇటీవల మొసళ్ల సంచారం ఒక్కసారిగా పెరిగింది. సముద్ర తీరాల వెంబడి తక్కువ లోతు నీళ్లలో ఉండే మొసళ్లు ఇటీవలి వరుస తుపాన్లు, వరదలతో జనారణ్యంలోకి వచ్చిపడుతున్నాయి. టాంపికో, సియుడాడ్ మడెరో, అల్టమిరా నగరాల్లో తిరుగుతూ ప్రజలను భయకంపితుల్ని చేసిన కనీసం 200 మొసళ్లను పట్టుకుని, వాటి ఆవాసాలకు తీసుకెళ్లి వదిలేసినట్లు అధికారులు తెలిపారు. నీటి కొరత ఏర్పడినా, వరదలు వచ్చినా అవి ఇలా జనం మధ్యకు వచ్చేస్తుంటాయని, ఇదో సమస్యగా మారిందని అధికారులు అంటున్నారు. మెక్సికోలో మొసళ్లు రక్షిత జీవులు. అందుకే ప్రజలు చంపడానికి బదులుగా బంధించి అధికారులకు సమాచారమిస్తుంటారు.

ఎన్డీయే సర్కారు ఎక్కువ కాలం కొనసాగదు: మమత

ముంబైలో ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌లతో భేటీ

ముంబై: కేంద్రంలో అస్థిరమైన ఎన్డీయే సర్కారు పూర్తికాలం మనజాలదని తృణమూల్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. ఆమె శుక్రవారం ముంబైలో శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్‌లతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. జూన్ 25ను రాజ్యాంగ హత్య దినంగా కేంద్రం ప్రకటించడంపై స్పందిస్తూ.. 'ఆట మొదలైంది. సాగుతూ ఉంటుంది' అని పేర్కొన్నారు. పదేళ్ల మోదీ పాలన ఎమర్జెన్సీని తలపించిందన్నారు. కొత్త నేర చట్టాలపై ఎవరినీ సంప్రదించలేదని ఆరోపించారు. పార్లమెంటులో ఎంపీలను సస్పెండ్ చేసి వాటిని ఆమోదింపజేసుకున్నారన్నారు. ముంబై నార్త్‌వెస్ట్ లోక్‌సభ స్థానంలో శివసేన (షిండే) అభ్యర్థి కేవలం 48 ఓట్లతో నెగ్గడంపై స్పందిస్తూ చాలాచోట్ల ఇలాగే గెలిచా రన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన (యూబీటీ) తరఫున ప్రచారం చేస్తానని వెల్లడించారు.

అసాధారణ కేసుల్లోనే బెయిల్‌పై స్టే: సుప్రీం

న్యూఢిల్లీ: కారణాలు చూపకుండా యథాలాపంగా బెయిల్ ఉత్తర్వులపై స్టే సరికాదని సుప్రీంకోర్టు పేర్కొంది. అరుదైన, అసాధారణ సందర్భాల్లో మాత్రమే నిందితుడికి ఊరటను (బెయిల్‌ను) నిరాకరించవచ్చని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. 'ఉగ్రవాద కేసుల్లో ప్రమేయం, బెయిల్ ఉత్తర్వులు హేతుబద్ధలేమి, నిబంధనలను అతిక్రమణ వంటి అరుదైన, అసాధారణ సందర్భాల్లో మాత్రమే కోర్టులు బెయిల్ ఆర్డర్‌పై స్టే ఇవ్వాలి. అలాగాక యథాలాపంగా స్టేలు ఇచ్చుకుంటూ పోతే ఉపద్రవమే'' అని పేర్కొంది. మనీలాండరింగ్ కేసులో ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను ఢిల్లీ హైకోర్టు నిలిపేయడాన్ని సవాలు చేస్తూ పర్విందర్ సింగ్ ఖురానా వ్యక్తి పెట్టుకున్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

విశ్వాస పరీక్షలో ఓడిన ప్రచండ

ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకొచ్చిన ఓలి


కఠ్మాండు: నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహాల్ 'ప్రచండ' శుక్రవారం పార్లమెంట్‌లో జరిగిన బలపరీక్షలో ఓటమి పాలయ్యారు. ఆయన సంకీర్ణ ప్రభుత్వానికి ప్రధాన భాగస్వామి సీపీఎన్–యూఎంఎల్ మద్దతు ఉపసంహరించడంతో బల నిరూపణ జరిగింది. 275 మంది సభ్యుల్లో ప్రచండకు 63 మందే మద్దతు తెలిపారు. విశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా 194 ఓట్లు పడ్డాయి. 2022 డిసెంబర్‌లో ప్రధాని అయ్యాక ప్రచండకు ఇది నాలుగో విశ్వాస పరీక్ష! ఇప్పుడాయ గద్దె దిగడం అనివార్యమైంది. మాజీ ప్రధాని కేపీ శర్మ సారథ్యంలోని సీపీఎన్- యూఎంఎల్ ఇటీవల ప్రచండ సంకీర్ణ ప్రభుత్వం నుంచి వైదొలిగి షేర్ బహదూర్ దేవ్‌బా సారథ్యంలోని నేపాలీ కాంగ్రెస్‌తో జట్టు కట్టింది. వాటి ఒప్పందం ప్రకారం పార్లమెంట్ మిగిలిన పదవీ కాలంలో ఒకటిన్నరేళ్లు కేపీ శర్మ ఓలి ప్రధానిగా ఉంటారు. తాజా పరిణామాల నేపథ్యంలో రెండు, అంతకంటే ఎక్కువ పార్టీలు కలిసొచ్చి ఆదివారం సాయంత్రంలోగా మెజారిటీ నిరూపించుకోవాలని అధ్యక్షుడు రాంచంద్ర పౌడెల్ కోరారు. ఎన్సీ మద్దతుతో తాము ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సీపీఎన్–యూఎంఎల్ సారథి కేపీ శర్మ ఓలి ప్రకటించారు.



విశ్వాస పరీక్షలో ఓడిన అనంతరం పార్లమెంట్‌లో ఒంటరిగా కూర్చున్న ప్రచండ



తాపడం పనులకు విరాళం
ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు హిందూపూర్ పాండు రంగనగర్‌కు చెందిన బుక్కపట్నం నవీన్ నిశ్చల్ రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 503.10 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నేడు బాధ్యతల స్వీకరణ
విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌గా ఎస్వీ రాజశేఖరబాబు శనివారం బాధ్యతలు తీసుకోనున్నారు. రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయనను జిల్లా సీపీగా నియమిస్తూ రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.



న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో వైద్య, ఆరోగ్య కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించడంతో పాటు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గ్రామీణ, పట్టణ వైద్యాధికారులకు ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. ఆమె శుక్రవారం పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల, డివిజన్ స్థాయి అధికారులతో సమన్వయ పరుచుకుంటూ, ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. సంబంధిత నివేదికలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యాప్తి చెందే మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్ గున్యా, జపనీస్ ఎన్‌సఫలైజేషన్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ఫైల్స్‌ను ఈ–ఆఫీసు ద్వారానే నిర్వహించాలని సూచించారు.

రేపు దుర్గమ్మకు తెలంగాణ బంగారు బోనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు హైదరాబాద్ పాతబస్తీలోని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ 14వ తేదీ ఆదివారం బంగారు బోనం సమర్పించనుంది. ఆ రోజు ఉదయం అమ్మవారికి బంగారు బోనంతో పాటు పట్టువస్త్రాలు సమర్పించేందుకు కమిటీ ప్రతినిధులు ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి విచ్చేయనున్నారు. శనివారం సాయంత్రమే నగరానికి చేరుకునే ఉత్సవ కమిటీ ప్రతినిధులతో పాటు బేతాళనృత్య కళాకారులు, తీన్‌మార్ డప్పు కళాకారులు, పోతురాజులు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి బయలుదేరుతారు. ఆలయ ఈవో కేఎస్.రామరావు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. జూలై 26వ తేదీన ఆషాఢ మాస బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం తరపున పాతబస్తీలోని అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించనుంది.

స్నేహ హస్తంతో సమస్యలు పరిష్కారం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): సర్వీస్‌లో ఉన్న రైల్వే ఉద్యోగుల సమస్యల సత్వర పరిష్కారం కోసం స్నేహ హస్తం పనిచేస్తుందని పర్సనల్ బ్రాంచ్ ఏపీఓ అనిరుద్ తెలిపారు. సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్ ఆదేశాల మేరకు ఏపీఓ అనిరుద్, సిబ్బంది స్నేహ హస్తం పేరుతో శుక్రవారం విజయవాడ డీజిల్ లోకోలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ముఖ్యంగా సిబ్బంది ఇంక్రిమెంటులు, సర్వీస్ ప్రమోషన్‌లు, ఉమిడ్ కార్డులు, హెచ్ఆర్ఎంఎస్‌లో మార్పులు తదితర విషయాలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించారు.

కోలాట నృత్యం చేస్తున్న విద్యార్థినులు



కళాకారుల ప్రదర్శనలు, భక్తుల కోలాహలం మధ్య సాగుతున్న జగన్నాథుని రథం





రథంపై స్వామివారు

జై జగన్నాథ

బెజవాడలో రమణీయంగా రథయాత్ర

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో శ్రీ జగన్నాథ రథయాత్ర శుక్రవారం శోభాయమానంగా సాగింది. ఇస్కాన్ శ్రీ జగన్నాథ మందిర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథయాత్రను తొలుత ఎంజీరోడ్డులోని డి అడ్రస్ మాల్ వద్ద రాష్ట్ర గృహ నిర్మాణ, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి రథపూజ చేసి లాంఛనంగా ప్రారంభించారు. నగరంలోని వివిధ ప్రాంతాల మీదగా రామలింగేశ్వరనగర్‌లోని ఇస్కాన్ టెంపుల్ వరకూ సుమారు 8 కి.మీ.లు కొనసాగింది.



రథయాత్రను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి

యాత్ర కొనసాగిందిలా..

ఎంజీరోడ్డులో డి అడ్రస్ మాల్ వద్ద ప్రారంభమైన రథయాత్ర భీమా జ్యూయలర్స్ వద్ద యూ టర్న్ తీసుకుని, పీవీపీ రోడ్డులో సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ మదర్ థెరీసా విగ్రహం మీదగా పాలిక్లినిక్‌రోడ్డులో గాయత్రీనగర్, ఎగ్జిక్యూటివ్ క్లబ్ జంక్షన్ నుంచి గురునానక్‌కాలనీ రోడ్డులోకి ప్రవేశించింది. అక్కడి నుంచి పటమట ఫన్‌టైమ్ క్లబ్ రోడ్డులో నుంచి ఆర్టీసీ కాలనీ మీదుగా పంటకాలువ రోడ్డులో ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకుంది. అక్కడి నుంచి కృష్ణవేణి రోడ్డులో నుంచి రామలింగేశ్వరనగర్ ఇస్కాన్ మందిర్ వరకూ కొనసాగింది. సుమారు 8 కి.మీలు నాలుగున్నర గంటల పాటు ఈ రథయాత్రను నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు..

రథయాత్ర ప్రారంభానికి ముందు నిర్వహించిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కోలాటం, డప్పు విన్యాసాలతో పాటు, విదేశీయులు సైతం హరే కృష్ణ అంటూ గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు. రథయాత్ర ముగిసిన తర్వాత టెంపుల్ వద్ద కూడా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గద్దే అనూరాధ, ఎస్ఆర్ఐ కోమటి జయరామ్, ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధులు ముకుంద మాధవ దాస్, చక్రధరి దాస్, వేణుధరి కృష్ణదాస్, బలరామ్ గోవింద్ దాస్, శ్యామ సుందర అచ్యుత దాస్ పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ..

ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నగరంలో మూడో ఏడాది నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్రతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. హరే కృష్ణ, హరే రామ, కృష్ణ కృష్ణ హరే హరే అంటూ భక్తులు రథయాత్రలో ముందుకు సాగారు. నగరం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేశారు. ఇస్కాన్ మందిర గురువులు రథయాత్ర విశిష్టతను వివరించారు.

ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులు వేగవంతం కావాలి

విమానాశ్రయం(గన్నవరం): ఎయిర్‌పోర్ట్ నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని విజయవాడ ఎంపీ, ఎయిర్‌పోర్ట్ సలహా కమిటీ వైస్ చైర్మన్ కేశినేని శివనాథ్(చిన్ని) అధికారులకు సూచించారు. స్థానిక విమానాశ్రయంలో శుక్రవారం ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ నిర్మాణ పనులపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి ఎయిర్‌పోర్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టెర్మినల్ పనులు ప్రారంభించి ఐదేళ్లు అయినప్పటికీ ఎందుకు పూర్తి చేయలేదని, పనుల్లో చోటు చేసుకుంటున్న జాప్యంపై అధికారులను ప్రశ్నించారు. కోవిడ్ పరిస్థితులు, కాంట్రాక్టర్ కారణంగా టెర్మినల్ నిర్మాణం ఆలస్యమైనట్లుగా అధికారులు పేర్కొన్నారు. కాంట్రాక్టర్‌ను మార్చాలని ఎంపీ అధికారులకు సూచించారు.

వైఎస్సార్ సీపీపై నిందలు..

అనంతరం మీడియాతో మాట్లాడిన ఎంపీ, ఎమ్మెల్యే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కారణంగానే టెర్మినల్ నిర్మాణం ఆలస్యమైనట్లుగా విమర్శించారు. అయితే పూర్తిగా కేంద్ర ప్రభుత్వంలోని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలో విమానాశ్రయాలు ఉంటాయి. 2019లో ఎన్డీఏ ప్రభుత్వం రూ. 550 కోట్లతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ నిర్మాణంలో జాప్యాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టడం విమర్శలకు తావిస్తోంది. ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎల్. లక్ష్మీకాంత్‌రెడ్డి, పలువురు విమానాశ్రయ అధికారులు పాల్గొన్నారు.



టెర్మినల్ పనులను పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

సిట్టింగ్ జడ్జితో విచారణ అవసరం

రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అచ్యుటెక్ ప్రమాద ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ మాట్లాడుతూ ప్రమాద బాధితులకు న్యాయం చేయాలని, పరిశ్రమలలో ప్రమాదాలు నివారించాలని, కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అచ్యుటెక్ బాయిలర్ ప్రమాద ఘటనపై వాస్తవాలను ఎందుకు బహిర్గతం చేయలేదని నిలదీశారు. ప్రభుత్వ అధికారులు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో ప్రభుత్వం నిజనిర్ధారణ కమిటీ వేయాలన్నారు. ఘటనకు బాధ్యులైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు ప్రభుత్వం రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అచ్యుటెక్ కంపెనీకి అధికారులు, ప్రభుత్వ పెద్దలు కొమ్ము కాస్తున్నారని ధ్వజమెత్తారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ఐక్య పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో బాధిత కుటుంబాలు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ నాయకులు పోలారి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.సి.హెచ్ శ్రీనివాసరావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, ఇన్‌సాఫ్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ అఫ్సర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రానాయక్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి శంకర్

వ్యవసాయం, స్వయం ఉపాధికి ప్రాధాన్యం



క్రెడిట్ ప్లాన్ విడుదల చేస్తున్న కలెక్టర్ సృజన

డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో బ్యాంకర్లతో కలెక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వ్యవసాయం, పారిశ్రామిక రంగాలతో పాటు స్వయం ఉపాధి కల్పన పథకాలు, కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన బ్యాంకుల ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ సృజన అధ్యక్షతన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లాస్థాయి సమీక్ష కమిటీ సమావేశం (డీఎల్ఆర్‌సీ) జరిగింది. సమావేశంలో వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధన, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు–బ్యాంకు లింకేజీ, ఆర్థిక సాక్షరత కార్యక్రమాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన అంశాల్లో పురోగతి తదితరాలపై చర్చించారు. తొలుత ఎల్‌డీఎం కె.ప్రియాంక అజెండాలోని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 90, సెమీ అర్బన్‌లో 122, అర్బన్–మెట్రోలో 326 మొత్తం 538 బ్యాంకు బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సర వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధనను వివరించారు. ప్రాధాన్య రంగంలో 136.15 శాతం, ప్రాధాన్యేతర రంగంలో 333.91 శాతం మేర లక్ష్యాలను సాధించామన్నారు. మొత్తం లక్ష్యం రూ. 39 వేల కోట్లు కాగా రూ. 92,651 కోట్లు (237.57 శాతం) మేర అందించినట్లు వివరించారు.

బ్యాంకు బ్రాంచ్‌ల వారీగా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వివిధ పథకాలు, కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయడంలో బ్యాంకులది కీలకపాత్ర అని కలెక్టర్ సృజన అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతల ఆధారంగా బ్యాంకులు, బ్రాంచ్‌ల వారీగా లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల అమలులో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలన్నారు.

క్రెడిట్ ప్లాన్ ఇలా..

సమావేశంలో భాగంగా జిల్లాకు సంబంధించి నాబార్డ్ – పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ (2024–25)ను ఆవిష్కరించారు. వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలకు రూ. 12,611 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ. 8,193 కోట్లు, ఎగుమతుల క్రెడిట్‌కు రూ. 93.50 కోట్లు, విద్యా రంగానికి రూ. 458 కోట్లు, హౌసింగ్‌కు రూ. 1,695 కోట్లు తదితర రంగాలకు మొత్తం రూ. 24,413 కోట్లకు అంచనాలను విడుదల చేశారు. ఆర్‌బీఐ ఏజీఎం సీహెచ్ నవీన్ కుమార్, యూబీఐ డెప్యూటీ రీజనల్ హెడ్, కన్వీనర్, ఐఎస్ఎస్ మూర్తి, నాబార్డు డీడీఎం మిలింద్ చౌసాల్కర్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జీఎం డీఐసీ ఎ.సుధాకర్ పాల్గొన్నారు.

సమగ్ర ప్రగతికి సమష్టి కృషి



‘సాక్షి’తో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: అన్ని శాఖల సమన్వయం, సమష్టి కృషితో జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తామని కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అన్నారు. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి వారం వారం సమీక్షలు నిర్వహించి, ఆయా శాఖల పని తీరు మెరుగు పరిచేలా పని చేస్తామన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకున్నారా లేదా చూడటంతో పాటు, సమస్యల పరిష్కారంలో అధికారులకు ఎదురయ్యే ఇబ్బందులను తమ దృష్టికి తీసుకువస్తే ప్రత్యామ్నాయ మార్గాలను చూపుతామన్నారు. శుక్రవారం ఆమె ‘సాక్షి’తో పలు విషయాలపై ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

తాగునీటి సమస్యపై ఫోకస్..

జిల్లాలోని ఎగువ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉంది. ప్రధానంగా తిరువూరు నియోజకవర్గంలోని గంపలగూడెం, ఏ కొండూరు ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించాం. ప్రస్తుతం తాత్కాలికంగా తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం. దీంతో పాటు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే దిశగా ప్రణాళిక రూపొందిస్తున్నాం. జల్‌జీవన్ ప్రాజెక్టు తోపాటు, సీఎస్ఆర్, ఎంపీ నిధుల సహకారంతో అవసరమైన చోట్ల ఆర్‌ఓ ప్లాంట్లు, పైపు లైనులు, ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించే విధంగా ప్రాజెక్టు రిపోర్ట్ సిద్ధం చేస్తున్నాం.

విద్యార్థులకు నాణ్యమైన బోధన..

ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా మెరుగైన విద్య అందించేలా కృషి చేస్తా. క్షేత్ర స్థాయిలో పాఠశాలలను తనిఖీ చేసి, బోధనను మెరుగు పరిచేందుకు ప్రాధాన్యతనిస్తా. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతోపాటు, విద్యార్థుల హాజరు పెంచే విధంగా చర్యలు తీసుకుంటాం. అంగన్‌వాడీ కేంద్రాలపైనా దృష్టి సారిస్తాం.

స్వయం ఉపాధి కల్పన కోసం శిక్షణ..

జిల్లాలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పన కల్పించేందుకు వీలుగా వారికి స్కిల్ ట్రెయినింగ్ ఇస్తాం. చిన్న వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సహిస్తాం. శిక్షణ పొందినవారికి బ్యాంకర్లతో మాట్లాడి రుణ సదుపాయం కల్పిస్తాం. 10 అంతకంటే ఎక్కువ ఖాళీలు ఉండే పరిశ్రమలను గుర్తించి, ఆ పరిశ్రమలలో పనిచేసేందుకు యువతకు ఎటువంటి శిక్షణ ఇవ్వాలో తెలుసుకొని, వారికి ఆ శిక్షణ ఇచ్చి, పరిశ్రమల్లో ఉద్యోగులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం.

సంక్షేమ హాస్టళ్లల్లో వసతుల కల్పన..

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మూడు సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పన కోసం ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నాం. హాస్టళ్లలో రిపేర్లు, దోమలు రాకుండా జాగ్రత్తలు, తాగు నీటి సౌకర్యం, ప్రహరీల నిర్మాణాల కోసం రూ. 8కోట్లతో ప్రణాళికలు రూపొందించాం. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడం తోపాటు, కెరీర్ గైడెన్స్, నైపుణ్యాభివృద్ధి పెంపొందించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పైనా అవగాహన కల్పిస్తున్నాం.

మెరుగైన వైద్య సేవలు అందేలా..

వైద్య ఆరోగ్యశాఖపైన దృష్టి సారించి రోగులకు మెరుగైన వైద్యం అందే విధంగా చర్యలు తీసుకుంటాం. జీజీహెచ్‌లో హెచ్‌డీఎస్ సమావేశాలు నిర్వహించి అక్కడి వైద్యులతో మాట్లాడి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తాం. ప్రభుత్వ ఆస్పత్రులపైన ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా చేస్తాం. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల ద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందేలా చూస్తాం.

గ్రీవెన్స్‌పై ప్రత్యేక దృష్టి..

ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తాం. గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలకు పరిష్కారం లభించిందా, లేదా అనేదానిపై ఆడిట్ చేస్తాం. ప్రత్యేకంగా రెవెన్యూ సమస్యలు క్షేత్ర స్థాయిలోనే పరిష్కారం లభించేలా సిబ్బందిని ఆదేశిస్తాం. జిల్లా స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేస్తాం.

సుందర నగరంగా..

సుందర నగరంగా విజయవాడను తీర్చిదిద్దుతాం. వీఎంసీతో పాటు అన్ని శాఖల సమన్వయంతో నగరాన్ని అభివృద్ధి చేస్తాం. శానిటేషన్, కాలువల శుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి స్వచ్ఛ నగరంగా తీర్చి దిద్దుతాం. ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేలా చర్యలు తీసుకొంటాం. కాలువలను శుభ్రం చేసి, అందంగా తీర్చిదిద్దటంతోపాటు, కృష్ణా తీరం వెంబడి నగరవాసులకు ఆహ్లాదం పంచేలా చర్యలు తీసుకొంటాం. టూరిజం అభివృద్ధికి కృషిచేస్తాం.

పోటెత్తిన మహిళా భక్తులు

దుర్గమ్మ సన్నిధిలో కొనసాగుతున్న సారె సంబరం





అమ్మవారికి సారెను తీసుకొచ్చిన భక్త బృందంలోని సభ్యులు, (ఇన్‌సెట్లో) ఉత్సవమూర్తికి హారతినిస్తున్న అర్చకుడు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రద్దీకి తోడు ఆషాఢ సారెను సమర్పించేందుకు విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి ప్రధాన ఆలయాన్ని పూలతో విశేషంగా అలంకరించారు. మరో వైపున తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, చండీ హోమం, శాంతి కల్యాణంలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులతో ఆలయంలోని క్యూలైన్లు కిటకిటలాడాయి.

సారె సమర్పించిన భక్త బృందాలు

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి పలువురు భక్తులు సారెను సమర్పించారు. మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గంతో పాటు ఘాట్‌రోడ్డు మీదుగా వచ్చిన భక్త బృందాలు ప్రధాన ఆలయంలోని అమ్మవారిని దర్శించుకున అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించాయి. శుక్రవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్త బృందాలు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి సారెను సమర్పించాయి. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ఈవో కేఎస్ రామరావు క్యూలైన్లు, మహా మండపం గ్రౌండ్, ఆరో అంతస్తును పరిశీలించారు. మహామండపంలో భక్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యం

- మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయండి
- కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): పాఠశాల విద్య రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశమని, విద్యార్థులకు సంబంధించిన పథకాలను సక్రమంగా అమలు చేయటంలో తగిన విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయం నుంచి మండల విద్యాశాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మధ్యాహ్న భోజన పథకం అమలు, స్టూడెంట్లకు కిట్ల పంపిణీతో పాటు పాఠశాలలో ఉన్న సమస్యలపై చర్చించి సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, ముఖ్యంగా గుడ్డు, చిక్కీ, రాగిజావ సక్రమంగా అందాలన్నారు. పాఠశాలల్లో అందిస్తున్న పోషకాహారం తీసుకోకపోవటం వల్ల భవిష్యత్తులో విద్యార్థులకు రక్తహీనతతో పాటు ఇతర పోషక లోప సమస్యలు వస్తున్నాయన్నారు. విద్యార్థుల హాజరుశాతం ప్రకారం ఆహారం సిద్ధం చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై అధికారులు తరచుగా పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఆ సమయంలో గుర్తించిన రిమార్కులను తనకు సమర్పించాలన్నారు. అప్పుడప్పుడు తాను కూడా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని తెలిపారు.

షెడ్లు లేవు..

పెనమలూరులోని ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేసేందుకు షెడ్డు లేదని ఎంఈవో కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఇంజినీరింగ్ అధికారులు పర్యటించి షెడ్డు నిర్మాణం చేపట్టాలని అందుకయ్యే నిధులు సమకూరుస్తామన్నారు. విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన కిట్లు అందరికీ అందేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈవో తాహెరా సుల్తానా, అసిస్టెంట్ డైరెక్టర్ అజీజ్, సూపరింటెండెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

క్లుప్తంగా

ఆల్ట్రాటెక్ కార్మికుడు అర్జునరావు మృతి బాధాకరం

మాజీ ప్రభుత్వ విప్ ఉదయభాను



జగ్గయ్యపేట అర్బన్: బూదవాడ గ్రామంలోని ఆల్ట్రాటెక్ కర్మాగారంలో సంభవించిన పేలుడులో తీవ్రంగా గాయపడి విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బూదవాడ వాసి పరిటాల అర్జునరావు మృతి బాధాకరం అని మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. విజయవాడలోని ప్రభుత్వాస్పత్రిలోని అర్జునరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అల్ట్రాటెక్ కర్మాగారం యాజమాన్యం మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు తగిన న్యాయం చేసి అండగా నిలవాలని కోరారు. భవిష్యత్‌లో మరెప్పుడు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ పాల్గొన్నారు.

ఆందోళనకరంగా మరో ఇద్దరి పరిస్థితి

జగ్గయ్యపేట: మండలంలోని బూదవాడ గ్రామంలో అల్ట్రాటెక్ సిమెంట్స్ కర్మాగారంలో తీవ్రంగా గాయపడిన వారిలో బొంత శివనారాయణ, గుగులోతు గోపీనాయక్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన శివనారాయణ కంపెనీలో రెగ్యులర్ కార్మికునిగా పని చేస్తుండగా బూదవాడ గ్రామానికి చెందిన గుగులోతు గోపీ నాయక్ కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తున్నాడు. వీరు విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



కోడూరు: పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. కోడూరు మండలంలో శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శిరీష తెలిపిన వివరాల మేరకు.. ఉల్లిపాలెం గ్రామానికి చెందిన పెద్ద సింగు రాంబాబు పెద్దమొత్తం రేషన్ బియ్యాన్ని నిల్వ చేశాడు. కచ్చితమైన సమాచారంలో రాంబాబు ఇంటి వద్ద తనిఖీలు చేశారు. బియ్యాన్ని ఉల్లిపాలెం వారధి మీదగా మచిలీపట్నం తరలించేందుకు రాంబాబు ప్రయత్నించాడు. దీంతో వారధి సమీపంలో దాడులు నిర్వహించడంతో ఆటోలో 12 బస్తాల్లో సుమారు ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. రేషన్ మాఫియా నిర్వహిస్తున్న రాంబాబు పరారైనట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి పరారైన రాంబాబు కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రయాణంలో సీటు బెల్టు, హెల్మెట్ తప్పనిసరి

కలెక్టర్ బాలాజీ



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): వాహనాల్లో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు పెట్టుకోవటం, హెల్మెట్ ధరించటం తప్పనిసరి అని దీనిని పటిష్ఠంగా ప్రత్యేక ప్రణాళికతో అమలు చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారుల్లో ప్రయాణించే టప్పుడు చాలా మంది సీటు బెల్టు, హెల్మెట్లు ధరించకపోవటం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఇటువంటి పరిస్థితి జిల్లాలో ఇకపై జరగకుండా నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జాతీయ రహదారిలో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు, హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నెల 16వ తేదీన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, అన్ని ప్రభుత్వ శాఖల్లో సీటు బెల్టు, హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు. జిల్లాలో గుర్తించిన 61 బ్లాక్ స్పాట్‌లను రవాణా, పోలీస్, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారిశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి ప్రమాదాల నివారణకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. హిట్ అండ్ రన్ మోటారు ప్రమాదాల్లో బాధితులకు, చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 50 వేలు చొప్పున అందించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 28 కేసులు నమోదయ్యాయని వాటికి సంబంధించిన క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, డీటీసీ పురేంద్ర, డీపీటీవో వాణిశ్రీ, డీఎస్పీ సుభాని, డీఎంఅండ్‌హెచ్‌వో జి.గీతాబాయి, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ సీనియర్ డివిజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, జాతీయ రహదారుల పీడీ సుధీర్‌బాబు పాల్గొన్నారు.

ముగిసిన త్రోబాల్ పోటీలు



బహుమతులందుకున్న విజేత జట్లలోని క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): స్థానిక విద్యానగర్‌లోని స్టెమ్ స్కూల్లో రెండురోజులుగా నిర్వహిస్తున్న ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల స్థాయి సీబీఎస్ఈ పాఠశాలల బాలికల త్రోబాల్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. అండర్–14 విజేతగా జాన్సన్ గ్రామర్ స్కూల్ (హైదరాబాద్), అండర్–17 విజేతగా శ్రీవేద (మదనపల్లి), అండర్–19 విజేతగా టింపనీ స్కూల్ (విశాఖ) నిలిచారు. అనంతరం విజేతలకు సమాచార హక్కు రాష్ట్ర కమిషనర్ చావలి సునీల్, ప్రిన్సిపల్ అంథోని బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య, పోటీల నిర్వహణ కార్యదర్శి ఫాదర్ భరత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ అనుపమ, రమాదేవి, సావేరి, సంధ్య, చీఫ్ కోచ్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

యార్డులో 25,626 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 21,027 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 25,626 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.8,500 నుంచి రూ.18,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,347 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో శ్రీమేధ చైర్మన్ నందకిషోర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గురువారం ప్రకటించిన సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. కొత్తపేటలోని శ్రీమేధ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నందకిషోర్ మాట్లాడుతూ తమ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ మార్కులతో పాటు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. గత 19 ఏళ్లుగా సీఏ సీఎంఏ కోర్సుల్లో 450కు పైగా అఖిల భారతస్థాయిలో ర్యాంకులు సాధించామని తెలిపారు. ప్రస్తుత ఫలితాల్లో తమ విద్యార్థి ఎస్.సంతోష్‌కుమార్ 400 మార్కులకు గాను 338, షేక్ ఫిర్దోస్ 316, బి. నరసింహ సాయి ధీరజ్ 312, బి.వెంకట శివ సాయి కార్తీక్ 310, ఎస్.భువన్ వెంకట సాయి 304, కె.తిరుమల సాయి సంతోష్ 304, వి.శరణ్య లక్ష్మి 302, బి.రాహుల్ 302, ఎన్.భవ్య సాయి 300, ఎస్. కిషోర్ 300, షేక్ సలాం 300 వంటి టాప్ మార్కులు సాధించారని వివరించారు. ఇంటర్మీడియెట్ నుంచి సీఏ, సీఎంఏ ఫౌండేషన్ కోర్సులకు కాయిన్ ప్రోగ్రాం ద్వారా అనుభవజ్ఞులైన అధ్యాపకులచే అందిస్తున్న శిక్షణ ద్వారా తమ విద్యార్థుల అఖిల భారతస్థాయిలో టాప్ మార్కులు సాధించారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి అభినందించారు.

సారె సమర్పించిన భక్త బృందాలివే..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని దుర్గమ్మకు శుక్రవారం పెద్ద ఎత్తున భక్త బృందాలు సారెను సమర్పించాయి. చిన్న నందిగామకు చెందిన ఎం. కమలకుమారికి చెందిన 85 మంది భక్తులు, మంగళగిరికి చెందిన ఆర్య వైశ్య మహిళా మండలికి చెందిన 50 మంది, అంబాపురం నుంచి శ్రీ కనకదుర్గ సేవా మండలికి చెందిన 50 మంది, పామర్రు నుంచి డి. నాగమణి బృందంకు చెందిన 50 మంది, బనగానపల్లికి చెందిన జి. దుర్గాభవానీ బృందానికి చెందిన 75 మంది, గుంటూరుకు చెందిన శ్రీ గణేష్ మహిళా సంఘంకు చెందిన 30 మంది, విజయవాడ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయం నుంచి 30 మంది, భవానీపురంలోని సాయి భరద్వాజ సేవా సమితికి చెందిన 40 మంది, విజయవాడకు చెందిన సీహెచ్. విజయలక్ష్మీ బృందానికి చెందిన 35 మంది, పి.ఆనంద్ బృందానికి చెందిన 50 మంది, టి. శ్రీనివాసరావు బృందానికి చెందిన 30, యు. లాస్య బృందానికి చెందిన 50 మంది, కృష్ణలంకకు చెందిన బి. వెంకటరావు బృందానికి చెందిన 70 మంది అమ్మవారికి సారెను సమర్పించారు. సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో సారెను సమర్పించారు.

జిల్లాలో విద్యా రంగానికి తొలి ప్రాధాన్యం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక కేంద్రమైన ఎన్టీఆర్ జిల్లాకు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించడం తనకు లభించిన అదృష్టమని కలెక్టర్ జి.సృజన తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల పరిచయ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. విద్యకు తొలి ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు. విద్యాబోధన ప్రణాళికకు అనుగుణంగా జరిగేలా కృషి చేస్తానన్నారు. మీడియా సూచనలు, సలహాలతో ప్రజలకు మరింత పారదర్శకంగా సేవలందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా సమష్టి కృషితో జిల్లాను అన్ని రంగాల్లో ముందు నిలిపేందుకు చేసే కృషిలో మీడియా సహాయ సహకారాలు అవసరమని పేర్కొన్నారు. బాయిలర్స్, రసాయనాలు వంటివి ఉన్న పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా తీసుకున్న భద్రతా చర్యలపై ప్రత్యేక కమిటీలతో తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. డీఐపీఆర్‌వో యు.సురేంద్ర నాథ్, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహనరావు, అడిషనల్ పీఆర్‌వో కె.రవి, ఆడియో విజువల్ సూపర్‌వైజర్ వీవీ ప్రసాద్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

శవంగా దొరికిన అదృశ్యమైన వ్యక్తి

గూడూరు: మూడు రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి శవంగా మారటం పట్ల మల్లవోలులో చర్చాంశనీయంగా మారింది. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని మల్లవోలుకు చెందిన బోయిన వెంకటేశ్వరరావు (65) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు, అకస్మాత్తుగా ఇంటి నుంచి అదృశ్యమైన వెంకటేశ్వరరావు ఆచూకీ కోసం గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గుడ్లవల్లేరు రైల్వే స్టేషన్‌లో అపస్మారక స్థితిలో పడిఉన్న వెంకటేశ్వరరావును రైల్వే పోలీసులు బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిసింది. బందరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ఆరా తీయగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని తేలింది. మార్చురీలో ఉన్న మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటేశ్వరరావుకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మృతుడి మట్టి ఖర్చులకు రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ మానవహక్కుల సంఘం యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన త్రినాథ్, ప్రతిపాటి స్వామి, గుంటూరు వెంకటరత్నం, పలగాని మహేష్, ప్రత్తిపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెరటి తోటలతో ఆరోగ్య వృద్ధి

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



ఉయ్యూరులో నిర్వహించిన అవగాహన సదస్సులో సూచనలు ఇస్తున్న అధికారులు

పెనమలూరు: పెరటి తోటల పెంపకంతో ఆరోగ్యం వృద్ధి చెందుతుందని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకునేందుకు తోటలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. గుడివాడ, ఉయ్యూరు డివిజన్‌లకు చెందిన 40 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామోపాధ్యాయులకు కిచెన్ గార్డెన్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఉయ్యూరులో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులకు తన సందేశాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ పెరటి తోటల పెంపకం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రకృతి సిద్ధమైన పద్ధతుల ద్వారా మొక్కలను పెంచటం, సంరక్షించటం ద్వారా భవిష్యత్తు తరాలకు రసాయన, పురుగు మందుల వల్ల నష్టం అర్థమవుతుందని చెప్పారు. పెట్టుబడులు తగ్గి, ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కాలుష్యానికి కారణమవుతున్న ప్రస్తుత విధానాన్ని విడనాడి ప్రకృతి వైపు ప్రయాణం చేయాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించటంతో పాటుగా పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య చైతన్య కార్యక్రమాల ద్వారా లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. అపార్టుమెంటు సంస్కృతి వచ్చినా, చిన్న చిన్న పాత్రల్లో మొక్కలు పెంచుకోవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి పార్థసారథి ప్రయోగాత్మకంగా బీజామృతం, జీవామృతం, ఘనామృతం తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శైలజ మాట్లాడుతూ సాంకేతిక సహకారం, మెరుగైన విత్తనాలు అందించటం కోసం తోడ్పాటు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఉప విద్యాశాఖాధికారి ఐ.పద్మారాణి, జిల్లా సైన్స్ అధికారి మొహమ్మద్ జాకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిజ స్వరూపం బట్టబయలైంది

ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఓడ దాటక ముందు ఓడ మల్లన్న ఓడ దాటిన తర్వాత బోడి మల్లన్న అన్న సామెత చంద్రబాబుకు సరిగ్గా సరిపోతుందని... జీఓ నెంబర్ 29తో తల్లికి వందనం కాస్తా పిల్లలకు గండంగా మారిందని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. టీడీపీ చెప్పిన సూపర్ సిక్స్ హామీలు కాస్తా సెల్ఫ్ ఔట్ పథకాలుగా మారుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నం. 29 వల్ల రాష్ట్రంలోని నిరుపేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు ఉన్నత విద్యను దూరం చేయాలనే దురుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉంటే వారందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కరికే రూ.15 వేలు ఇస్తామంటూ జీఓను తీసుకురావడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రైవేటు విద్యా దోపిడీని రాష్ట్ర ప్రభుత్వం నియంత్రించాలని కోరారు. లేని పక్షంలో విద్యార్థుల పక్షాన నిలబడి ఎలాంటి పోరాటాలు చేయడానికి తాము వెనుకాడబోమని హెచ్చరించారు.

బీపీసీఎల్ ఆయిల్ రిఫైనరీని సాధించుకుంటాం

ఎంపీ బాలశౌరి



ఎంపీ, ఎమ్మెల్యేని సత్కరిస్తున్న నిర్వాహకులు

అవనిగడ్డ: రాష్ట్ర విభజన హక్కుల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ బీపీసీఎల్ ఆయిల్ రిఫైనరీని మచిలీపట్నంకు తీసుకొచ్చి 50 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి చెప్పారు. అవనిగడ్డలోని గాంధీక్షేత్రంలో శుక్రవారం ప్రజా కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ నాబార్డు నిధులతో ఎదురుమొండి వారధి నిర్మాణం చేపడతామని, ఎడ్లంక వంతెన, రోడ్లు నిర్మిస్తామన్నారు. ఎంపీ నిధులు, అర్బన్ డెవలప్‌మెంట్ నిధులు, అమృత్–2 నిధులతో జిల్లాలో పూర్తిస్థాయిలో తాగునీరు అందించే చర్యలు చేపడతామని తెలిపారు. ఎనిమిది టీఎంసీలు నీరు నిల్వ ఉండేలా బండికోళ్ళలంక, చోడవరం వద్ద రెండు బ్యారేజీలు నిర్మించేందుకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సారథ్యంలో అమరావతి, పోలవరం ప్రాజెక్టులు నిర్మించి సమర్థవంతమైన పాలన అందిస్తామని చెప్పారు. తనను, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ని రికార్డుస్థాయి మెజారిటీతో గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేలా కృషిచేస్తానని చెప్పారు. ఎంపీ బాలశౌరి సహకారంతో శిథిలమైన అవుట్‌ఫాల్ స్లూయిస్‌గేట్లను ఆధునికీకరిస్తామని, దెబ్బతిన్న రహదారులు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ని సత్కరించారు. మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ, మచిలీపట్నం జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, నియోజకవర్గ జనసేన యువనేత మండలి వెంకట్రామ్‌తో పాటు పలువురు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మేధా శక్తి పెంచేందుకు చెస్ దోహదం

ఎమ్మెల్యే బోడే ప్రసాద్



మొదటి ఎత్తు వేసి పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: చిన్నారుల్లో మేధాశక్తిని పెంచేందుకు చెస్ క్రీడ దోహదం చేస్తుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. కానూరులోని ఆహ్వానం కల్యాణ మండపంలో మూడు రోజుల పాటు జరిగే స్పార్క్ చెస్ అకాడమీ రెండో అంతర్జాతీయ 1800 లోపు ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. చెస్ క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. చురుకైన ఆలోచన తీరును చెస్ క్రీడాకారులు కలిగి ఉంటారన్నారు. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ, స్టేడియం నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రెండో అంతర్జాతీయ టోర్నీ నిర్వహిస్తున్న స్పార్క్ చెస్ అకాడమీ నిర్వాహకులను అభినందించారు. భారత్‌తో పాటు కెన్యా, పాకిస్తాన్, అమెరికాకు చెందిన 616 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని టోర్నీ డైరెక్టర్ తాళ్ల నరేష్ తెలిపారు. స్పార్క్ చెస్ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, ది విజయవాడ చెస్ అసోసియేషన్, ధనేకుల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సౌజన్యంతో ఈ టోర్నీని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్‌నాయుడు ఈ టోర్నీకి చీఫ్ ఆర్బిటర్‌గా వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు. ధనేకుల కాలేజీ ఎండీ రవికుమార్, జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు బి.రామకృష్ణ, కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఫణికుమార్, ది విజయవాడ చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.రాజీవ్ పాల్గొన్నారు.

కందకంలోకి బైక్ దూసుకెళ్లి వీఆర్వో మృతి



వీఆర్వో ప్రభాకరరావు మృతదేహం

నందిగామ(కంచికచర్ల): గ్రామ సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్న ఓ ఉద్యోగి గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ పండుదొర తెలియజేసిన కథనం మేరకు... పెనుగంచిప్రోలు మండలం శనగపాడు గ్రామానికి చెందిన కీసర ప్రభాకరరావు (46) నందిగామ ఏడవవార్డు గ్రామ సచివాలయంలో వీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్నారు. గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ జుజ్జూరు గ్రామంలో నివాసముంటున్న తన చెల్లి ఇంటికి వెళ్లారు. ఆరోగ్యం కుదుటపడ్డాక తన చెల్లితో కలసి గురువారం రాత్రి శనగపాడు వచ్చారు. చందర్లపాడు మండలం బొబ్బిళ్లపాడు గ్రామంలో ఉన్న భార్య, పిల్లలను చూసేందుకు బైక్‌పై బయలుదేరాడు. కే కంద్రిక అగ్రహారం అడ్డరోడ్డు వద్ద బైక్ ప్రమాదవశాత్తు కందకంలో పడిపోయింది. పెద్దరాయికి ప్రభాకర్ తల తగలటంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త్రికోటేశ్వరుడికి రూ.81.72 లక్షలు ఆదాయం



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం హుండీ కానుకల్ని శుక్రవారం లెక్కించారు. దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి, సింగరుట్ల లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానం ఈవో సీహెచ్. నాగిరెడ్డి పర్యవేక్షించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.76,63,351, అన్నదానం హుండీ ద్వారా రూ.5,09,440 ఆదాయం లభించినట్టు వివరించారు. 125 రోజులకు గాను మొత్తం రూ.81,72,791 వచ్చినట్టు తెలిపారు. దీంతో పాటు వెండి 695గ్రాములు, బంగారం 36.500గ్రాములు, విదేశీ కరెన్సీ 105 అమెరికన్ డాలర్లు, 15 ఆస్ట్రేలియన్ డాలర్లు, రెండు సింగపూర్ డాలర్లు, 100 పౌండ్లు సూడాన్ కరెన్సీ హుండీల ద్వారా వచ్చినట్టు తెలిపారు. లెక్కింపులో కెనరా బ్యాంక్ తంగేడుమల్లి బ్యాంక్ మేనేజర్, సిబ్బంది, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.



క్లుప్తంగా

కొబ్బరి చెక్కల టెండర్ వాయిదా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామివారికి భక్తులు సమర్పించే కొబ్బరి చెక్కలను సేకరించుకునే హక్కుకు నిర్వహించే టెండర్ వాయిదా పడింది. మహా మండపం నాలుగో అంతస్తులోని లీజెస్ విభాగంలో శుక్రవారం టెండర్ ప్రక్రియ నిర్వహించారు. బహిరంగ వేలం, సీల్డ్ టెండర్, ఆన్‌లైన్ టెండర్ వంటి మూడు ప్రక్రియల ద్వారా ఆలయ అధికారులు టెండర్‌ను ఆహ్వానించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉన్నా, ఒక్కరు మాత్రమే టెండర్ దాఖలు చేసేందుకు విచ్చేశారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు వేచి చూసి నిబంధనల మేరకు టెండర్‌ను వాయిదా వేస్తూ సెక్షన్ ఏఈవో వెంకటరెడ్డి నిర్ణయం తీసుకున్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణోత్సవంలో పలువురు ఉభయదాతలు, భక్తులు గోత్రనామాలతో పూజలు జరిపించుకున్నారు. స్వామివారి కల్యాణంలో పాల్గొన్నా, వీక్షించినా, స్వామివారికి సమర్పించిన తలంబ్రాలు స్వీకరించినా భక్తుల ఇంట ఇబ్బందులు తొలగుతాయని, సంతాన భాగ్యం, వివాహ యోగం కలుగుతుందని అర్చకులు తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం ఈవో కె.ఎస్.రామరావు స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేయించారు.

వారాహి వందనం



కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆషాఢ మాసం సందర్భంగా బస్టాండ్ సమీపంలోని శ్రీకాళీమాత దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో వారాహి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఏడో రోజు శుక్రవారం వారాహి మాత అలంకారంలో ఉన్న అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి వీరాంజనేయ హోమం, నవగ్రహ హోమం, లక్ష్మీగణపతి హోమం, వారాహి అమ్మవారి హోమం, రుద్ర హోమం నిర్వహించారు. సాయంత్రం సువాసినులతో అమ్మవారికి వారాహి అష్టోత్తరం, సహస్రనామాలను బ్రహ్మశ్రీ మార్తి సూర్యనారాయణ శర్మ జరిపించారు.కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు సీహెచ్ విజయకిరణ్, సూపరింటెండెంట్ మధుసూదనరావు తదితరులు పర్యవేక్షించారు.

కళ్లే లలిత ట్రస్ట్ సేవలు మరింత విస్తృతం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కళ్లే లలిత ట్రస్ట్ సేవలు మరింత విస్తృతం చేస్తున్నామని ట్రస్ట్ డైరెక్టర్ సీతామహాలక్ష్మి చెప్పారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద శుక్రవారం అన్నదానం చేశారు. తొలుత కళ్లే లలిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా తోపుడుబండ్లు, దుస్తులు, నిత్యావసర సరుకులు తదితరాలను పేదలకు అందజేస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ అధ్యక్షుడు కళ్లే నాగేశ్వరరావు, సభ్యులు ముప్పూరి హరీష్, ఎం.జశ్విన్, జి.ధ్రువస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ బాలికల ప్లస్–2 పాఠశాల ఇంటర్ మీడియెట్ బాలికలకు నోట్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఎంపీసీ, సీఈసీ చదువుతున్న 117 మంది బాలికలకు హెచ్‌ఎం బి.పద్మలత, ఎస్‌ఎంసీ చైర్మన్ నడుకుదిటి పుష్ప ఒక్కొక్కరికి 12 పుస్తకాల చొప్పున అందజేశారు. వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

నేత్రపర్వం..



నగరంలోని ఇస్కాన్ జగన్నాథ్ మందిర్ ఆధ్వర్యంలో శుక్రవారం రథయాత్ర రమణీయంగా జరిగింది. ఎంజీరోడ్డులో డి అడ్రస్ మాల్ వద్ద ప్రారంభమైన యాత్ర నగరంలో సాగింది. హరేరామ హరేకృష్ణ నామస్మరణతో భక్తులు పులకించారు. రథయాత్రలో నిర్వహించిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రదర్శనలు అలరించాయి. భక్తజనం పెద్దసంఖ్యలో రథయాత్రలో పాల్గొనడానికి రావడంతో వీధులు కోలాహలంగా మారాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





రోడ్లపై వాన నీరు నిలవకుండా చర్యలు



పొంగిపొర్లుతున్న యూజీడీని పరిశీలిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

పటమట(విజయవాడతూర్పు): వర్షం పడినప్పుడు రోడ్లపై వాన నీరు నిలవకుండా ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్ విభాగం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్ ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం నగరంలోని సర్కిల్ 2, సర్కిల్ 3 పరిధిలోని జింఖానా గ్రౌండ్స్, గాంధీనగర్, బీఆర్టీఎస్ రోడ్, శారద కాలేజీ, గురునానక్ కాలనీ, బెంజ్ సర్కిల్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఉన్న వర్షం నీటి నిల్వలతో ప్రజలు ఇబ్బంది పడకుండా నిరంతరం ఎయిర్‌టెక్ మిషన్ల తొలగించాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. ఎప్పటికప్పుడు సైడ్ డ్రైన్లలో వర్షం నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన సీతారాంపురం సిగ్నల్ రోడ్డు, గురునానక్ కాలనీ రోడ్డులో పొంగుతున్న మురుగును చూసి వెంటనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రతిరోజూ తాగునీటి నమూనాలను సేకరించి ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తూ సురక్షితమైన తాగునీటినే సరఫరా చేయాలని చెప్పారు. నగరవాసులు వీఎంసీ నీటి సరఫరా చేస్తున్న సమయంలోనే పట్టుకోవాలన్నారు. కార్పొరేషన్ తాగునీటి సరఫరా చేయని సమయంలో మోటారు ద్వారా నీటిని పట్టుకుంటే బురద నీళ్లు, రంగు మారిన నీరు వస్తాయని, వాటిని తీసుకోవద్దని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఏఎంవోహెచ్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న హీరోయిన్ కీర్తి, డైరెక్టర్ అఫ్జల్

గుణదల(విజయవాడతూర్పు): విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకుని ప్రతిభావంతులుగా ఎదగాలని వర్ధమాన నటి 1000 వాలా సినిమా హీరోయిన్ కీర్తి అన్నారు. ఆంధ్ర లయోలా కళాశాలలో రెండు రోజులుగా జరిగిన మాగ్నలైట్ 2కే24 కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ముఖ్యఅతిథి కీర్తి మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కేవలం విద్యకే పరిమితం కాకుండా సామాజిక, సాంస్కృతిక, కళా రంగాల్లో సైతం అవగాహన పెంచుకోవాలని తెలిపారు. విద్యార్థుల్లో సృజన వెలికి తీయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. మిస్టర్ అండ్ మిస్ లయోల కాలేజీ ఈవెంట్ ప్రధానాకర్షణగా నిలిచింది. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దర్శకుడు అఫ్జల్, కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వినోదాత్మక చిత్రం డార్లింగ్ వై దిస్ కొలవరి



మాట్లాడుతున్న చిత్ర యూనిట్‌సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): భార్యాభర్తల మధ్య జరిగే గొడవను వినోదాత్మకంగా మలిచిన చిత్రం డార్లింగ్ వై దిస్ కొలవరి అని చిత్ర కథానాయకుడు ప్రియదర్శి అన్నారు. ఈ నెల 19న చిత్రం విడుదల కానుండటంతో ఆ సినిమా యూనిట్ సభ్యులు ప్రమోషన్‌లో భాగంగా శుక్రవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రియదర్శి మాట్లాడారు. దర్శకుడు అశ్విన్ రామ్ చెప్పిన కథ విని, వెంటనే హీరోగా నటించడానికి ఒప్పుకున్నట్లు తెలిపారు. కుటుంబ సమేతంగా ఈ చిత్రాన్ని చూడవచ్చని, అసభ్యకరమైన సన్నివేశాలు చిత్రంలో ఉండవన్నారు. చిత్ర హీరోయిన్ నభ నటేష్ నటించిన ఆనంది పాత్ర ప్రేక్షకులకు కచ్చితంగా ఆకట్టుకుంటుందని చెప్పారు. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని వీక్షించి ఆదరించాలని ఆయన కోరారు. హీరోయిన్ నభ నటేష్ మాట్లాడుతూ మతిమరుపు పాత్రలో నటించడంతోపాటు గయ్యాళి భార్యగా హీరోని ఆట పట్టించే సన్నివేశాలు ప్రేక్షకులను అలరిస్తాయన్నారు. సమావేశంలో దర్శకుడు అశ్విన్ రామ్, హాస్యనటుడు కృష్ణతేజ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీపై పట్టు సాధించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీపై పట్టు సాధించాలని ఆకర్ష ఫౌండేషన్ ప్రెసిడెంట్ గణేష్ శంకర్ సూచించారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సైన్స్ అండ్ టెక్నాలజీ భాగస్వామ్యంతో ఆకర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యూచర్‌పాత్, లహరి విద్యామందిర్‌లలో సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన సదస్సు జరిగింది. గణేష్ శంకర్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, హెల్త్ హైజీన్, ఆస్ట్రో ఫిజిక్స్‌పై విశ్లేషణాత్మకంగా వివరించారు. బిగ్ బ్యాంక్ థియరీపై అవగాహన కలిగించారు. టెక్నాలజీపై లఘుచిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ శ్రావణి, ట్రైనర్ వంశీ, సాయి సతీష్ పాల్గొన్నారు.

20వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక 20వ డివిజన్‌లో రూ.40.29 లక్షల వ్యయ అంచనాతో పనులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులకు, డ్రైనేజీ పునఃనిర్మాణ పనులకు చర్చి వద్ద శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడను విశ్వవ్యాప్తనగరంగా తీర్చిదిద్దడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. గౌతమీనగర్ కరకట్ట సర్వీసు రోడ్డు, గౌతమీనగర్ 3వ క్రాస్ రోడ్డు, గల్లా రామారావు రోడ్డు నుంచి పంప్ హౌస్ చర్చి వరకు డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని చెప్పారు. అనంతరం వంగవీటి మోహనరంగా స్మృతివనం ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అడపా శేషు, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోడానికి షార్ట్ కట్స్ అంటూ ఏమీ ఉండవని కష్టపడి ఇష్టంగా చదవడమేనని శ్రీ శ్రీనివాసా గ్రావిటీ కళాశాల చైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు చెప్పారు. శ్రీనివాస గ్రావిటీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం సిద్దార్థ ఆడిటోరియంలో జరిగాయి. గత ఏడాది జరిగిన నీట్, ఏపీ ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకులు పొందిన విద్యార్థులకు కళాశాల ప్రతినిధులు జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రజుమంలో కళాశాల డైరెక్టర్ పరుచూరి నీలిమ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థిక చేయూత



విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర, జాతీయ క్రీడల్లో రాణించిన పలువురు క్రీడాకారులకు నాదెళ్ల బసవపున్నయ్య(ఎన్‌బీపీ) ట్రస్ట్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందించారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కబడ్డీ, జూడో, బాక్సింగ్, ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడాకారులు 25 మందికి రూ.1,500 చొప్పున నగదు, జెర్సీలు, కిట్‌లు పంపిణీ చేశారు. 1993 నుంచి ట్రస్ట్ ద్వారా క్రీడాకారులకు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, పలు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తూ యువతలో క్రీడా ప్రమాణాలను పెంచుతున్నామని ట్రస్ట్ ప్రతినిధులు నాదెళ్ల బ్రహ్మాజీ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు మోనిక, వేణుగోపాలరావు, మాగంటి శ్రీనివాసరావు, గుమ్మడి దేవేంద్రరాజు, రాజగోపాలరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యం

సీసీఎం సత్యనారాయణ



క్యాటరింగ్ స్టాల్స్‌లో అధికారులకు సూచనలు చేస్తున్న సీసీఎం డి.సత్యనారాయణ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నట్లు చీఫ్ కమర్షియల్ మేనేజర్ (ప్యాసింజర్ సర్వీసెస్) డి.సత్యనారాయణ తెలిపారు. అధికారులతో కలసి ఆయన శుక్రవారం విజయవాడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేశారు. స్టేషన్‌లోని అన్ని క్యాటరింగ్ స్టాల్స్, జన్ ఆహార్ యూనిట్లు, ప్రధాన ఫుడ్ యూనిట్లను సందర్శించి ఆహార నాణ్యత, పరిశుభ్రత, విక్రయ ధరలను తనిఖీ చేశారు. వాటర్ వెండింగ్ మెషిన్‌లను పరిశీలించి నీటి టీడీఎస్ స్థాయిలను పరీక్షించారు. అనంతరం స్టేషన్ పరిసరాల్లో ఏర్పాటుచేసిన రైల్ కోచ్ రెస్టారెంట్‌ను తనిఖీ చేసి అక్కడ ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అన్ని ప్రమాణాలు సక్రమంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ నుంచి ప్లాట్‌ఫామ్ 1లోని రిటైరింగ్ రూమ్‌లలో పరిశుభ్రత, నిర్వహణ, సౌకర్యాలను పరిశీలించారు. ఇంకా మెరుగైన వసతులు కల్పించడానికిప్రయాణికులు, విక్రేతలు, రైల్వే సిబ్బందితో మాట్లాడి వారి సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. స్టేషన్‌లో అన్ని వసతులు, సేవలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, ప్రయాణికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో డీసీఎం ఎండీ అలీఖాన్, ఏసీఎం రవివర్మ, స్టేషన్ డైరెక్టర్ శైలజ, ఇతర అధికారులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్.. ఎస్‌ఎన్‌బీ వాటర్ ట్యాంక్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ, నోవాటెల్ హోటల్ వెనుక ప్రాంతం, సమోసా కంపెనీ ఏరియా, అక్కినేని ఉమెన్స్ ఆస్పత్రి ఏరియా, చందమామ ఆస్పత్రి ఏరియా, న్యూ పీ అండ్ టీ కాలనీ, శ్రీనగర్ కాలనీ, విద్యుత్ కాలనీ, సాయిబాబా గుడి ప్రాంతం, ఎస్‌బీహెచ్ కాలనీలో కొంత భాగం, బెంజ్‌సర్కిల్ ఫీడర్ పరిధిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద, భద్రయ్యనగర్, నిర్మల కాన్వెంట్ రోడ్డు, కేపీ నగర్, సాయిబాబా గుడి పక్క రోడ్లలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

- ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమట పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈఓ హరిబాబు తెలిపారు. ఆర్టీసీ కాలనీ, ఎలక్ట్రిసిటీకాలనీ, లక్ష్మీపతినగర్, పోరిమెన్ రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో కరెంట్ ఉండదని పేర్కొన్నారు.

రైతుబజార్‌లో కందిపప్పు, బియ్యానికి ప్రత్యేక కౌంటర్



కృష్ణలంక రైతుబజార్‌లో బియ్యం, కందిపప్పు విక్రయకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె

కృష్ణలంక(విజయవాడతూర్పు): నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో ఉండటానికి ప్రభుత్వం రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణలంక రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపపప్పు విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామమోహన్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, బియ్యం, కందిపప్పు కొనాలంటే ప్రజలు భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. వీటన్నింటి దృష్ట్యా సీఎం చంద్రబాబు రైతుబజార్ల ద్వారా నిత్యావసర వస్తువులు కందిపప్పు, బియ్యాన్ని తక్కువ ధరకే అందిస్తున్నారన్నారు. ఇవి కేవలం రైతుబజార్లకే పరిమితం కాకుండా రాష్ట్రంలోని సూపర్‌మార్కెట్లలో కూడా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం, కందిపప్పు విక్రయించడానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.మోహన్ బాబు, ఏఎస్ఓ ఎన్‌ఎస్‌ఎస్ ఆచార్యులు, రైతుబజార్ ఈవో జాన్‌విక్టర్, ఆర్‌ఐలు, రైతుబజార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందుల ఉత్పత్తులు ఆవిష్కరణ



ఆవిష్కరించి చూపుతున్న పురుగుమందులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రముఖ బహుళజాతి సంస్థ అయిన క్రిషి రసాయన్ ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో రూపొందించిన క్రిఫాస్ గోల్డ్, క్రిల్, క్రియేట్, కౌగర్, కాక్సి55 అనే నూతన ఉత్పత్తులను విజయవాడలోని హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ క్రిమిసంహారక మందుల ఉత్పత్తిలో తమ కంపెనీకి 50 సంవత్సరాల అనుభవంతో పాటుగా 40 దేశాలకు పైగా తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్న అతిపెద్ద సంస్థ అన్నారు. ఇప్పుడు ఆవిష్కరించిన పురుగుమందులు పత్తి, మిర్చి, వరిలో వచ్చే రసం పీల్చే పురుగు, గొంగలి పురుగుల నివారణకు సమర్థవంతంగా పనిచేయడంతో పాటుగా అధిక దిగుబడులకు తోడ్పడతాయని చెప్పారు. కాక్సి 55 అనే శిలీంద్రనాశిని (తెగుళ్లమందు) పత్తి, మిర్చి, కాయకూరలు, ఉద్యానవన పంటల్లో వచ్చే కాయకుళ్లు, వేరుకుళ్లు, వివిధ తెగుళ్లను సమర్థవంతంగా అరికడుతుందని చెప్పారు. కంపెనీ ప్రెసిడెంట్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) ఎస్.ఈశ్వర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ ఎ.ఆంజనేయులు, ఫీల్డ్ మార్కెటింగ్ మేనేజర్ సీహెచ్ రాజేశ్వరరావుతో పాటుగా కంపెనీ డిస్ట్రిబ్యూటర్స్ పాల్గొన్నారు.

వివాహిత మృతికి కారణమైన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోండి

విజయవాడస్పోర్ట్స్: మొగల్రాజపురంలో ఈ ఏడాది మే 30న జరిగిన దారాబత్తుల నాగభవాని(23) మృతి ఘటనపై మాచవరం పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. మృతురాలు నాగభవాని నాయనమ్మ చిట్టెమ్మ, పలువురు కుటుంబ సభ్యులతో కలిసి బెజవాడ బార్ అసోసియేషన్ ప్రతినిధులను శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. తన మనుమరాలు నాగభవాని మృతికి కారణమైన గన్నవరం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ గోవర్ధన్‌ను కేసు నుంచి తప్పించేందుకు మాచవరం పోలీసులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాగభవానికి ఐదేళ్ల క్రితం రాజశేఖర్ అనే యువకుడికి ఇచ్చి వివాహం చేశానని చిట్టెమ్మ తెలిపారు. వారికి కానిస్టేబుల్ గోవర్ధన్ పరిచయమయ్యాడు. అతను భార్యభర్తల మధ్యలో చిచ్చుపెట్టాడని ఆరోపించారు. మాయమాటలు చెబుతూ మనుమరాలు నాగభవానితో ఏడాది పాటు సహజీవనం చేశాడని వివరించారు. అతను మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరచుకోవడం దీంతో భవానీ అతనితో గొడవపడటంతో ఆమెను హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడని ఆరోపించారు. గోవర్ధన్‌తో రాజీ పడాలని పోలీసుల ప్రోద్బలంతో పలువురు తమను సంప్రదిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం న్యాయవాది పి.వై.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు చంద్రమౌళి, రాజాకు ఫిర్యాదు ఇచ్చారు.







సారె.. అందుకో దుర్గమ్మా

ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సారె.. అందుకో దుర్గమ్మా అంటూ భక్తజనం ఆషాఢ సారె సమర్పించడానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. దుర్గమ్మ ఆలయాన్ని పుష్పాలతో అలంకరించారు. సారె సమర్పణకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

–సాక్షిఫొటోగ్రాఫర్, విజయవాడ



నూతన విద్యావిధానంతో విజ్ఞానం, ఉపాధి



మాట్లాడుతున్న ఆచార్య దీపక్‌సిన్హా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యావిధానంతో విద్యార్థి విజ్ఞానం, ఉపాధి పొందవచ్చని నాగాలాండ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యుడు ఆచార్య దీపక్‌సిన్హా అన్నారు. కేబీఎన్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యాన నూతన విద్యా విధానంలో క్రెడిట్ ఫ్రేం వర్క్ అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దీపక్‌సిన్హా మాట్లాడుతూ కొత్త విధానంలో అనేక అంశాలను ముందుకు తీసుకొచ్చామన్నారు. క్రెడిట్ సిస్టమ్ ద్వారా విద్యార్థులు మరింత సాధన చేసేందుకు మెరుగుపరిచే అనేక అంశాలను ఆయన వివరించారు. పెన్‌స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆచార్యులు అరుణ్ కే శర్మ ఔషధ పరిశ్రమలో నూతన సవాళ్లు, అవకాశాలపై ప్రసంగించారు. రసాయన శాస్త్ర విద్యార్థులు నూతన పరిశోధనలు, ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. వాటిపై పట్టు సాధించాలన్నారు. ఔషధ రంగంలో అనేక అవకాశాలు యువత కోసం ఎదురు చూస్తున్నాయన్నారు. కొత్తగా వచ్చిన ఆవిష్కరణలపై విద్యార్థులతో ముచ్చటించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రంగాల్లో వస్తున్న మార్పులు, ఆవిష్కరణలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమాన్ని విభాగాధిపతి డాక్టర్ కృష్ణవేణి నిర్వహించారు.

ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ చూసినా.. తెలుగు నిఘంటువులు, శబ్ద రత్నాకరం తిరగేసినా వాటిల్లో వాస్తవ అర్థాలే ఉంటాయి. కానీ సీఎం చంద్రబాబు డిక్షనరీ మాత్రం వేరే ఉంది. ప్రతి పదానికీ తనదైన అర్థాలు, నిర్వచనాలు ఉంటాయి! అవసరాన్ని బట్టి ఎప్పటికప్పుడు మారిపోతుంటాయి. ఎలాగంటే.. ఉచితం అంటారు.. కానీ దానికో ధర ఉందంటారు! ఇసుక ఉచితంగా ఇస్తామంటూనే ఊరికే ఏదీ రాదంటారు మరి!! ఉచితం అంటే టీడీపీ పెద్దల దృష్టిలో అమ్మకమే. రాష్ట్రవ్యాప్తంగా స్టాక్ యార్డుల వద్ద బోర్డు పెట్టి మరీ టన్నుల చొప్పున బహిరంగంగా విక్రయిస్తున్నా సరే అది ఉచితంగా ఇవ్వడమే!

సీనరేజి ఫీజు, తవ్వకం, లోడింగ్, ఇతర పన్నులతోపాటు రవాణా చార్జీలు కూడా వినియోగదారుల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. డబ్బులు చెల్లించి కొన్నా సరే ఇసుకను ఉచితంగా ఇస్తున్నారనే చెప్పాలి. లేదంటే సీఎం చంద్రబాబుకు కోపం వస్తుంది. 'ఉచితం అంటే మీ ఇంటికి నేనే ఫ్రీగా తీసుకొచ్చి ఇవ్వాలా?' అని ఎదురుదాడి చేస్తారు. డబ్బులిచ్చి కొంటున్నాం.. కదా అని ఎవరైనా వినియోగదారుడు ఉచితం కాదని చెబితే టీడీపీ శ్రేణులు చితకబాదినా దిక్కుండదు. ఎందుకంటే అది టీడీపీ సర్కారు ఉచిత విక్రయ పథకం కాబట్టి!

- సాక్షి, అమరావతి/సాక్షి, నెట్‌వర్క్





ఈ ఉచితం చాలా కాస్ట్లీ

ఇసుక ఫ్రీనే కానీ.. ప్రతి రేణువుకూ రేటుంది

- టన్నుల లెక్కన బోర్డులు పెట్టి మరీ ముక్కు పిండి వసూలు
- స్టాక్ పాయింట్ నుంచి రవాణా చార్జీలు, పన్నులు అదనం
- వేబ్రిడ్జిలు లేనిచోట్ల ఇష్టారాజ్యంగా లోడింగ్...
- ఒకే బిల్లుపై పలు వాహనాల్లో తరలింపు
- ఇప్పటికే 40 లక్షల టన్నుల ఇసుక మాయం
- పచ్చ ముఠాల కనుసన్నల్లోనే రీచ్‌లు, స్టాక్ పాయింట్లు
- ఉచితంగా ఇస్తామంటూ ఉమ్మడి మేనిఫెస్టో హామీ ఇసుకలోకి..

కర్నూలులో కొనలేం..

కర్నూలు జిల్లాలో ఇసుక ధరలు భారీగా ఉన్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రేటు పెట్టి దోచుకుంటున్నారు. మరోవైపు కౌతాళం మండలం గుడికంబాళి రీచ్‌లోని ఇసుకను టీడీపీ నాయకులు ఇతరుల ఆధార్ కార్డులతో కొల్లగొట్టి డంపింగ్ చేస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో 18 టన్నులు ఇసుక గరిష్ఠంగా లారీ రవాణా చార్జీలతో కలిపి రూ.32వేలు వరకు అవుతోంది.



కర్నూలు జిల్లా గుడికంబాళి రీచ్ వద్ద ట్రాక్టర్లలో ఇసుక లోడింగ్

శ్రీశైలంలో
₹ 32,000

పల్నాడులో పచ్చనేతలు చెప్పిందే ధర



వినుకొండ నియోజకవర్గం తలర్లపల్లిలో గుండ్లకమ్మ వాగు నుంచి ఇటీవల అక్రమంగా ఇసుక తరలిస్తుండగా బోల్తాపడ్డ ట్రాక్టర్

పల్నాడు జిల్లాలో ఇసుక అక్రమ డంప్‌లు పెద్ద ఎత్తున ఉన్నాయి. కృష్ణానది, గుండ్లకమ్మ, వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలించి డంపింగ్ యార్డులలో నిల్వ ఉంచారు. ఇటీవల వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం తలర్లపల్లిలో గుండ్లకమ్మ వాగు నుంచి టీడీపీ నేతలు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఓ ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మరణించిన విషయం తెలిసిందే. కొండమోడులో టన్ను ఇసుక ధర రూ.564లు ఉండగా, వినుకొండలో రూ.793లు ఉంది. వీటికి రవాణా చార్జీలు అదనం. తాళ్లాయపాలెం నుంచి గుంటూరుకు ఇసుక లారీ రావాలంటే రూ.15,000 పైనే అవుతోంది. మాచర్లలో 18 టన్నుల ఇసుక రవాణాతో కలిపి రూ.30వేలు అవుతోంది.

మాచర్లలో..
₹ 30,000

కడపలో కొల్లగొట్టేస్తున్నారు..



ప్రొద్దుటూరు మండలంలోని పెన్నానదిలో పొక్లెయిన్‌తో ఇసుక తవ్వకాలు

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో ఉచిత ఇసుక పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. టీడీపీ, బీజేపీ నేతలు పోటాపోటీగా ఉచిత ఇసుకను సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎంపీ సీఎం రమేష్ వర్గీయులకు పోటీగా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అనుచరులు ఇసుక అక్రమ అమ్మకాలు సాగిస్తున్నారు. మదనపల్లెకు 18 టన్నుల ఇసుక తరలించాలంటే రవాణా చార్జీలతో కలిపి రూ.28,300 వరకు ఖర్చవుతోంది. జమ్మలమడుగుకు అయితే రూ.20వేలకు పైగా అవుతోంది.

మదనపల్లెలో..
₹ 28,300

కృష్ణమ్మ చెంతనే ఉన్నా వేలల్లో ధరలు



జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామంలో స్టాకు పాయింట్ వద్ద బారులుదీరిన వాహనాలు

ఉచిత ఇసుక పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. రవాణా, లోడింగ్, సీనరేజీ, జీఎస్టీ చార్జీల పేరుతో స్టాకు యార్డుల వద్ద ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ట్రక్కు బాడుగ రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఉంది. కంచికచర్ల మండలం మోగులూరు స్టాక్ పాయింట్ వద్ద అధికారులు నామమాత్రంగా ఉండగా, 20 మందికి పైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. ఒకే బిల్లుపై రెండు వాహనాల్లో లోడ్ చేసి తరలిస్తున్నారు. పెనమలూరు పరిధిలోని చోడవరంలో 50–70 లారీలకు పైగా ఇసుక నిల్వలను అధికార పార్టీ ప్రజాప్రతినిధి ఒకరు లారీ రూ.16 వేల నుంచి రూ.20 వేల చొప్పున అమ్మేశారు. స్టాకు యార్డుల్లో నిల్వలు లేవంటూ కృత్రిమ కొరత సృష్టించి ట్రాక్టరు లోడ్ రూ.6 వేల నుంచి రూ.7 వేలకు విక్రయిస్తున్నారు. దూరప్రాంతాలకు 18 టన్నుల ఇసుక లారీలో తేవాలంటే బాడుగ, పన్నులతో కలిపి రూ.20,835 నుంచి రూ.25,200 అవుతుంది.

ఎన్టీఆర్ జిల్లాలో..
₹ 25,200

ఉత్తరాంధ్రలో విచ్చలవిడిగా లూటీ..



బొబ్బిలిలోని ఇసుక స్టాక్ పాయింట్

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉచితం పేరుతో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నా.. ఆచరణలో మాత్రం అధిక ధరలు వసూలు చేస్తున్నారు. విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 18 టన్నుల ఇసుక రవాణా చార్జీలతో కలిపి రూ.20వేల నుంచి 28,800 వరకు విక్రయిస్తున్నారు. ముఖ్యంగా ఇసుక డిమాండ్ ఎక్కువగా ఉండే విశాఖపట్నం నగర పరిసర ప్రాంతాల్లో రేట్లు ఎక్కువగా ఉన్నాయి.

పెందుర్తిలో..
₹ 28,800

అనంతలో అతి కష్టం



నల్లబోయనపల్లి స్టాక్ పాయింట్‌లో టిప్పర్‌లో ఇసుక నింపుతున్న దృశ్యం

అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం జుంజురంపల్లి సమీపంలో వేదావతి హగరి నది వద్ద ఇసుక విక్రయాలు ప్రారంభించారు. ఇక్కడి నుంచి అనంతపురం లాంటి దూర ప్రాంతాలకు తరలించాలంటే ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది. పెనుకొండలో గరిష్ఠంగా 18టన్నుల ఇసుక రవాణా చార్జీలతో కలిపి రూ.25,000 వరకు అవుతోంది.

పెనుకొండలో..
₹ 25,000

చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో చిత్ర విచిత్రాలు..

ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా ఇసుక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. చిత్తూరు మండలం దిగువ మాసపల్లి రీచ్‌లో టన్నుకు రూ.289 సీనరేజీ కింద చెల్లిస్తూ అదనంగా రూ200 వసూలు చేస్తున్నారు. నగరి, గంగాధర నెల్లూరు నియోజకవర్గాల ప్రజలు చిత్తూరు రూరల్ మండలంలో ఏర్పాటు చేసిన ఇసుక డిపో వద్దకు వచ్చి తీసుకెళ్లేందుకు రవాణా చార్జీలతో కలిపి ట్రాక్టర్ లోడు ఇసుక రూ.7,500 వరకు ఖర్చు అవుతోంది. కుప్పం, పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల ప్రజలు గంగవరం మండలం బైరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఇసుక డిపోనకు వచ్చి ఇసుక తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వారికి రవాణా ఖర్చులతో కలిపి ట్రాక్టర్ లోడు రూ.8,500 వరకు ఖర్చు అవుతోంది. గూడూరుకు వెళ్లేందుకు ట్రాక్టర్ ఇసుకకు రూ.9 వేల నుంచి రూ.10వేలు వ్యయం అవుతోంది. చంద్రగిరికి లారీ ఇసుక రవాణా చార్జీలతో కలిపి రూ.21,600 వరకు అవుతోంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి 18 టన్నుల ఇసుక లారీ తీసుకువెళ్లేందుకు రూ.23,000 అవుతోంది.



చిత్తూరు జిల్లా దిగువమాసాపల్లిలో ఇసుక లోడింగ్

నెల్లూరు రూరల్..
₹ 23,000

బాబోయ్ ఈ రేట్లు చూడండి!

నియోజకవర్గం	18 టన్నుల టిప్పర్ ఇసుక ధర (రూపాయల్లో)
శ్రీశైలం	32,000
మాచర్ల	30,000
డోన్	30,000
ఆళ్లగడ్డ	30,000
పెందుర్తి	28,800
గాజువాక	28,800
మదనపల్లె	28,300
పాయకరావుపేట	28,050
ఇచ్ఛాపురం	27,720
అనకాపల్లి	27,592
గుడివాడ	27,000
అవనిగడ్డ	27,000
కర్నూలు	27,000
మంత్రాలయం	25,500
యలమంచిలి	25,200
పలాస	25,200
మార్కాపురం	25,200
బనగానపల్లి	25,000
పెనుకొండ	25,000
విశాఖ పశ్చిమ	24,840
నర్సీపట్నం	24,550
పామర్రు	24,300
గిద్దలూరు	23,400
యర్రగొండపాలెం	23,400
తాడిపత్రి	23,110
శృంగవరపుకోట	23,040
పెడన	23,000
నెల్లూరు రూరల్	23,000
రైల్వేకోడూరు	23,000
ఎచ్చెర్ల	22,500
బొబ్బిలి	22,500
కనిగిరి	22,500
మచిలీపట్నం	22,000
విశాఖ దక్షిణ	22,000
నంద్యాల	22,000
ఆలూరు	22,000
చంద్రగిరి	21,600
సంతనూతలపాడు	21,600
నెల్లిమర్ల	21,500
అరకు	21,500
కైకలూరు	21,384
చింతలపూడి	21,124
పాడేరు	21,000
మాడుగుల	21,000
భీమిలి	20,844
దర్శి	20,835
శ్రీకాకుళం	20,700
చీపురుపల్లి	20,700
గూడూరు	20,620
విశాఖ ఉత్తర	20,150
నూజివీడు	20,084
జమ్మలమడుగు	20,200
ఆత్మకూరు	20,000
ఉదయగిరి	20,000
కోవూరు	20,000
కుప్పం	20,000
నగరి	20,000
పుట్టపర్తి	20,000
హిందూపురం	20,000
ఆదోని	20,000
పాణ్యం	20,000
నందికొట్కూరు	20,000

క్లుప్తంగా...

గతేడాది అక్టోబర్ నుంచే అమల్లోకి ఏపీజీపీఎస్

సాక్షి, అమరావతి: జాతీయ పెన్షన్ స్కీము (కంట్రిబ్యూటరీ పెన్షన్)లోని ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ తరువాత పెన్షన్ చాలా తక్కువగా వస్తుందని, మెరుగైన పెన్షన్ వచ్చేలాగ గత వైఎస్ జగన్ ప్రభుత్వం ఏపీ గ్యారెంటెడ్ పెన్షన్ సిస్టమ్ (ఏపీజీపీఎస్)ను తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఇందుకోసం అసెంబ్లీలో చట్టం కూడా చేసింది. కాగా, ఏపీజీపీఎస్ గతేడాది అక్టోబర్ 20 నుంచి అమల్లోకి వచ్చిందని శుక్రవారం ఆర్థిక శాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది.

'జీపీఎస్'ను అమల్లోకి తేవడం దారుణం

- ఈ చట్టాన్ని రద్దుచేస్తామని హామీ ఇచ్చి ఎలా అమలుచేస్తారు?
- టీడీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సీపీఎస్ ఉద్యోగుల సంఘం

సాక్షి, అమరావతి : జీపీఎస్ (గ్యారంటీడ్ పెన్షన్ స్కీం) చట్టాన్ని రద్దుచేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేరుస్తామని చెప్పిన టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆ చట్టాన్ని అమలుచేయడానికి సిద్ధమవడం దారుణమని సీపీఎస్ ఉద్యోగుల సంఘం మండిపడింది. తమతో కనీసం చర్చించకుండానే జీపీఎస్ చట్టం అపాయింటింగ్ తేదీని ఖరారుచేయడం అన్యాయమని పేర్కొంది. ఈ మేరకు ఏపీసీపీఎస్‌ఈఏ (ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరుకొండ సతీష్, సీఎం దాసు తదితరులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జీపీఎస్ చట్టాన్ని రద్దుచేసి, ఉద్యోగులతో చర్చిస్తామని ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ఎన్నికలకు ముందు అనేకసార్లు హామీ ఇచ్చారని తెలిపారు. కానీ, అధికారంలోకి వచ్చాక సీపీఎస్ ఉద్యోగులతో చర్చించకపోగా 2023 అక్టోబరు 20 నుంచి జీపీఎస్ చట్టం అమల్లోకి (అపాయింట్ డే) వచ్చినట్లు శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన జీఓ–54ని జూన్ 12వ తేదీనే జారీచేసి ఇప్పటివరకు దాన్ని బయటకు పెట్టకపోవడం అన్యాయమని తెలిపింది. ప్రభుత్వం వెంటనే సీపీఎస్ ఉద్యోగులతో చర్చలు జరపాలని, తమకు కావాల్సింది సీపీఎస్ మాత్రమేనని స్పష్టంచేసింది.

శ్రీసిటీ 'టాటా స్మార్ట్‌ఫుడ్స్'కు లీడ్ ప్లాటినం సర్టిఫికేషన్

శ్రీసిటీ (వరదయ్యపాళెం): తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ప్రముఖ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ టాటా స్మార్ట్‌ఫుడ్స్ లిమిటెడ్ (టీఎస్‌ఎఫ్‌ఎల్) ప్రతిష్టాత్మక యూఎస్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వారి లీడ్ ప్లాటినం సర్టిఫికేషన్ అందుకుంది. స్థిరమైన, పర్యావరణహిత కార్యకలాపాలకు గుర్తింపుగా సంస్థకు ఈ గౌరవం దక్కింది. సుస్థిర పర్యావరణ లక్ష్యాలను సాధించే సంస్థలను గుర్తించే లీడర్‌షిప్ ఇన్ ఎనర్జీ ఎన్విరాన్‌మెంటల్ డిజైన్ (ఎల్‌ఈఈడీ) సర్టిఫికేషన్‌కు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉంది. ఈ ప్రక్రియలో పని సామర్థ్యం, నీటి సంరక్షణ, వ్యర్థాల తగ్గింపు, సుస్థిర పరికరాల వినియోగం వంటి కీలక అంశాలలో అసాధారణ పనితీరు కొలమానాలుగా టాటా స్మార్ట్‌ఫుడ్స్ సంస్థ లీడ్ ప్లాటినం సర్టిఫికేషన్‌ను సొంతం చేసుకుంది. దీనిపై టీఎస్‌ఎఫ్‌ఎల్ అసోసియేట్ డైరెక్టర్, ఫ్యాక్టరీ హెడ్ ఎస్‌సీ పురుషోత్తమన్ మాట్లాడుతూ..ఈ సర్టిఫికేషన్ పొందడం తమ సుస్థిర ప్రయాణంలో ఒక ప్రధాన ముందడుగుగా పేర్కొన్నారు. లీడ్ ప్లాటినం సర్టిఫికేషన్ పొందినందుకు టీఎస్‌ఎఫ్‌ఎల్ బృందానికి శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు.

'గౌరవ ఆచార్య' పోస్టును వక్రీకరిస్తారా?

ఎల్లో మీడియా కథనంపై లక్ష్మీ పార్వతి ఆగ్రహం



సాక్షి, అమరావతి: ఆంధ్ర యూనివర్సిటీ తనకు ఇచ్చిన గౌరవ ఆచార్య పోస్టును వక్రీకరిస్తూ ఎల్లో మీడియా అసత్య కథనాలు ప్రచురిస్తోందని తెలుగు, సంస్కృత అకాడమీ మాజీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీ పార్వతి మండిపడ్డారు. వాస్తవాలను మరుగునపరిచి ఏయూలో తనకు జీతంతో కూడిన ఆచార్య పోస్టులను కట్టబెట్టినట్లు రాయడం సిగ్గు చేటని మంగళవారం ఆమె ప్రకటన విడుదల చేశారు. డబుల్ పీహెచ్‌డీ చేసిన తనలాంటి వ్యక్తులకు గౌరవంగా 'గౌరవ ఆచార్య' పోస్టులను యూజీసీ నిబంధనల ప్రకారమే ఇచ్చినట్లు పేర్కొన్నారు. తెలుగు, సంస్కృత భాషల్లో ప్రావీణ్యం కలిగి, ఎన్నో పుస్తకాలు రచించిన వారు విద్యార్థులకు మార్గదర్శకులవుతారనే ఉద్దేశంతో వర్సిటీ తనను గౌరవ ఆచార్యగా నియమించిందని తెలిపారు. ఇలాంటి యూజీసీ కొత్త మార్గదర్శకాలను ప్రధాని మోదీ న్యూ ఎడ్యుకేషన్ పాలసీలో చేర్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఒకవేళ ఈ మార్గదర్శకాలను ఎల్లో మీడియా అంగీకరించకుంటే రద్దు చేయాలని ప్రధానికి, ఏపీ సీఎంతో లేఖ రాయించాలని డిమాండ్ చేశారు. గౌరవ సూచకంగా ఇచ్చిన పోస్టుకు ఏ రూల్ ప్రకారం జీతం ఇస్తారో ఎల్లో మీడియా చెప్పాలన్నారు. తాను ప్రధాన గైడ్ అయినప్పటికీ ప్రతి విద్యార్థికి వర్సిటీలోని ప్రొఫెసర్లు గైడ్‌లుగా వ్యవహరిస్తున్నారన్నారు. భారత్‌లోనే ఏయూకి 3వ స్థానం దక్కగా.. ఎల్లో మీడియా రాజకీయాలతో బురదజల్లుతున్న మాజీ వీసీ ప్రసాదరెడ్డి హయాంలోనే న్యాక్ ఏప్లస్‌ప్లస్ స్థాయికి ఎదిగిన విషయాన్ని విస్మరించ వద్దన్నారు.

తల్లికి వందనంపై సర్కారు దొంగాట!

'ఈచ్ మదర్' అని ఉత్తర్వుల్లో ఇచ్చి, ఇప్పుడు బొంకుతున్న ప్రభుత్వం

- కార్యదర్శి శశిధర్ తాజా ప్రకటనలోనూ స్పష్టత కరువు
- కూటమి హామీ మేరకు కోటి మందికి పైగా పిల్లలకు ఈ పథకం వర్తింపుపై అనుమానాలు



సాక్షి, అమరావతి : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకంపై దొంగాట ఆడుతోంది. ఇందుకు సంబంధించి ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 29లో 'ఈచ్ మదర్' అని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, ఈ పథకంపై ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని బొంకుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ప్రతి బిడ్డకు, ఒక ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికీ తలో రూ.15 వేలు చొప్పున ఇస్తామని గానీ, మేనిఫెస్టోలో పేర్కొన్నట్టు ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ప్రతి విద్యార్థికీ ఇస్తామని గానీ చెప్పడం లేదు. జీవోలో పేర్కొన్న అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి వ్యతిరేకత వెల్లువెత్తినా తల్లికి వందనంపై హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గానీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గానీ నోరు విప్పక పోవడం గమనార్హం. ఇచ్చిన హామీ ప్రకారం 'ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ తల్లికి వందనం ఇస్తాం' అని చెప్పడానికి వీరు ఎందుకు వెనకాడుతున్నారు? పాఠశాల విద్యాశాఖ కార్యదర్శిని ముందుకునెట్టి ఈ పథకంపై ఇంకా మార్గదర్శకాలు విడుదల కాలేదని చెప్పించి.. చేయబోయే మోసంపై దాటవేత ధోరణి అవలంబించారు. అంటే జీవో నంబర్ 29లో పేర్కొన్నట్టుగానే ఒక ఇంట్లో ఒక్కరికే పథకాన్ని వర్తింప చేస్తామని మరోసారి చెప్పారు. జనసేన అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ సైతం ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుకునే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం అమలు చేస్తామని బహిరంగంగా హామీ ఇచ్చారు. కూటమి తరఫున ఇచ్చిన హామీలపై ప్రజలకు జవాబుదారీగా ఉంటానని, ప్రభుత్వం తప్పు చేస్తే ప్రతిపక్షంగా ప్రశ్నిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ సైతం ఈ అంశంపై స్పందించక పోవడం ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జీవోలో 'ఈచ్ మదర్' అని ఎందుకు చెప్పినట్టు?


ప్రభుత్వ పాలనలో తీసుకునే నిర్ణయాలకు, చర్యలకు, అమలు చేసే పథకాలకు గవర్నమెంట్ ఆర్డర్ (జీవో) జవాబుదారీగా ఉంటుంది. సంబంధిత శాఖ మంత్రి ఆదేశం మేరకు జారీ చేసే ఉత్తర్వులను ఉద్యోగులు, ప్రజలు తప్పనిసరిగా అనుసరించాలి. వాటిలో పేర్కొన్న మార్గదర్శకాల మేరకే తదుపరి చర్యలు తీసుకుంటారు. ఇంత ప్రాధాన్యం గల ఈ జీవోలో తల్లికి వందనం అమలుపై 'ఈచ్ మదర్' అని స్పష్టంగా పేర్కొన్నారు. ''ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాముల్లో భాగంగా 'తల్లికి వందనం' పథకం కింద పేదరిక రేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లోని పిల్లలను పాఠశాలలకు పంపుతున్న ఒక్కో తల్లి లేదా సంరక్షకుడికి సంవత్సరానికి రూ.15,000 ఆర్థిక సహాయం అందిస్తోంది. ఒకటి నుంచి ప్లస్ 2 వరకు చదివే పిల్లల తల్లుకు ఇది వర్తిస్తుంది'' అని పేర్కొంది. ''ఈచ్ మదర్'' అని ఇంత స్పష్టంగా ప్రభుత్వ ఉత్తర్వుల్లోనే పేర్కొన్నారు. ఇక్కడ ''ఈచ్ చిల్డ్రన్'' అని పేర్కొని ఉంటే ప్రజలకు భరోసా ఇచ్చినట్టయ్యేది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని నమ్మే పరిస్థితి ఉండేది. దీనిపై స్పందించకుండా తల్లికి వందనం పథకంపై ఇంకా ఇంకా మార్గదర్శకాలు రూపొందించలేదని చెప్పడం గమనార్హం. పైగా జీవోలో పేర్కొన్నది తప్పు అని గానీ, పిల్లలు అందరికీ తల్లికి వందనం అమలు చేస్తామని గానీ ప్రకటించలేదు.

స్పష్టమైన ప్రకటన చేయకుండా జంకుతున్న ప్రభుత్వం

ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం అమలు చేస్తామన్నారు. ఇంట్లో ఇద్దరుంటే రూ.30 వేలు, నలుగురుంటే రూ.60 వేలు జమ చేస్తామని నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ప్రతి బిడ్డకు ఈ పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించారు. ఈ మేరకు అంగన్వాడీల్లో ఆరేళ్లలోపు పిల్లలు సుమారు 25 లక్షల మంది ఉండగా, ఒకటి నుంచి ఇంటర్ వరకు 82,29,858 మంది విద్యార్థులు, మొత్తం కోటి మందికి పైగా పిల్లలకు ఈ పథకాన్ని వర్తింపజేయాలి. కానీ ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు గడుస్తున్నా ఈ పథకంపై స్పష్టమైన హామీ ఇవ్వకుండా ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబిస్తోంది. జీవోలో స్పష్టంగా పేర్కొన్న 'ఈచ్ మదర్' అంశంపై సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఎందుకు స్పందించడం లేదో అర్థంగాని పరిస్థితి. జీవో నం.29 కేంద్ర ప్రభుత్వ ఆధార్ చట్టం మేరకు డేటాను తీసుకునేందుకే ఇచ్చామని, ఇది ఆధార్ నిబంధనలకు సంబంధించిన ఉత్తర్వులు మాత్రమేనని శుక్రవారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులోనూ తల్లికి వందనంపై ఎలాంటి మార్గదర్శకాలు రూపొందించలేదని చెప్పారేగాని, 'ఈచ్ మదర్' అన్నది తప్పు అని చెప్పకపోవడం చూస్తుంటే ఈ ఉత్తర్వుల్లోని అంశాన్నే అమలు చేసేట్టు కనిపిస్తోంది.

ఆగని టీడీపీ విధ్వంసం

- తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో వైఎస్సార్‌సీపీ అభిమాని ఇల్లు కూల్చివేత
- శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లిలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం



శ్రీ సత్యసాయి జిల్లా, చెన్నేకొత్తపల్లిలో ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం



ఏలూరు జిల్లా, పల్లెర్లమూడిలో కూల్చివేసిన డివైడర్, పాత, కొత్త బస్ షెల్టర్ల పిల్లర్లు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం నేతలు, కార్యకర్తల విధ్వంసం కొనసాగుతూనే ఉంది. గురు, శుక్రవారాల్లో అధికారుల మీద తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి ఇళ్లు, ఇళ్ల పునాదుల్ని ధ్వంసం చేయించారు. వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను తీయించేశారు. డివైడర్‌ను, బస్ షెల్టర్‌ను, పిల్లర్లను ధ్వంసం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని పగులగొట్టారు.

- తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో వైఎస్సార్‌సీపీకి చెందిన నిరుపేద వంకా సుధాకర్ నిర్మిస్తున్న ఇంటిని టీడీపీ ఒత్తిడితో అధికారులు కూల్చేశారు. స్థానిక చెరువులో సుధాకర్ అక్కడ ఇల్లు నిర్మించుకుంటున్నాడు. ఇప్పటికే సుమారు రూ.8 లక్షలు వెచ్చించి గోడలు కట్టుకున్నాడు. కొందరు టీడీపీ నాయకులు, కొంత మీడియా వారు అది కూల్చేయాల్సిందేనని అధికారుల మీద తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. అక్కడున్న మిగిలిన ఇళ్లనుగానీ, పట్టణంలో ఉన్న పలు ఆక్రమణలనుగానీ పట్టించుకోని అధికారులు సుధాకర్ నిర్మించుకుంటున్న ఇంటిని జేసీబీతో కూల్చేశారు.
- ఏలూరు జిల్లా నూజివీడు మండలం పల్లెర్లమూడిలో టీడీపీ కార్యకర్తలు పేట్రేగిపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోనేటి చెరువు వద్ద రోడ్డును వెడల్పు చేసి ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో డివైడర్ నిర్మించారు. ఈ డివైడర్‌ను టీడీపీ వారు పొక్లెయిన్‌తో ధ్వంసం చేసి తొలగించారు. దీంతోపాటు పాత బస్ షెల్టర్‌ను, నూతనంగా నిర్మిస్తున్న బస్ షెల్టర్ పిల్లర్లను కూల్చేశారు.
- శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి, మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు చెన్నేకొత్తపల్లి చేరుకుని వైఎస్సార్ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు నిరసన తెలుపుతున్న వారివద్దకు చేరుకుని.. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి సీఐ శివాంజనేయులుకు ఫిర్యాదు చేశారు. దుండగులు ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహం స్థానంలో ఒకటిరెండు రోజుల్లో నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని నాయకులు తెలిపారు.
- శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం తులసిగాం పంచాయతీ జగనన్న కాలనీలో పునాదులను అధికార పార్టీ నాయకులు ధ్వంసం చేయించారు. జగనన్న ఇళ్ల కోసం ఈ సచివాలయం పరిధిలోని కొయ్య మోహిని, త్రివేణీ బడియా, బాకి భవానీ, కొండ మోహిని, నందికి శ్రావణి, లండ చందరమ్మ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. గత ఏడాది డిసెంబర్ 30న అప్పటి తహసీల్దార్ పి.మీనాదేవి అనుమతి ఇచ్చారు. వారు ఆ స్థలాల్లో పునాదులు వేసుకున్నారు. దీనిపై స్థానిక టీడీపీ నాయకులు అక్రమ కట్టడాలు అంటూ రెవెన్యూ అధికారులకు అప్పట్లో ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఇళ్లపై గత నెల 25న ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆ కట్టడాలను పరిశీలించి రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. ఈ క్రమంలోనే శుక్రవారం రెవెన్యూ అధికారులు చూడామణిరెడ్డి, వీఆర్వో సాలిన కృష్ణ, మండల సర్వేయర్ తవిటినాయుడు ఆధ్వర్యంలో జేసీబీతో పునాదులను నేలమట్టం చేశారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ప్రతినిధి ఇసురు తులసిరాం, బాధిత లబ్ధిదారులు అక్కడికి చేరుకుని కూల్చివేతల్ని అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ అంశంపై స్థానిక తహసీల్దార్ ఎం.భాస్కర అప్పారావును వివరణ కోరగా.. గతంలో పనిచేసిన తహసీల్దార్ ఇళ్లను మంజూరు చేయడం వాస్తవమేనని చెప్పారు. వారికి వారం రోజుల్లో మరోచోట ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు.

చెత్తతో యువతకు ఉపాధి

- పిఠాపురంలో పైలెట్‌గా మొదలెడుతున్నాం
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్ల నుంచి పడేసే చెత్త ద్వారానే ఏడాదికి రూ.2,643 కోట్ల ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉందని.. ఆ చెత్తలోని రకరకాల వస్తువులను వేరు చేసే ప్రక్రియ ద్వారా ఏకంగా రెండున్నర లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించొచ్చని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. ఉపాధి లేని యువత ఇళ్ల నుంచి సేకరించే చెత్తను వేరు చేసే సెగ్రిగేషన్ సెంటర్‌లు పెట్టి.. అలా వేరు చేసిన రకరకాల చెత్తను ఆయా పరిశ్రమలకు పంపితే ఆదాయం వస్తుందని వారికి అవగాహన కలిగించడం ద్వారా వారిని కొంత మేర ఉపాధి అవకాశాల వైపు మళ్లించవచ్చన్నారు. గ్రామాల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు అనుసరించాల్సిన విధానాలు, వాటి నుంచి ఎలాంటి ఉత్పత్తులు సాధించవచ్చు.. అనే అంశాలపై సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (ఎస్‌ఎల్‌ఆర్‌ఎం) ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో గార్బేజ్ టూ గోల్డ్ పేరుతో శుక్రవారం తాడేపల్లిలోని పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయంలో ప్రదర్శన నిర్వహించారు. పవన్ మాట్లాడుతూ చెత్త తయారైన 12 గంటల్లోపు సేకరిస్తే అది సంపద అవుతుందన్నారు. తమిళనాడు వెల్లూరు చెందిన శ్రీనివాసవర్మ ఈ కాన్సెప్ట్‌ను పట్టుకొచ్చారని.. పిఠాపురం నియోజకవర్గంలో పైలెట్‌గా దీనిని ప్రారంభిద్దామనుకుంటున్నానన్నారు. అలాగే తన క్యాంప్ ఆఫీసు, జనసేన ఆఫీసులలోనూ దీనిని మొదలుపెడతామని అధికారులకు చెప్పినట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో శాఖ పరంగా జరిగిన అన్ని అనర్థాలకూ ఓ ఐఏఎస్ అధికారి పేరే వినిపిస్తోందని, ఎలా బాధ్యులను చేయాలన్న విషయాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

తీర ప్రాంత కోత నివారణపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో సముద్రపు కోత ప్రమాదాన్ని నివారించేందుకు ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు పవన్‌కళ్యాణ్ చెప్పారు. ఇటీవల ఉప్పాడ తీరంలో కోతపై సమీక్షించి నిపుణులతో చర్చించామన్నారు. మంగళగిరిలోని తన నివాసంలో తీర ప్రాంత నిర్వహణ ప్రణాళికను ఆయన విడుదల చేశారు. నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ (ఎన్‌సీసీఆర్) నిపుణులు ఈ ప్రణాళికను రూపొందించారు. ఈ సందర్భంగా పవన్ సమక్షంలో ఎన్‌సీసీఆర్, ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీలు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.

ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో భేటీ

ఇంటింటికీ కుళాయి ద్వారా రక్షిత మంచి నీరు సరఫరాకు సంబంధించి కార్యక్రమంపై పవన్ కళ్యాణ్.. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, ప్రపంచ బ్యాంక్ జలవనరుల విభాగం సలహాదారు రమేష్ ముకల్లా, మాథ్యూస్ ముల్లికల్‌లు పాల్గొన్నారు.

రాజోలు జనసేనలో బాహాబాహీ

- పోలీసుల సమక్షంలోనే మెయిన్ రోడ్డుపై కొట్లాట
- మీడియాపైనా దాడులు



రాజోలు మెయిన్ రోడ్డుపై కొట్లాడుకుంటున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలులో శుక్రవారం జనసేన పార్టీలో రెండువర్గాల వారు కొట్టుకున్నారు. పార్టీలో ఎన్నికలకు ముందు నుంచి నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు రెండువర్గాలుగా విడిపోయి మెయిన్ రోడ్డుపై బాహాబాహీకి దిగారు. కొంతకాలం నుంచి సోషల్ మీడియాలో లైవ్ వీడియోలు తీస్తూ పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారిని ఎన్‌ఆర్‌ఐ యెనుముల వెంకటపతిరాజు విమర్శిస్తున్నారని జనసేన నాయకులు దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో ఈ రెండు వర్గాలు కొన్నాళ్లుగా సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నాయి. దీంతో వెంకటపతిరాజు వర్గానికి, బాలాజీ, బుజ్జి వర్గానికి విభేదాలు మరింత ముదిరిపోయాయి. ఎన్‌ఆర్‌ఐ వెంకటపతిరాజు తానే ముందుండి పార్టీని నడిపించానని, వ్యతిరేక వర్గాన్ని దూషిస్తూ గురువారం ఫేస్‌బుక్‌లో లైవ్ వీడియో చేశారు. దీంతో ఆగ్రహించిన ప్రత్యర్థివర్గం రాజోలు రోటరీ క్లబ్బులో శుక్రవారం జరిగిన ఒక పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన వెంకటపతిరాజును నిలదీసేందుకు తరలివచ్చింది. పరిస్థితిని గమనించిన వెంకటపతిరాజు రాజోలు ఎస్.ఐ. పృథ్వీకి సమాచారం ఇచ్చారు. అప్పటికే రెండువర్గాలు బాహాబాహీకి దిగాయి. రెండువర్గాలను నియంత్రించేందుకు ఎస్.ఐ. ప్రయత్నించినా ఎవరూ వినిపించుకోలేదు. పోలీసుల సమక్షంలోనే కొట్టుకున్నారు. దాడిలో గాయపడినవారు బుజ్జి, బాబి రాజోలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. జనసేన పార్టీ వర్గపోరును చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపైన కూడా ఆ వర్గాల వారు దాడిచేశారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదూ అందలేదని, ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేస్తామని ఎస్.ఐ. పృథ్వీ చెప్పారు.

వాకతిప్పలో కూడా..

కొత్తపల్లి: కాకినాడ జిల్లా వాకతిప్ప గ్రామంలో జనసేన నాయకుడిని అదే పార్టీ నాయకుడొకరు చెప్పుతో కొట్టారు. పోలీసులు తెలిపిన మేరకు.. యు.కొత్తపల్లి మండలం వాకతిప్ప గ్రామంలో జనసేన నాయకులు చింతలపూడి వెంకటరమణ, కొత్తపల్లి గ్రామానికి చెందిన సానా నాగు మధ్య గురువారం ఒక పింఛను విషయంలో వాగ్వాదం జరిగింది. వివాదం ముదిరిన నేపథ్యంలో నాగు చెప్పుతో వెంకటరమణను కొట్టారు. దీనిపై ఇద్దరూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా వివేక్‌యాదవ్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో)గా వివేక్ యాదవ్ నియమితులయ్యారు. ఇప్పటివరకు సీఈవోగా పనిచేసిన ముఖేష్‌కుమార్ మీనా స్థానంలో వివేక్ యాదవ్‌ను నియమిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది.

రెడ్ బుక్ పేరుతో బెదిరింపులు తగదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ధ్వజం

సాక్షి, అమరావతి: రెడ్‌బుక్ పేరుతో బెదిరింపులు, వేధింపులు తగవని సీపీఎం కార్యదర్శి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. నియంతృత్వ విధానాలను ప్రజలు అంగీకరించరని తెలిపారు. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో శుక్రవారం ప్రారంభమైన పార్టీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలపై కక్షపూరితంగా వ్యవహరించబోమని, ప్రజాస్వామ్య హక్కులను గౌరవిస్తామని టీడీపీ ఎన్నికల ముందు ప్రకటించిందని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వం కీలక స్థానాల్లో నియమించిన అనేకమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్లో కొందరిని టీడీపీ ప్రభుత్వం లూప్‌లైన్‌లో పెట్టడంతో రాజీనామా చేసి వెళ్లిపోతున్నారన్నారు. వలంటీర్లను కొనసాగిస్తామని చెప్పి చేయడం లేదని ధ్వజమెత్తారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, పాల్గొన్నారు.

అంతులేని అరాచకాలు..

ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో బరితెగిస్తున్న టీడీపీ మూకలు

- ఏం జరిగినా పట్టించుకోవద్దంటూ పోలీసులకు 'ముఖ్య' నేత మౌఖిక ఆదేశాలు?
- నెలరోజులుగా కొనసాగుతున్న టీడీపీ దౌర్జన్యకాండ
- ఆ పార్టీ నేతల నిర్బంధంలో వైఎస్సార్‌సీపీ కుటుంబాలు
- భయపడి అడవిలో తలదాచుకుంటున్న సుబ్రమణ్యంరెడ్డి కుటుంబం
- అప్పులు చేసి పారిపోయారంటూ అతనిపై దుష్ప్రచారం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : ఎన్నికల ఫలితాలు వెలువడి నెలదాటినా రాష్ట్రంలో టీడీపీ శ్రేణుల అరాచకాలకు అంతులేకుండాపోతోంది. పచ్చమూకల దాడులతో రాష్ట్రం అట్టుడుకుతున్నా ప్రభుత్వ పెద్దలకు, పోలీసులకు పట్టడంలేదు. సాక్షాత్తు సీఎం చంద్రబాబు కూడా స్పందించకపోవడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నా ఆయనలో చలనంలేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పుంగనూరు, కుప్పంలో టీడీపీ శ్రేణులు ఏం చేసినా చూసీచూడనట్లు వ్యవహరించాలని మౌఖిక ఆదేశాలిచ్చారంటూ పోలీసు వర్గాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతుండడం ఇక్కడి తీవ్రతకు అద్దంపడుతోంది. పైగా.. పత్రికల వారికి సమాచారం ఇస్తున్నారన్న నెపంతో మళ్లీమళ్లీ దాడులకు తెగబడుతూ వికృతానందం పొందుతున్నారు. అలాగే, ఈ ఘటనలకు ప్రచారం కల్పిస్తున్నారంటూ విలేకరులను సైతం వారి ఇళ్లకు వెళ్లి బెదిరిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా కూటమి మూకలు చెలరేగిపోతున్నాయి. ఫలితంగా.. ప్రతిరోజూ నలుగురైదుగురు తీవ్రంగా గాయపడుతున్నారు. ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందలేని దుస్థితిలో బాధితులున్నారు.

వైఎస్సార్‌సీపీకి ఓటేశారని పది కుటుంబాలపై పగ..

పుంగనూరు నియోజకవర్గం సోమల మండల పరిధిలో నంజంపేట కమ్మపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీకి ఓటేశారని ఓ పది కుటుంబాలను రెండు వారాలుగా నిర్బంధించి దాడులకు పాల్పడుతూ తీవ్రంగా వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ అరాచకాలు భరించలేక టీడీపీ కార్యకర్తే ఒకరు మీడియాకు వీడియోలు, ఫొటోలతో సమాచారం ఇస్తుంటే.. అవి కూడా వైఎస్సార్‌సీపీ వాళ్లే పంపుతున్నారంటూ తిరిగి ఆ పది కుటుంబాల వారిని చిత్రహింసలకు గురిచేస్తున్నారు. దీంతో.. వీరిలో ఒకటైన సుబ్రమణ్యంరెడ్డి కుటుంబం అడవిలోకి వెళ్లి తలదాచుకుంది. వీరి ఆచూకీ కోసం మిగిలిన కుటుంబాలను నానా రకాలుగా వేధిస్తున్నారు. టీడీపీ వారికి అనుకూలంగా పేపర్లపై సంతకాలు పెట్టి, కాళ్లు పట్టించుకుని క్షమించమని వేడుకుంటే ఊర్లో బతకటానికి అవకాశమిస్తామని చెబుతున్నట్లు తెలిసింది. బాధితులు గత్యంతరంలేక.. చిత్రహింసలు భరించలేక వారు చెప్పినట్లు చేసినట్లు సమాచారం. మరోవైపు.. సుబ్రమణ్యంరెడ్డి కుటుంబం గ్రామంలోకి వస్తే నిర్బంధించి చిత్రహింసలకు గురిచేయాలని భావించిన టీడీపీ శ్రేణులు వారిపై దుష్ప్రచారానికి తెరతీశారు. ఆ కుటుంబం గ్రామంలో అప్పులుచేసి పరారైందని.. వారిని అప్పజెప్పిన వారికి రూ.50 వేలు బహుమతి ఇస్తామని దంపతుల ఫొటో పెట్టి సోషల్ మీడియా ద్వారా వైరల్ చేస్తున్నారు.

పాలు కొనుగోళ్లు బంద్.. పొలంలోనే టమాటా పంట..

ఇక వైఎస్సార్‌సీపీకి ఓట్లేసిన ఆ పది కుటుంబాల పంట దిగుబడులను విక్రయించకుండా కూడా టీడీపీ మూకలు అడ్డుకున్నాయి. దీంతో సుమారు 12 ఎకరాల్లోని టమాటా పంట ఎందుకూ పనికిరాకుండా పోయింది. అలాగే, ఆ కుటుంబాల వారి పాలు కూడా గ్రామంలో ఎవ్వరూ కొనుగోలు చేయటానికి వీల్లేదని హుకుం జారీచేసినట్లు తెలిసింది. అదే విధంగా.. కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం సింగసముద్రానికి చెందిన అశోక్ వైఎస్సార్‌సీపీకి ఓటేశాడని అతనిపై తప్పుడు కేసు పెట్టించారు. పోలీసులు అశోక్‌ని రోజూ స్టేషన్‌కి పిలిపించుకుని టీడీపీ నేతల తిట్ల దండకం అనంతరం పొద్దుపోయాక విడిచిపెడుతున్నారు. ఈ నేపథ్యంలో.. బుధవారం రాత్రి ఇంటికి చేరుకున్న అశోక్‌తో పాటు అతని కుటుంబంలోని వారందరిపైనా స్థానిక టీడీపీ వర్గీయులు దాడికి తెగబడ్డారు.

వృద్ధులని కనికరించకుండా ఇళ్లకు తాళాలు..

అలాగే, శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం మిట్టమీద కండ్రిగలో వైఎస్సార్‌సీపీకి ఓటేశారని 11 కుటుంబాలపైనా టీడీపీ శ్రేణులు కక్షగట్టారు. వారి నివాసాలు అక్రమమంటూ ఇళ్లకు తాళాలువేశారు. లోపల అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులున్నారని కూడా కనికరించలేదు. దీంతో వారు భయంతో కేకలు వేయడంతో స్థానికులు తాళాలు పగులగొట్టి వారిని రక్షించారు. టీడీపీ నేతలకు స్థానిక వీఆర్వో అండగా నిలిచినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. పట్టాలున్నా తమపై కావాలనే కక్ష సాధిస్తున్నారని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.

సర్పంచ్ సహా అజ్ఞాతంలో మరో 70 కుటుంబాలు..

ఇదిలా ఉంటే.. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రూరల్ మండలం ఎంపేడు సర్పంచ్ కొండయ్య ఉంటున్న ఈశ్వరయ్య కాలనీలో వైఎస్సార్‌సీపీకి ఓటేసిన కుటుంబాల ఇళ్లలోకి టీడీపీ నేతలు చొరబడి చిన్నా పెద్దా తేడాలేకుండా బరితెగించి దాడులు చేశారు. గతనెల 11, 12, 28 తేదీల్లో జరిగిన దౌర్జన్యాలు, దాడులతో ఈశ్వరయ్య కాలనీకి చెందిన సర్పంచ్ కొండయ్య కుటుంబంతో పాటు మరో 70 గిరిజన కుటుంబాలు ఊరొదిలి వెళ్లిపోయాయి. వీరంతా ఎక్కడున్నారో ఇంతవరకు ఆచూకీ లేదు. ఇంకా అనేకమంది వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీ శ్రేణుల హెచ్చరికలతో అజ్ఞాతంలోనే ఉన్నారు. ఊర్లోకి వస్తే గంజాయి, సారా కేసులు పెట్టి జైల్లో పెడతామని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో ఇలా ప్రతిరోజూ దాడులు జరుగుతున్నా పోలీసులు మొక్కుబడిగా కేసులు నమోదు చేస్తున్నారు. ఈశ్వరయ్య కాలనీ ఘటనపై ఎటువంటి కేసు నమోదు చేయలేదు. పైగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 200కు పైగా దాడులు జరిగితే నమోదైన కేసులు మాత్రం 22 మాత్రమే.

ఆరోగ్యాన్నిచ్చే ఆవిరి వంటకాలు

దాదాపు పాతికేళ్ల కిందటి వరకు పీలగా ఉన్న పిల్లలకు, నీరసంగా ఉండే పెద్దలకూ బలం రావడానికి ఆవిరి కుడుముల్లాంటివి పెట్టేవాళ్లు. ఇవి తేలిగ్గా అరగడంతోపాటు వంటికి సత్తువ నిచ్చేవి. ఇది ఒకప్పటి మాట. అయితే ఆధునిక వైద్యులు, ఆహార నిపుణులు కూడా ఆవిరితో తయారు చేసుకున్న ఆహార పదార్థాలనే తినమంటున్నారు. ఎందుకో తెలుసుకుందాం.

ఆవిరితో వండిన వంటలు మన ఆరోగ్యానికెంతో మేలు చేస్తాయి. డీప్ ఫ్రైలతో పోలిస్తే ఆవిరితో వండటం వల్ల వాటిలో ఉండే పోషకాలు నశించవు. పైగా కొవ్వు తక్కువగా ఉంటుంది. కేలరీలు కూడా తక్కువగానే ఉంటాయి. ఆహారం తొందరగా జీర్ణం అవుతుంది.



పోషకాలు వృథా పోవు

ఆవిరిలో ఉడికించడం వల్ల పదార్థంలో ఉండే నియాసిన్, విటమిన్ బి, థయామిన్, విటమిన్ సి వంటివి మన శక్తిని మరింత పెంచుతాయి. ఇవి తిన్నవారికి ఖనిజాలు, పొటాషియం, ఫాస్ఫరస్, కాల్షియం, జింక్ వంటి పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి.

ఆవిరితో తయారు చేసే ఆహారాలకు నూనె అవసరమే లేదు. అందుకే ఆవిరి పట్టిన ఆహారాల్లో కొవ్వు పరిమాణం తక్కువగా ఉంటుంది కాబట్టి బరువు తగ్గాలనుకునేవారికి ఇది బెస్ట్‌ఫుడ్ అని చెప్పవచ్చు.

తేలికగా జీర్ణం అవుతాయి

ఆవిరితో వండిన ఆహార పదార్థాలలో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఇవి చాలా తొందరగా జీర్ణం అవుతాయి. ఈ ఆహారం బరువుతోపాటు ఎన్నో అనారోగ్య సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది. ఆవిరి పట్టిన ఆహారం మృదువుగా ఉండి, తేలిగ్గా జీర్ణం కావడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది

ఈ వంటలో నూనెను ఉపయోగించకపోవడం వల్ల కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది.

రంగు, రుచి మారదు

ఆవిరితో వండిన కూరల రంగు అస్సలు మారదు. రుచి కూడా బాగుంటుంది.

లైఫ్@360



ఇది వర్షాకాలం. బయట చిరుజల్లులు పడుతుంటే వేడిగా మిర్చి బజ్జీలో, పకోడీలో తింటూ... గరం చాయో, కాఫీనో సిప్ చేస్తూ నచ్చిన పుస్తకం చదువుకుంటూనో మెచ్చిన సంగీతం వింటూనో ఉంటే హాయిగా ఉంటుంది. అయితే వర్షాకాలం ఆనందాలకే కాదు... అంటు వ్యాధులకూ ఆలవాలం. వీటితోపాటు జలుబు, దగ్గు, జ్వరం వంటి సాధారణ సమస్యలు కూడా చికాకు పెడుతుంటాయి. వీటిని నివారించేందుకు కొన్ని ముందు జాగ్రత్త చర్యలు, చిట్కాలు పాటించడం శ్రేయస్కరం.

చిరుజల్లులు... సీజనల్ వ్యాధులు జాగ్రత్తలివిగో..!

వర్షాకాలంలో దోమలు, ఈగలు వంటి కీటకాల బెడద పెరుగుతుంది. ఇవి వైరల్ ఫీవర్లు, ఇన్‌ఫెక్షన్లు కలిగిస్తాయి. దానికితోడు జలుబు, దగ్గు, అసిడిటీ, ఉబ్బరం, అజీర్ణం లాంటి సమస్యలూ సర్వ సాధారణం. అందుకే ముందే జాగ్రత్త పడదాం.

జంక్ ఫుడ్‌కి దూరం

ఎంతగా నోరూరించినా సరే, ఈ సీజన్‌లో జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం మేలు. వాటికి బదులు పెరుగు లేదా మజ్జిగ వంటి ప్రోబయోటిక్స్ కలిగిన పదార్థాలను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థకు మద్దతు ఇచ్చే మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. అలాగే పచ్చి కూరలకు బదులు తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి.



నో స్ట్రీట్ ఫుడ్

వర్షాకాలంలో ఆహారం కలుషితమై ఉండే అవకాశాలు ఉన్నందువల్ల స్ట్రీట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. తక్కువ మొత్తంలో తినేలా చూసుకోవాలి. అధిక మొత్తంలో ఆహారం తీసుకోవటం వల్ల జీర్ణ వ్యవస్థపై భారం పడుతుంది. చర్మ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు వేడినీటితో రోజు రెండు పూటలా స్నానం చేయాలి. ఇలా చేయటం వల్ల చర్మంపై పేరుకున్న మురికి, క్రిములు తొలగిపోతాయి. అలర్జీలు దరి చేరకుండా చూసుకోవచ్చు.

ఇంటి శుభ్రత

వర్షాకాలంలో ఇంట్లో మురికి ఎక్కువ చేరుతుంది. తేమకు పురుగులు, కీటకాలు సూక్ష్మజీవులు చేరుతుంటాయి. ఇవి వ్యాప్తి చెందకుండా ఇంటిని తరచు శుభ్రపరుస్తూ ఉండాలి.

కాచి చల్లార్చిన నీరు

వర్షాకాలంలో ఆహారం, నీటి ద్వారా ఇన్ఫెక్షన్ల వల్ల అకస్మాత్తుగా ఆస్పత్రి పాలయే అవకాశం ఉంటుంది. కాబట్టి కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహారాన్ని తీసుకోవడం మంచిది.

నో సీ ఫుడ్: వర్షాకాలంలో నీరు కలుషితమై ఉంటుంది. అందువల్ల సీ ఫుడ్ తినడం మానుకోవాలి. చేపలు తినడం వల్ల కలరా, డయేరియా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల జల చరాల జోలికి పోకుండా ఉండటం శ్రేయస్కరం.

అంతేకాదు, వర్షం వల్ల వ్యాయామాలు చేసేందుకు బయటకు వెళ్ళలేని పరిస్థితి ఉంటుంది కాబట్టి జీర్ణ క్రియలు సాఫీగా ఉండాలంటే ఇంట్లోనే తేలికపాటి వ్యాయామాలు చేయటం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

తడిస్తే స్నానం తప్పనిసరి

వర్షంలో తడిస్తే స్నానం తప్పనిసరి.ఇన్ఫెక్షన్, దగ్గు, జలుబు నివారణకిది మంచి మార్గం.

నీరు తాగాలి: వర్షాకాలంలో ప్యాక్డ్ వాటర్, కియోస్కులు, ధాబాస్‌వంటి ప్రదేశాలలోని నీటికి బదులు వాటర్ ప్యూరిఫైయర్ నుంచి మాత్రమే నీరు తాగడం సురక్షితం.

హ్యాండ్ వాష్ తప్పసరి!

వాష్‌రూమ్ డోర్, ట్యాప్, ఫ్లష్ మొదలైన వాటి ద్వారా సూక్ష్మక్రిములు మన చేతుల్లోకి వస్తాయి. భోజనానికి ముందు, తరువాత తప్పనిసరిగా చేతులు కడుక్కోవడం అంటువ్యాధుల నివారణకు సాయం చేస్తుంది.

వేడి సూప్‌లే ముద్దు

వర్షాకాలంలో చికెన్ సూప్, క్యారెట్ సూప్, మష్రూమ్ సూప్ లేదా వెజిటబుల్ సూప్ వంటివి తీసుకోవడం ఎంతో మేలు. అలాగే, తులసి, పసుపు, దాల్చిన చెక్క, ఏలకులు, నిమ్మ వంటి వాటితో కాచిన కషాయం వల్ల అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.



కాకర ఆరోగ్యానికి ఆసరా



గరుకుగా ఉండే పై పొరతో ముదురాకుపచ్చ రంగులో ఉండే కాకర రుచికి ... చేదుగా ఉన్నప్పటికీ పుష్కలమైన వైద్యగుణాలను కలిగి ఉంది. ఇది జ్వరాన్ని తగ్గిస్తుంది. ఆకలిని పెంచుతుంది. కడుపునొప్పిని తగ్గిస్తుంది. నులిపురుగులను సైతం నశింపజేయగల ఔషధంగా పనిచేస్తుంది.

కాకరకాయను తినడం వల్ల రక్తప్రసరణ చక్కగా జరిగి, తద్వారా కొవ్వు కరిగి శరీరం నాజూకుగా ఉంటుంది. వారంలో ఒకసారి కాకరకాయ కూర తింటే ఆకలి పెరిగి, అజీర్ణం తగ్గుతుంది. అలవాటు తక్కువగా ఉన్నవాళ్లు మెల్లగా కాకరకాయను కూరగా అలవాటు చేసుకుంటుంటే అందులో రుచి పెరుగుతుంది. అందులో ఉన్న ఔషధగుణాలతో ఆరోగ్యం మెరుగవుతుంది.

కాకర కాయలో బీ, సి విటమిన్లతో పాటు పొటాషియం, మెగ్నీషియం, సోడియం, ఫాస్ఫరస్ వంటి ధాతువులు ఉన్నాయి. మనం తినే ఆకు కూరల్లో ఉన్న క్యాల్షియం కంటే కాకరలో రెండింతలు అధికంగా క్యాల్షియం వుంటుంది. కాకరకాయ జ్యూస్‌ను రోజూ తాగితే డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. కాకరకాయ జ్యూస్‌లో ఉండే ఔషధ గుణాలు ఇన్సులిన్‌లా పనిచేస్తాయి. అందువల్ల షుగర్ స్థాయిలు అదుపులో ఉంటాయి. కాకర కంటి శుక్లం, దృష్టి లోపం వంటి సమస్యల నివారిణిగా పనిచేస్తుంది.

శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది. అలెర్జీలు దరి చేరవు. వైరస్, బాక్టీరియాపై పోరాడుతుంది. మహిళలో వచ్చే గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మలబద్ధకాన్ని వదిలించుకునేందుకు రోజుకు రెండుసార్లు అరస్పూన్ తీసుకుంటే చాలు. ఒక్క కాకర కాయలో బచ్చలికూరలో ఉండే కాల్షియం, ఒక అరటిపండులో ఉండే పొటాషియం ఉంది.

ప్రారంభ దశలో ఉన్న కలరాను దూరం చేస్తుంది కాకర. కలరాతో ఏర్పడే వాంతులకు కూడా కాకర కళ్లెం వేస్తుంది. కాకర జ్యూస్‌ను క్రమం తప్పకుండా తీసుకుంటూ వస్తే కంటి సమస్యలు, దృష్టిలోపాలను దూరం చేసుకోవచ్చు. కాకర తీసుకుంటే చూపు మెరుగవుతుంది.

అలెర్జీ, చర్మ వ్యాధులు, సోరియాసిస్ వంటి వ్యాధుల్ని కూడా కాకర నయం చేస్తుంది. శ్వాస సంబంధిత సమస్యలకు సైతం కాకర దివ్యౌషధంగా పనిచేస్తుంది. కీళ్ళనొప్పులు తగ్గించే గుణం కాకర కాయకు ఉంది. బాధిస్తున్న కీలుమీద కాకరరసాన్ని రాసి నెమ్మదిగా మర్దన చేయాలి.

> ఇందులో పుష్కలంగా ఉండే విటమిన్ 'ఎ' కళ్ల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. అతిసార, నులిపురుగులు, గజ్జి, తామర వంటి చర్మవ్యాధులకు కాకర కాయలు ఔషధంగా ఉపయోగపడతాయి.

మీ పిల్లలను చురుగ్గానే ఉంచుతున్నారా?




ఆటపాటలతో గడపడం వల్ల పిల్లలు శారీరకంగానే కాదు, మానసికంగానూ చురుగ్గా ఉండగలరు. ముఖ్యంగా టీనేజ్‌లో పిల్లలు వ్యాయామం చేస్తే పెద్దయ్యాక కూడా వృత్తి, ఉద్యోగాల రీత్యా ఎటువంటి ఒత్తిళ్లకూ లోను కారు. అంతేకాదు, మిడిల్ ఏజ్‌లో గుండె జబ్బులు, వృద్ధాప్యంలో అల్జీమర్స్ రాకుండా ఉంటాయి. వ్యాయామం నేరుగా మెదడు పెరుగుదలను ప్రేరేపిస్తుంది కాబట్టి తల్లిదండ్రులు చిన్నప్పటినుంచే వ్యాయామాన్ని అలవాటు చేయాలి. ఇంట్లో తల్లితండ్రులు వ్యాయామం చేసేటప్పుడు పిల్లలను కూడా కలుపుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు... వ్యాయామం వల్ల పిల్లల్లో జ్ఞాపక శక్తి బాగా పెరిగి, చదువుతో కుస్తీ పడాల్సిన అవసరం లేకుండా పరీక్షల్లో రాణించగలుగుతారు.

వ్యాయామం ఎంతసేపు? ఎలా?

యూనివర్సిటీ ఆఫ్ బ్రిటీష్ కొలంబియాకు చెందిన కొందరు శాస్త్రవేత్తలు పిల్లలపై పరిశోధనలు నిర్వహించారు. నిత్యం వ్యాయామం చేసే పిల్లలు, వ్యాయామం చేయని పిల్లలతో పోల్చితే వారు చురుగ్గా ఉండడంతోపాటు చదువులో కూడా రాణిస్తారని తేలింది. అందువల్ల పిల్లల్ని రోజూ కనీసం 40 నిమిషాల పాటు వ్యాయామం చేసేలా ప్రోత్సహించాలి లేదా ఆటలు ఆడుకోనివ్వాలి.

సినిమా

విజిలేస్కో...



విజయ్

విజిలేస్కో అంటున్నారు విజయ్. ఆయన హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్, జయరామ్, స్నేహ, లైలా, అజ్మల్ అమీర్, మీనాక్షీ చౌదరి, వైభవ్ కీలక పాత్రలు చేస్తున్నారు. కల్పాతి ఎస్. అఘోరమ్, కల్పాతి ఎస్. గణేశ్, కల్పాతి ఎస్. సురేష్ నిర్మిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'విజిలేస్కో...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు మేకర్స్. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటని యువన్ శంకర్ రాజా, నకాష్ అజీజ్ పాడారు. రాజు సుందరం కొరియోగ్రఫీ చేశారు. ''విజిలేస్కో...' పవర్‌ఫుల్ ఎనర్జీతో డ్యాన్స్ ఆంథమ్‌గా సాగుతుంది. ఛాంపియన్‌షిప్‌ని సెలబ్రేట్ చేసుకునే సాంగ్ ఇది. ఈ పాటలో విజయ్, ప్రభుదేవా, ప్రశాంత్, అజ్మల్ అమీర్‌ల డ్యాన్స్ అదిరిపోతుంది'' అన్నారు మేకర్స్. 'ది గోట్' చిత్రాన్ని తెలుగులో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ విడుదల చేస్తోంది.

సర్దార్ సిద్ధం



కార్తీ

సెట్స్‌లోకి వచ్చేందుకు సర్దార్ సిద్ధమయ్యాడు. హీరో కార్తీ, దర్శకుడు పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో రూపొందిన స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'సర్దార్'. తండ్రీ కొడుకులుగా కార్తీ ద్విపాత్రాభినయం చేసిన ఈ సినిమా 2022లో విడుదలై, హిట్‌గా నిలిచింది. దీంతో 'సర్దార్' సినిమా విడుదలైన కొన్ని రోజులకే 'మిషన్ కంబోడియా' అంటూ 'సర్దార్' సీక్వెల్‌ను మేకర్స్ ప్రకటించారు. అయితే తర్వాత 'సర్దార్ 2' గురించి మరో అప్‌డేట్ లేదు. కాగా ఈ సీక్వెల్ పూజా కార్యక్రమాలు ఇటీవల జరిగాయని, ఈ నెల 15న చెన్నైలో వేసిన సెట్స్‌లో చిత్రీకరణ మొదలవుతుందని చిత్రయూనిట్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాను ప్రిన్స్ పిక్చర్స్ నిర్మించనుంది. 'సర్దార్' చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించగా, సీక్వెల్‌కి యువన్ శంకర్ రాజా స్వరాలు సమకూర్చనున్నారు. ఇక ఈ సినిమాకు చెందిన ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు.

కాంబినేషన్ సెట్?



వెంకటేశ్



వేణు


హీరో వెంకటేశ్ మంచి జోరు మీద ఉన్నారు. 'ఎఫ్ 2, ఎఫ్ 3' సినిమాల తర్వాత దర్శకుడు అనిల్ రావిపూడితో వెంకటేశ్ చేస్తున్న సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రీకరణ ప్రారంభమైంది. సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేయనున్నారు. అలాగే హిట్ ఫిల్మ్ 'సామజవరగమన' ఫేమ్ రైటర్ నందు రెడ్డి చేసిన ఓ కథలో వెంకటేశ్ హీరోగా నటిస్తారనే ప్రచారం సాగుతోన్న సంగతి తెలిసిందే. ఈ రెండు చిత్రాలు ఇలా ఉండగానే... వెంకటేశ్ మరో కథ విన్నారట. ఇటీవల ఓ మల్టీస్టారర్ ఫిల్మ్ కథను రెడీ చేశారట వేణు ఉడుగుల. ముగ్గురు హీరోలకు స్కోప్ ఉండే ఈ సినిమాలో మెయిన్ హీరోగా వెంకటేశ్ నటించనున్నారట. ఆల్రెడీ వెంకటేశ్ కథ విన్నారని, వేణు ఉడుగులతో 'విరాటపర్వం' సినిమాను నిర్మించిన నిర్మాణ సంస్థల్లో ఒకటైన సురేష్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మించనుందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఈ సంగతలా ఉంచితే... రానా-సాయి పల్లవి కాంబినేషన్‌లో వేణు ఉడుగుల దర్శకత్వంలో రూపొందిన 'విరాటపర్వం' మంచి సినిమా అనిపించుకుంది. ఈ చిత్రానికి తాజాగా ఫిల్మ్ ఫేర్ అవార్డులు దక్కాయి. ఉత్తమ నటిగా (క్రిటిక్స్) సాయి పల్లవి అవార్డు అందుకోనుండగా ఇదే సినిమాకి ఉత్తమ సహాయ నటి అవార్డుకి నందితా దాస్ ఎంపికయ్యారు.

శివన్న ఆన్ బోర్డ్



శివన్నగా కన్నడ ఇండస్ట్రీలో అభిమానాన్ని సొంతం చేసుకున్న కన్నడ స్టార్ హీరో శివ రాజ్‌కుమార్ ఓ తెలుగు సినిమాలో పవర్‌ఫుల్ రోల్‌లో నటించనున్నారు. రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించనున్న చిత్రం 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో వివిధ భాషలకు చెందిన ప్రముఖ నటీనటులు కనిపించనున్నారు. శుక్రవారం (జూలై 12) శివ రాజ్‌కుమార్ పుట్టినరోజు. ఈ సందర్భంగా శివ రాజ్‌కుమార్ ఆన్ బోర్డ్ అంటూ 'పెద్ది'లో ఆయన ఓ శక్తివంతమైన పాత్ర చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''ఈ చిత్రంలో స్టార్ హీరోలైన రామ్‌చరణ్, శివ రాజ్‌కుమార్‌లను తెరపై చూసేందుకు వారి ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో తెలియజేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రత్నవేలు.

శివం భజే ఫిక్స్



అశ్విన్

'రాజుగారి గది' ఫేమ్ అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవన్షీ జోడీగా నటించిన 'శివం భజే' చిత్రం విడుదల తేదీ ఖరారు అయింది. ఆగస్టు 1న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అప్సర్ దర్శకత్వంలో గంగా ఎంటర్‌టైన్మెంట్స్‌పై మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మించారు. మహేశ్వర్ రెడ్డి మూలి మాట్లాడుతూ– ''న్యూ ఏజ్ డివైన్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'శివం భజే'. వైవిధ్యమైన కథతో, ఉన్నత సాంకేతిక విలువలతో మా సంస్థలో నిర్మించిన తొలి చిత్రం ఇది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు చివరి దశలో ఉన్నాయి'' అన్నారు. ''టైటిల్, టీజర్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన మా 'శివం భజే' పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి'' అన్నారు అప్సర్. ''ప్రతి ఒక్కరూ తమ బెస్ట్ ఇవ్వడంతో ఈ చిత్రం మేము ఊహించినదానికంటే అద్భుతంగా వచ్చింది. ఆ శివుని అనుగ్రహంతో పాటు ప్రేక్షకుల ఆశీర్వాదాలు ఉంటాయని నమ్ముతున్నాం'' అన్నారు అశ్విన్ బాబు. అర్బాజ్ ఖాన్, మురళీ శర్మ, తనికెళ్ల భరణి, బ్రహ్మాజీ, తులసి ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి మ్యూజిక్: వికాస్ బడిస, కెమెరా: దాశరథి శివేంద్ర.

మళ్లీ అలాంటి ప్రేమకథలో..?




నయనతార

నయనతార, శింబు లీడ్ రోల్స్‌లో నటించిన 'వల్లభ' (2006) సినిమా గుర్తుండే ఉంటుంది. ఈ సినిమాలో స్టూడెంట్ వల్లభ (శింబు), ప్రొఫెసర్ స్వప్న (నయనతార) ప్రేమించుకుంటారు. ఇప్పుడు 'వల్లభ' సినిమా ప్రస్తావన ఎందుకంటే ఈ తరహాలోనే తనకంటే చిన్న వయస్కుడితో ప్రేమలో పడే కథకు నయనతార మళ్లీ పచ్చజెండా ఊపారని కోలీవుడ్‌లో వినిపిస్తోంది. నయనతార, కెవిన్ లీడ్ రోల్స్‌లో తెరకెక్కనున్న చిత్రకథాంశం ఇది అని టాక్. దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో కలిసి ఓ తమిళ సినిమాకు లిరిక్స్ అందించిన విష్ణు ఎడ్వాన్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఈ సినిమా చిత్రీకరణను ఈ నెల 22న ప్రారంభించాలని చిత్రయూనిట్ అనుకుంటోందట. ఈ సినిమాలో తనకంటే చిన్నవాడైన ఓ అబ్బాయిని ఇష్టపడుతుందట ఓ అమ్మాయి. ఆ అబ్బాయి కూడా ఆమెతో ప్రేమలో పడతాడట. ఆ తర్వాత ఈ ఇద్దరూ ఎలాంటి పరిణామాలను ఎదుర్కొన్నారు? అనే అంశాలను వినోదాత్మకంగా చూపించనున్నారట దర్శకుడు.

సీక్వెల్ రెడీ... నయనతార, ఆర్‌జే బాలాజీ నటించిన ఆధ్యాత్మిక చిత్రం 'ముకుత్తి అమ్మన్' (2020). ఆర్‌జే బాలాజీ, ఎన్‌జే శరవణన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజ్ కాగా పాజిటివ్ రెస్పాన్స్ లభించింది. ఇటీవల ఈ సినిమాకు సీక్వెల్ అంశం తెరపైకి వచ్చింది. 'ముకుత్తి అమ్మన్ 2'లో నయనతార ఓ లీడ్ రోల్‌లో నటించనున్నట్లుగా వేల్స్ ఫిల్మ్ ఇంటర్‌నేషనల్ సంస్థ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. అయితే దర్శకుణ్ణి మాత్రం ప్రకటించలేదు.

వెంటాడే ప్రేమకథ



సంతోష్ శోభన్

సంతోష్ శోభన్, అలేఖ్య హారిక జంటగా సుమన్ పాతూరి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ పతాకాలపై ఎస్‌కేఎస్, సాయి రాజేశ్ ఈ సినిమాను నిర్మించనున్నారు. శుక్రవారం హీరో సంతోష్ శోభన్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటించి, కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌పై 'కొన్ని ప్రేమ కథలు జీవితకాలం వెంటాడుతాయి..' అనే ట్యాగ్‌లైన్ ఉంది. ప్రస్తుతం ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయని, ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని మేకర్స్ వెల్లడించారు. ఈ సినిమాకు సంగీతం: విజయ్ బుల్గానిన్.

సాక్షి బిజినెస్
శనివారం
13-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	622	80,519
నిఫ్టీ ▲	186	24,502

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	18,518	▲ 235
డోజోన్స్	40,188	▲ 434
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,253	▲ 30
డాక్స్	18,748	▲ 214
షాంఘై	2,971	▲ 1
నికాయ్	41,191	▲ 1,003

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారెట్)	71,930
బంగారం (22 క్యారెట్)	68,500
వెండి (కిలో)	99,990

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.14	84.07
£	బ్రిటన్ పౌండ్		105.69	108.26
€	యూరో		89.29	91.65
¥	జపాన్ ఎన్ (100)		51.47	52.60
AUS	ఆస్ట్రేలియా డాలర్		55.42	57.36
S$	సింగపూర్ డాలర్		59.50	64.16
SAR	సౌదీ రియాల్		21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్		21.85	23.63
¥	చైనా యువాన్		10.36	12.44

సూచీలు సరికొత్త శిఖరాలకు..



- ఐటీ షేర్ల ర్యాలీ
- ఫెడ్ వడ్డీ రేట్ల కోత అంచనాల ఎఫెక్ట్
- 622 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: ఐటీ షేర్ల భారీ ర్యాలీ, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలతో స్టాక్ సూచీలు శుక్రవారం కొత్త గరిష్టాలకు చేరాయి. టీసీఎస్ అంచనాలకు మించి క్యూ1 ఆర్థిక ఫలితాలను వెల్లడించి దేశీయ కార్పొరేట్ ఫలితాల సీజన్‌ను షురూ చేయడంతో ఇన్వెస్టర్లలో ఉత్సాహం పెరిగింది. అలాగే అమెరికా ద్రవ్యోల్బణం ఏడాది దిగిరావడంతో యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలూ ఐటీ రంగ షేర్లకు భారీ డిమాండ్ పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 622 పాయింట్లు పెరిగి 80,519 వద్ద ముగిసింది. నిఫ్టీ 186 పాయింట్ల లాభంతో 24,502 వద్ద స్థిరపడింది. ముగింపు స్థాయిలు ఇరు సూచీలకు సరికొత్త రికార్డులు. అంచనాలకు మించి క్యూ1 ఫలితాలతో టీసీఎస్ సంస్థ షేరు 7% లాభపడి రూ.4185 వద్ద ముగిసింది. విప్రో 5%, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా షేర్లు 3 శాతం పెరిగాయి. రంగాల వారీగా అత్యధికంగా బీఎస్‌ఈ ఐటీ ఇండెక్స్ 4.32% పెరిగింది.

■ సూచీల కొత్త రికార్డులతో ఇన్వెస్టర్ల సంపద సైతం జీవితకాల గరిష్టానికి చేరుకుంది. శుక్రవారం ఒక్కరోజే రూ.1.17 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ రూ. 452.38 లక్షల కోట్లకు చేరింది.

పారిశ్రామిక రంగం పరుగు



న్యూఢిల్లీ: భారత్ మొత్తం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దాదాపు 25 శాతం వాటా ఉన్న పారిశ్రామిక రంగం 2024 మేలో సానుకూల ఫలితాన్ని నమోదుచేసుకుంది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి రేటు 5.9 శాతంగా నమోదైంది. గడచిన ఏడు నెలల్లో ఈ స్థాయిలో పారిశ్రామిక రంగం పురోగతి ఇదే తొలిసారి. విద్యుత్, కన్జూమర్ డ్యూరబుల్స్, మైనింగ్ రంగాలు మంచి పనితనాన్ని ప్రదర్శించినట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. ఇక ఆర్థిక సంవత్సరం 2024 ఏప్రిల్, మే నెలల్లో ఐఐపీ 5.4 శాతంగా నమోదైంది. 2023 ఇదే కాలంలో ఈ వృద్ధి రేటు 5.1 శాతం.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

జీసీసీలో హైరింగ్ జోరు	కొత్త మైలురాయికి పీవీ విక్రయాలు

రూ.10,000 లోపు హ్యాండ్‌సెట్లపై కంపెనీల దృష్టి

- ఈ పండుగ సీజన్‌లోనే వెల్లువలా మార్కెట్లోకి...
- 5జీ చిప్‌సెట్ రేట్లు దిగిరావడంతో ఫోన్ల ధరలు తగ్గుముఖం
- చైనా చిప్‌సెట్ బ్రాండ్ యూనిసాక్ బాటలో క్వాల్‌కామ్, మీడియాటెక్

చౌక 5జీ ఫోన్ల మోత!

మనం ఇప్పటికే 5జీ యుగంలోకి అడుగుపెట్టేశాం. ఒకపక్క టెలికం కంపెనీలు 5జీ నెట్‌వర్క్ విస్తరణకు వడివడిగా అడుగులు వేస్తున్నాయి. మరో పక్క మొబైల్ ఫోన్ తయారీ సంస్థలు కూడా 5జీ హ్యాండ్‌సెట్లను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నాయి. దీంతో ఫోన్ కొనుగోలుదారులకు ఇక 'పండుగే'! ప్రస్తుతం దేశంలో 5జీ స్మార్ట్ ఫోన్ల ధర రూ. 11,000–13,000 మధ్య ప్రారంభమవుతోంది. కొన్ని ఫోన్ బ్రాండ్‌లు అప్పుడప్పుడు ప్రమోషనల్ ఆఫర్లను అందిస్తుండటంతో ధర కొంచెం తగ్గుతోంది. అయితే, చిప్ తయారీ సంస్థలు చౌక 5జీ చిప్‌సెట్లను అందుబాటులోకి తెస్తుండటంతో ఫోన్ రేట్లు భారీగా దిగిరానున్నాయి.

చిప్.. చిప్.. హుర్రే!

తాజాగా భారత్ కోసం చైనా చిప్‌సెట్ బ్రాండ్ యూనిసాక్ 'టీ760' చిప్‌సెట్‌ను విడుదల చేసింది. ప్రధాన మొబైల్ ఫోన్ తయారీ సంస్థలు అందుబాటు ధరల్లో 5జీ ఫోన్ల విడుదలకు చర్చలు జరుపుతున్నట్లు ప్రకటించింది. దీంతో రూ. 10,000 లోపు ధరల్లో 5జీ ఫోన్లకు మార్గం సుగమం కానుంది. యూనిసాక్ బాటలోనే మొబైల్ చిప్‌సెట్లలో దిగ్గజ బ్రాండ్‌లైన క్వాల్‌కామ్, మీడియాటెక్ కూడా చౌక 5జీ చిప్‌సెట్లను అందించనున్నాయి. 'అతి త్వరలోనే' బడ్జెట్, ఎంట్రీలెవెల్ 5జీ హ్యాండ్‌సెట్ల కోసం చిప్‌సెట్లను తీసుకొస్తామని క్వాల్‌కామ్ కంపెనీ ప్రతినిధి పేర్కొన్నారు. మీడియాటెక్ 'డైమెన్సిటీ 6000 సిరీస్' ఎంట్రీలెవెల్ చిప్‌సెట్ చౌకగా స్మార్ట్ ఫోన్లను అందించేందుకు వీలుకల్పిస్తుందని ఆ కంపెనీ డిప్యూటీ డైరెక్టర్ అనూజ్ సిద్ధార్థ్ చెప్పారు. '2జీ, 4జీ విభాగాల్లో యూనిసాక్ చిప్‌సెట్ల వాటా పటిష్టంగా ఉంది. టీ760తో భారత్‌లో అందరికీ చౌక 5జీ ఫోన్లను అందించడమే మా లక్ష్యం. దీనికోసం కీలక ఫోన్ తయారీదారులతో జట్టు కడుతున్నాం. టీ760 చిప్‌సెట్ మెరుగైన పనితీరుతో భారత్ 5జీ స్మార్ట్ ఫోన్ మార్కెట్‌లో సంచలనం సృష్టిస్తాం' అని యూనిసాక్ కంపెనీ పేర్కొంది.

> **5జీ ఫోన్ కొనే ప్లాన్‌లో ఉన్నారా?** పండుగ సీజన్ వరకు కాస్త ఓపిక పట్టండి! ఎందుకంటారా? భారీగా ఆదా చేసే చాన్స్ రాబోతోంది. రాబోయే పండుగల్లో చౌక 5జీ ఫోన్లు మార్కెట్‌ను ముంచెత్తనున్నాయి. ప్రధానంగా హ్యాండ్‌సెట్ల తయారీలో కీలకమైన 5జీ చిప్‌సెట్లను చిప్ తయారీ బ్రాండ్‌లు తక్కువ ధరల్లో విడుదల చేస్తుండటంతో ఫోన్ రేట్లు దిగొచ్చేందుకు వీలవుతోంది. దీంతో ఈ ఏడాది చివరికల్లా దేశంలో 5జీ హ్యాండ్‌సెట్ల మార్కెట్ భారీగా ఎగబాకుతుందనేది పరిశ్రమ వర్గాల అంచనా.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఇక 5జీ మార్కెట్ జోరు...

చిప్‌సెట్ల రేట్లు దిగిరావడం, చౌక ఫోన్ల లభ్యతతో ఈ ఏడాది చివరికల్లా 5జీ ఫోన్ల మార్కెట్ వాటా రెండంకెల స్థాయికి చేరుకోవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 'రూ. 10,000 విభాగంలో 5జీ ఫోన్ల వాటా ఈ ఏడాది మే నాటికి కేవలం 1.4 శాతం మాత్రమే ఉంది. చౌక చిప్‌సెట్ల ప్రభావంతో డిసెంబర్ నాటికి ఈ వాటా 10 శాతానికి చేరుకోనుంది' అని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ డైరెక్టర్ తరుణ్ పాఠక్ పేర్కొన్నారు. ట్రాన్సియన్ హోల్డింగ్స్ (టెక్నో, ఇన్ఫినిక్స్, ఐటెల్ తదితర మొబైల్ బ్రాండ్స్), హెచ్‌ఎండీ గ్లోబల్ (నోకియా బ్రాండ్), రియల్‌మీ, రెడ్‌మీ వంటి కంపెనీలు దసరా, దీపావళి పండుగ సీజన్‌లో చౌక 5జీ హ్యాండ్‌సెట్లను ప్రవేశపెట్టే సన్నాహాల్లో ఉన్నాయి. 'ట్రాన్సియన్ వంటి కీలక తయారీదారు భారీ ప్రణాళికల్లో ఉండటంతో రూ.10,000 లోపు 5జీ హ్యాండ్‌సెట్ల మార్కెట్ దూసుకుపోనుంది. 5జీ ఫోన్ల విడుదలకు సంబంధించి మార్కెట్‌ను అధ్యయనం చేస్తున్నాం' అని ట్రాన్సియన్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అరిజీత్ తలపాత్ర పేర్కొన్నారు.



1.4% ఈ ఏడాది మే నాటికి రూ.10,000 లోపు 5జీ హ్యాండ్‌సెట్ల అమ్మకాల వాటా

డిసెంబర్ కల్లా దేశీ ఫోన్ల మార్కెట్‌లో 5జీ మొబైల్స్ సేల్స్ పరిమాణం (కౌంటర్ పాయింట్ అంచనా) **10%**

ఎంట్రీలెవెల్ 5జీ సెగ్మెంట్లో టాప్ కంపెనీలు: ట్రాన్సియన్, హెచ్‌ఎండీ గ్లోబల్, రియల్‌మీ, రెడ్‌మీ

హెచ్‌సీఎల్ టెక్ లాభం జూమ్

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఈ ఏడాది (2024–25) తొలి త్రైమాసికం (క్యూ1)లో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ1లో నికర లాభం 20% పైగా ఎగసి రూ. 4,257 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం సైతం 6.6% వార్షిక వృద్ధితో రూ. 28,057 కోట్లకు చేరింది. త్రైమాసికవారీగా అంటే క్యూ4 (జనవరి–మార్చి)తో పోలిస్తే నికర లాభం 6.8% పుంజుకోగా.. ఆదాయం స్వల్పంగా 1.6% నీరసించింది.

- క్యూ1లో రూ. 4,257 కోట్లు
- షేరుకి రూ. 12 డివిడెండ్
- ఈ ఏడాది 3–5 శాతం వృద్ధి!
- 10,000 మందికి కొత్తగా ఉపాధి



గైడెన్స్ ఓకే..: ఈ ఏడాది ఆదాయంలో 3–5 శాతం స్థాయిలో వృద్ధి సాధించే వీలున్నట్లు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ తాజా అంచనాలు(గైడెన్స్) ప్రకటించింది. భవిష్యత్‌కు తగిన పోర్ట్‌ఫోలియో కలిగిన తాము జెన్‌ఏఐ ప్రభావంతో కొత్తగా పుట్టుకొస్తున్న అవకాశాలను అందుకోగలమని కంపెనీ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా పేర్కొన్నారు. 'రానున్న త్రైమాసికాలలో మరింత పురోగతి సాధించగలమని విశ్వసిస్తున్నాం. వెరసి పూర్తి ఏడాదికి అంచనాలను అందుకునే పనితీరును చూపగలమని భావిస్తున్నాం' అని కంపెనీ సీఈఓ సి.విజయ్‌కుమార్ చెప్పారు.

ఇతర విశేషాలు...

- క్యూ1లో కొత్తగా 2 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను కుదుర్చుకుంది.
- ఉద్యోగుల సంఖ్య 7,000కు పైగా తగ్గింది. జూన్ నాటికి మొత్తం సిబ్బంది 2,19,401 మందికి చేరింది. ఉద్యోగ వలసల (అట్రిషన్) రేటు 12.8 శాతంగా నమోదైంది.
- వాటాదారులకు రూ. 2 ముఖ విలువగల ప్రతీ షేరుకీ రూ. 12 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.
- ఈ ఏడాది కొత్తగా 10,000 మంది ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలను కల్పించనుంది.

హెచ్‌సీఎల్ టెక్ షేరు 3.2 శాతం జంప్‌చేసి రూ.1,560 వద్ద ముగిసింది.

కూరగాయలు భగ్గు

న్యూఢిల్లీ: వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో 'యూ'టర్న్ తీసుకుంది. పదకొండు నెలలుగా మెట్లు దిగివస్తూ, 2024 మేలో 4.8 శాతానికి చేరిన రిటైల్ ద్రవ్యోల్బణం, జూన్‌లో 28 బేసిస్ పాయింట్లు పెరిగి (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) 5.08 శాతానికి (2023 జూన్‌తో పోల్చి) చేరింది. అంతక్రితం గడిచిన నాలుగు నెలల్లో ఇంత తీవ్ర స్థాయి రిటైల్ ద్రవ్యోల్బణం నెలకొనడం ఇదే తొలిసారి. ఆహారం ప్రత్యేకించి కూరగాయల ధరల తీవ్రత దీనికి ప్రధాన కారణం. రిటైల్ ద్రవ్యోల్బణంలో కీలక విభాగమైన ఆహార విభాగంలో ద్రవ్యోల్బణం 9.36%గా ఉంది. మేలో ఈ రేటు 8.69%. కూరగాయల ధరలు భారీగా 29.32% పెరిగాయి. పప్పు దినుసుల ధరలు 16.07 శాతంగా నమోదయ్యాయి. ధరల పెరుగుదల నేపథ్యంలో ఆర్‌బీఐ వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు సన్నగిల్లాయి.

- జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.08%
- 4 నెలల గరిష్ట స్థాయి



అమెజాన్ 'ప్రైమ్ డే' 20 నుంచి..

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ జూలై 20, 21న ప్రైమ్ డే సేల్స్ నిర్వహించనుంది. ఈసారి సేమ్ డే డెలివరీ కింద 10 లక్షల ఉత్పత్తులు, నెక్ట్స్ డే డెలివరీ కింద 40 లక్షల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని అమెజాన్ డైరెక్టర్ (షాపింగ్ ఎక్స్‌పీరియన్స్) కిషోర్ తోట తెలిపారు. 450 బ్రాండ్లు 1,000కి పైగా ఉత్పత్తులను ఆవిష్కరించనున్నట్లు వివరించారు. వీటిలో మొబైల్స్, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు మొదలైనవి ఉంటాయన్నారు. ప్రస్తుతం 14 లక్షల మంది విక్రేతలు తమ ప్లాట్‌ఫాంలో ఉండగా వీరిలో 50,000 మంది తెలంగాణలో ఉన్నట్లు కిషోర్ చెప్పారు. వేగవంతమైన డెలివరీల కోసం తెలంగాణలో రెండు ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, 3 సార్టింగ్ సెంటర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఉత్పత్తులు, ఆఫర్లపై ప్రచారానికి 50,000 మంది పైచిలుకు కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో జట్టు కట్టామని, వీరిలో 10 శాతం మంది తెలంగాణ నుంచి ఉన్నారని చెప్పారు.



సాక్షి స్పోర్ట్స్

క్రెచికోవా X జాస్మిన్... నేడు వింబుల్డన్ మహిళల సింగిల్స్ ఫైనల్



ఈ ఏడాది వింబుల్డన్ మహిళల సింగిల్స్ విభాగంలో కొత్త విజేత అవతరించనుంది. లండన్‌లో ఈరోజు జరిగే ఫైనల్లో ప్రపంచ ఏడో ర్యాంకర్ జాస్మిన్ పావోలిని (ఇటలీ)తో ప్రపంచ 32వ ర్యాంకర్ క్రెచికోవా (చెక్ రిపబ్లిక్) తలపడుతుంది. వీరిద్దరు తొలిసారి వింబుల్డన్ టోర్నీలో ఫైనల్‌కు చేరుకున్నారు. 28 ఏళ్ల క్రెచికోవా 2021లో ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ నెగ్గగా... 28 ఏళ్ల జాస్మిన్ గత నెలలో ఫ్రెంచ్ ఓపెన్ లో రన్నరప్‌గా నిలిచింది. ఈ ఏడాది వింబుల్డన్ సింగిల్స్ చాంపియన్‌కు 27 లక్షల పౌండ్లు (రూ. 29 కోట్ల 23 లక్షలు)... రన్నరప్‌కు 14 లక్షల పౌండ్లు (రూ. 15 కోట్ల 15 లక్షలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి. సాయంత్రం 6 గంటలకు మొదలయ్యే ఫైనల్ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.





'704'తో ముగించిన అండర్సన్

- అంతర్జాతీయ క్రికెట్‌కు అండర్సన్ వీడ్కోలు
- తొలి టెస్టులో విండీస్‌పై ఇంగ్లండ్ ఘనవిజయం

లండన్: 21 సంవత్సరాల టెస్టు కెరీర్... 188 మ్యాచ్‌లు...40,007 బంతులు...704 వికెట్లు...26.45 సగటు...ఘనమైన ఆటకు ముగింపు లభించింది. టెస్టు క్రికెట్‌లో అత్యుత్తమ బౌలర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న ఇంగ్లండ్ పేసర్ జేమ్స్ అండర్సన్ కెరీర్‌కు తెర పడింది. శుక్రవారం వెస్టిండీస్‌తో ముగిసిన తొలి టెస్టుతో అతను ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2003 మే 22–24 మధ్య ఇదే లార్డ్స్ మైదానంలో తొలి టెస్టు ఆడిన అండర్సన్ అక్కడే ఆటకు వీడ్కోలు పలికాడు. విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో తన 12వ ఓవర్లో జోషువా డి సిల్వాను కీపర్ క్యాచ్ ద్వారా అవుట్ చేయడంతో అండర్సన్ ఖాతాలో చివరిదైన 704వ వికెట్ చేరింది. టెస్టుల్లో మురళీధరన్ (800 వికెట్లు), షేన్ వార్న్ (708 వికెట్లు) తర్వాత అత్యధిక వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా... సచిన్ టెండూల్కర్ (200) తర్వాత అత్యధిక టెస్టులు ఆడిన రెండో ఆటగాడిగా ఈ దిగ్గజం సొంత అభిమానుల సమక్షంలో మైదానం వీడాడు. మూడో రోజే ముగిసిన తొలి టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్, 114 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 79/6తో ఆట కొనసాగించిన విండీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 136 పరుగులకే కుప్పకూలింది. 12.1 ఓవర్లలో ఆ జట్టు మిగిలిన 4 వికెట్లు కోల్పోయింది. గుడకేశ్ మోతీ (31 నాటౌట్) మాత్రమే కొద్దిగా పోరాడగలిగాడు. రెండో ఇన్నింగ్స్‌లో అట్కిన్సన్ (5/61) విండీస్‌ను దెబ్బ తీశాడు. రెండో టెస్టు గురువారం నుంచి నాటింగ్‌హామ్‌లో జరుగుతుంది.

పదోసారి ఫైనల్లో జొకోవిచ్

వింబుల్డన్ పురుషుల సింగిల్స్ టైటిల్ కోసం అల్‌కరాజ్‌తో అమీతుమీ

లండన్: రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ కోసం సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ విజయం దూరంలో నిలిచాడు. ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో రెండో సీడ్ జొకోవిచ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో జొకోవిచ్ 2 గంటల 48 నిమిషాల్లో 6–4, 7–6 (7/2), 6–4తో 25వ సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ)పై గెలుపొందాడు. ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ ఆరు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. ఆదివారం జరిగే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్, మూడో సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)తో జొకోవిచ్ తలపడతాడు. గత ఏడాది కూడా వీరిద్దరి మధ్యే ఫైనల్ జరగ్గా... అల్‌కరాజ్ చాంపియన్‌గా నిలిచాడు. ఓవరాల్‌గా వింబుల్డన్ టోర్నీలో జొకోవిచ్ ఫైనల్ చేరడం ఇది పదోసారి కావడం విశేషం. ఈ టోర్నీలో జొకోవిచ్ 2011, 2014, 2015, 2018, 2019, 2021, 2022లలో విజేతగా నిలిచి... 2013, 2023లలో రన్నరప్‌గా నిలిచాడు. అంతకుముందు జరిగిన తొలి సెమీఫైనల్లో అల్‌కరాజ్ 6–7 (1/7), 6–3, 6–4, 6–4తో ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా)పై గెలిచాడు. 2 గంటల 55 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ ఆరు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయిన అల్‌కరాజ్... మెద్వెదెవ్ సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. నెట్ వద్దకు 53 సార్లు దూసుకొచ్చిన ఈ స్పెయిన్ స్టార్ 38 సార్లు పాయింట్లు గెలిచాడు. అల్‌కరాజ్, మెద్వెదెవ్ సెమీఫైనల్ మ్యాచ్‌ను భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ప్రత్యక్షంగా తిలకించాడు.


జొకోవిచ్

సిరీస్ విజయమే లక్ష్యంగా...

నేడు జింబాబ్వేతో భారత్ నాలుగో టి20

మ్యాచ్ గెలిస్తే సిరీస్ సొంతం • జోరు మీదున్న టీమిండియా
సాయంత్రం గం. 4:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

హరారే: జింబాబ్వే పర్యటనలో భారత యువ జట్టు అంచనాలకు అనుగుణంగానే రాణిస్తోంది. తక్కువ స్కోర్ల తొలి టి20లో తడబడి అనూహ్యంగా ఓటమి పాలైనా... తర్వాతి రెండు మ్యాచ్‌లలో జట్టు సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. భారీ స్కోర్లు చేసిన అనంతరం వాటిని నిలబెట్టుకుంది. ఇదే జోరులో మరో మ్యాచ్‌లో నెగ్గి సిరీస్ సొంతం చేసుకోవాలని శుబ్‌మన్ గిల్ బృందం పట్టుదలగా ఉంది. జట్టు సభ్యులంతా ఫామ్‌లో ఉండటం సానుకూలాంశం. రుతురాజ్ నిలకడగా ఆడుతుండగా... అభిషేక్ శర్మ రెండో మ్యాచ్‌లో సెంచరీతో తన ధాటిని చూపించాడు. కెప్టెన్ గిల్ కూడా అర్ధ సెంచరీతో ఫామ్‌లోకి రాగా... వరల్డ్ కప్ నుంచి తిరిగొచ్చిన తర్వాత యశస్వి జైస్వాల్ కూడా చక్కటి ఇన్నింగ్స్ ఆడాడు. రింకూ సింగ్ కూడా రెండో టి20లో సిక్సర్ల మోత మోగించగా, గత మ్యాచ్‌లో ఎక్కువ బంతులు ఆడే అవకాశం రాని సంజూ సామ్సన్ కూడా చెలరేగిపోగలడు. శివమ్ దూబే కూడా తన దూకుడును ప్రదర్శిస్తే ఇక ఈ లైనప్‌ను నిలువరించడం జింబాబ్వే బౌలర్లకు అంత సులువు కాదు. బౌలింగ్‌లో వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్ స్పిన్‌ను ప్రత్యర్థి బ్యాటర్లు తడబడుతున్నారు. తొలి మూడు మ్యాచ్‌లు ఆడిన అవేశ్ స్థానంలో ముకేశ్‌కు మళ్లీ తుది జట్టులో చోటు దక్కవచ్చు. ఈ మార్పు మినహా అదే జట్టు కొనసాగనుంది. మరోవైపు సిరీస్‌ను కోల్పోకుండా ఉండేందుకు జింబాబ్వే రెట్టింపు శ్రమించాల్సి ఉంటుంది. గత రెండు మ్యాచ్‌లలో ఆ జట్టు పేలవ ఫీల్డింగ్‌తో 7 క్యాచ్‌లు వదిలేయడంతో పాటు అదనపు పరుగులూ ఇచ్చింది. దీనిని నివారించగలిగితే టీమ్ పోటీనివ్వగలదు. మరోసారి కెప్టెన్ సికందర్ రజానే కీలకం కానుండగా... బెన్నెట్, మైర్స్, క్యాంప్‌బెల్‌లపై బ్యాటింగ్ భారం ఉంది. బౌలింగ్‌లో పేసర్ ముజరబాని, చటారా నిలకడగా ఆడుతున్నారు. సొంతగడ్డపై జింబాబ్వే తమ స్థాయికి తగినట్లు ఆడితే పోరు ఆసక్తికరంగా సాగవచ్చు.



గిల్, యశస్వి జైస్వాల్



సింధు సత్తాకు సవాల్!

గ్రూప్ దశలో సునాయాస 'డ్రా' • నాకౌట్ దశ నుంచి మేటి ప్రత్యర్థులు సిద్ధం
ప్రణయ్, లక్ష్య సేన్‌లలో ఒక్కరే ముందుకు • పారిస్ ఒలింపిక్స్ 'డ్రా' విడుదల

కౌలాలంపూర్: ఒలింపిక్స్ చరిత్రలో గతంలో ఏ భారతీయ ప్లేయర్‌కు సాధ్యంకాని ఘనతను సొంతం చేసుకోవాలంటే... భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. పారిస్ ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ ఈవెంట్ 'డ్రా' వివరాలను శుక్రవారం ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) విడుదల చేసింది. 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన సింధు 'పారిస్'లోనూ పతకం గెలిస్తే... భారత్ నుంచి ఒలింపిక్స్ చరిత్రలో మూడు వ్యక్తిగత పతకాలు నెగ్గిన ఏకైక ప్లేయర్‌గా రికార్డు సృష్టిస్తుంది. 'డ్రా' ప్రకారం సింధుకు గ్రూప్ దశలో సునాయాస ప్రత్యర్థులు ఎదురుకానున్నారు. గ్రూప్ 'ఎం'లో ఉన్న సింధు ప్రపంచ 75వ ర్యాంకర్ క్రిస్టిన్ కుబా (ఎస్తోనియా)తో, ప్రపంచ 111వ ర్యాంకర్ ఫాతిమత్ నభా (మాల్దీవులు)తో ఆడుతుంది. గ్రూప్ విజేత హోదాలో సింధు ప్రిక్వార్టర్ చేరితే ఆరో సీడ్ హి బింగ్‌జియావో (చైనా)తో తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 9–11తో వెనుకంజలో ఉంది. హి బింగ్‌జియావోపై నెగ్గితే సింధుకు క్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్ చెన్ యు ఫె (చైనా) ఎదురవుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 6–6తో సమంగా ఉంది. చెన్ యు ఫెను కూడా ఓడిస్తే సింధుకు సెమీఫైనల్లో రియో ఒలింపిక్స్ విజేత, మూడుసార్లు వరల్డ్ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్) సిద్ధంగా ఉండే అవకాశముంది. ముఖాముఖి రికార్డులో సింధు 5–12తో వెనుకంజలో ఉంది. ఒకవేళ మారిన్‌పై ఈసారి సింధు గెలిస్తే పతకం ఖరారవుతుంది. మారిన్ చేతిలో సింధు ఓడిపోతే కాంస్య పతకం కోసం రేసులో నిలుస్తుంది. కాంస్య పతకం కోసం మరో పార్శ్వంలో ఉన్న వరల్డ్ నంబర్‌వన్ అన్ సె యంగ్ (దక్షిణ కొరియా), ప్రపంచ మూడో ర్యాంకర్ తై జు యింగ్ (చైనీస్ తైపీ), ప్రపంచ ఐదో ర్యాంకర్ అకానె యామగుచి (జపాన్)లలో ఒకరితో సింధు ఆడే చాన్స్ ఉంటుంది.

పురుషుల సింగిల్స్‌లో భారత్ నుంచి ప్రణయ్, లక్ష్య సేన్ బరిలో ఉన్నారు. గ్రూప్ 'కె'లో ప్రణయ్... గ్రూప్ 'ఎల్'లో లక్ష్య సేన్ ఉన్నారు. లక్ష్య సేన్ గ్రూప్‌లోనే ఈ ఏడాది ఆసియా చాంపియన్, ఆల్ ఇంగ్లండ్ చాంపియన్, ప్రపంచ 3వ ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా) ఉన్నాడు. ప్రిక్వార్టర్ ఫైనల్ చేరాలంటే లక్ష్య సేన్ తప్పనిసరిగా క్రిస్టీపై గెలవాల్సి ఉంటుంది. స్థాయికి తగ్గట్టు ఆడితే గ్రూప్ 'కె' నుంచి ప్రణయ్ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంటాడు. 'డ్రా' ప్రకారం ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్, లక్ష్య సేన్ ముఖాముఖిగా తలపడే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఇద్దరు భారత ఆటగాళ్లలో ఒకరికి మాత్రమే పతకం నెగ్గే అవకాశం ఉంటుంది. మహిళల డబుల్స్‌లో నాలుగు జోడీలు ఉన్న గ్రూప్ 'సి'లో అశ్విని పొన్నప్ప–తనీషాలకు చోటు లభించింది. క్వార్టర్ ఫైనల్ చేరాలంటే భారత జోడీ రెండు మ్యాచ్‌ల్లో గెలవాలి. మరోవైపు పురుషుల డబుల్స్ 'డ్రా'లో ఎన్ని జోడీలు ఉండాలనే విషయంపై కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్‌లో కేసు నడుస్తున్న నేపథ్యంలో ఈ విభాగం 'డ్రా'ను ప్రకటించలేదు. ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉండటంతో భారత స్టార్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ –చిరాగ్ శెట్టిపై భారీ అంచనాలు ఉన్నాయి. పారిస్ ఒలింపిక్స్ ఈనెల 26 నుంచి జరగనుండగా... బ్యాడ్మింటన్ ఈవెంట్ 27న మొదలవుతుంది.



ప్రణయ్


లక్ష్య సేన్

క్లుప్తంగా...

పదో తరగతి రీ వెరిఫికేషన్ ఫలితాల విడుదల

సాక్షి, అమరావతి: పదో తరగతి రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. సప్లిమెంటరీ పరీక్ష (మే) ఫలితాల అనంతరం గతనెల 27 నుంచి జూలై 1 వరకు రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 3,873 మంది దరఖాస్తు చేసుకున్నట్టు పదో తరగతి పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. వీరి జవాబు పత్రాలను వెబ్‌సైట్‌లో ఉంచామని, పాఠశాల లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేరు మార్పు

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేరును డా.ఎన్టీఆర్ వైద్య సేవల పథకంగా మారుస్తూ శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులిచ్చారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌గా మార్పు చేశారు. ఈ ఉత్తర్వులను అమలు చేస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని సీఈవోను ఆదేశించారు.

జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ పొడిగిస్తూ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ (డబ్ల్యూజేహెచ్ఎస్)ను 2024–25 సంవత్సరానికి పొడిగిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌కు సంబంధించిన జీవో నంబర్–12లోని నిబంధనలకు లోబడి పథకం నడుస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల అమలుకు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్, సమాచార పౌర సంబంధాల శాఖ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సీఏ ఫలితాల్లో 'మాస్టర్‌మైండ్స్'కు ఉత్తమ ర్యాంకులు



తేజస్విని   వర్షితరెడ్డి   నారాయణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ప్రకటించిన సీఏ ఇంటర్,ఫైనల్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో ర్యాంకులు కైవశం చేసుకున్నట్లు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని మాస్టర్ మైండ్స్ క్యాంపస్‌లో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. సీఏ ఫైనల్ జూలై–2024 ఫలితాల్లో కె.తేజస్విని 14వ ర్యాంకు, వై.వర్షిత రెడ్డి 37వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. సీఏ ఇంటర్ జూలై–2024 ఫలితాల్లో ఎంవీఎల్ నారాయణ 38వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. సీఏ ఇంటర్, ఫైనల్‌లో గ్రూప్–1, గ్రూప్–2ల్లో 2,000 మంది వరకు మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.

ఏపీఆర్‌సెట్ తుది ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: వివిధ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి చేపట్టిన ఏపీఆర్‌సెట్–2023–24 తుది ఫలితాలను కన్వీనర్ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు తిరుపతి ఎస్వీయూలో శుక్రవారం విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది మేలో నిర్వహించిన ఏపీఆర్‌సెట్ పరీక్షకు 10,050మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా అందులో 8,651మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఇందులో 4,352మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించగా 3,476మంది హాజరయ్యారని చెప్పారు. వీరికి ర్యాంకులు కేటాయించినట్లు పేర్కొన్నారు. కౌన్సెలింగ్ తేదీలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు త్వరలో ప్రకటిస్తామని తెలియజేశారు. అభ్యర్థులు తుది ఫలితాలకోసం https://-cets.apsche.ap.gov.in/RCET వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

మూడు జిల్లాల్లోనే పాఠ్యాంశాల మార్పు

విద్యార్థులకు అనుబంధ బుక్‌లెట్ సరఫరా

సాక్షి, అమరావతి: పదో తరగతిలో కొత్త సిలబస్ ప్రవేశపెట్టామని, తెలుగు పాఠ్యాంశాలకు సంబంధించిన సీడీల్లో మార్పు జరగడంతో ప్రింటింగ్‌లో తప్పులు దొర్లినట్టు ప్రభుత్వ పాఠ్య పుస్తకాల ముద్రణ విభాగం డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25కు సంబంధించి పదో తరగతి పాఠ్యపుస్తకాలన్నీ మార్చినట్టు పేర్కొన్నారు. అందులో తెలుగు పాఠ్యాంశానికి సంబంధించి సీడీల్లో మార్పు జరగడంతో ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాలకు సరఫరా చేసిన పుస్తకాల్లో కొన్ని తప్పులు దొర్లాయన్నారు. వీటిని గుర్తించి అక్షర దోషాలు గల పేజీల స్థానంలో అనుబంధ బుక్‌లెట్‌ను విద్యార్థులకు వారం రోజుల్లో అందజేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. కేవలం మూడు జిల్లాల్లోనే ఈ మార్పు జరిగిందని వివరించారు. అయితే దీనిపై ఎల్లోమీడియాలో దుష్ప్రచారం జరగడంతో అధికారులు పై విధంగా వివరణ ఇచ్చారు.

రాజకీయ దురుద్దేశంతోనే వ్యక్తిత్వ హననం

ఎలాంటి ఆధారాలు లేకుండా నాపై ఊహాజనిత కథనం

- నా భర్త ఏపీ క్యాడర్ అధికారి
- దీంతో నిబంధనల ప్రకారమే హైదరాబాద్ నుంచి ఏపీకి వచ్చా
- 'ఈనాడు' రాతలపై ఆప్కాస్ట్ సభ్య కార్యదర్శి వై.అపర్ణ ఆగ్రహం

సాక్షి, అమరావతి: మహిళా అధికారిణిని కూడా చూడకుండా రాజకీయ దురుద్దేశంతో 'ఈనాడు' పత్రిక తన వ్యక్తిత్వహననానికి పాల్పడుతోందని ఏపీ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఆప్కాస్ట్) సభ్య కార్యదర్శి డాక్టర్ వై.అపర్ణ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మీడియాకు ప్రకటన విడుదల చేశారు. పాత్రికేయ విలువలకు పాతరేస్తూ.. ఎలాంటి ఆధారాలు లేకుండా, ఊహాజనిత కథనాలతో 'ఈనాడు' ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. కేవలం దుగ్ధతోనూ, రాజకీయ కారణాలతో వార్త రాసినట్టు కనిపిస్తోందని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఈనాడు కథనాన్ని అపర్ణ తీవ్రంగా ఖండించారు. తన ఖండనను ఈనాడు ప్రచురించిన కథనం స్థానంలో వేయాలన్నారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

ఎలాంటి నిబంధనల ఉల్లంఘన లేదు..

''నేను జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ నిబంధనల ప్రకారమే ఏపీకి వచ్చాను. నా భర్త ధనుంజయరెడ్డి ఏపీ క్యాడర్‌కు చెందిన అధికారి కావడంతో కుటుంబం అంతా ఒకే చోట ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నా. అర్జీని అంగీకరించిన అప్పటి ప్రభుత్వం నాకు ఆప్కాస్ట్‌లో పోస్టింగ్ ఇచ్చింది. ఇందులో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగలేదు. వందలాది మంది ఉద్యోగులు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఇదే పద్ధతిలో ఉద్యోగాలను మార్చుకున్నారు. కానీ, నా విషయంలో ఈనాడు పత్రిక ఎందుకు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుందో అర్థం కావట్లేదు. ఆప్కాస్ట్ గతంలో ఎలా ఉంది? నేను బాధ్యతలు చేపట్టాక ఎంత వృద్ధి చెందిందో ఏదైనా స్వతంత్ర సంస్థతో పరిశీలన చేయించుకోవచ్చు. ఆప్కాస్ట్ ద్వారా విద్యార్థులు, యువతకు సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన కల్పించడానికి ఎన్ని కార్యక్రమాలను నిర్వహించామో స్వయంగా వచ్చి తెలుసుకోవాలి. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించడానికి చేసిన ప్రయత్నాన్ని కూడా వక్రీకరించి దానిపైనా అవినీతి ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ఆప్కాస్ట్ కార్యాలయం చుట్టూ ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా, కబ్జాకు గురికాకుండా ప్రహరీ నిర్మిస్తే తప్పెలా అవుతుంది? శిథిలావస్థలోని ఐకానిక్ టవర్‌కు మరమ్మతులు చేయడం, చెదలు పట్టిన ప్రాంతీయ సైన్స్ కేంద్రాన్ని బాగు చేసి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడం అభివృద్ధి కాదా? సిబ్బంది కొరత దృష్ట్యా ఆప్కాస్ట్‌లో విశ్రాంత ఉద్యోగులను ప్రభుత్వ అనుమతితో నిబంధనల ప్రకారమే నియమించాం. రాజమహేంద్రవరంలోని బొమ్మూరు రీజనల్ సైన్స్ సెంటర్‌కు స్థలాన్ని నేను ఆప్కాస్ట్‌లోకి రాకముందే ఎంపిక చేశారు. నేను సభ్య కార్యదర్శిగా బాధ్యతలు తీసుకునే సమయానికే 70 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. పైగా ఈ పనులన్నింటినీ కేంద్ర ప్రభుత్వమే చేపట్టింది. ఆప్కాస్ట్ నుంచి నిధులను కేంద్ర సాంస్కృతిక శాఖకు బదిలీ చేస్తే.. థర్డ్‌పార్టీ ఏజెన్సీ ద్వారా కేంద్ర ప్రభుత్వమే పనులు పూర్తి చేసింది. ఈ విషయంలో నేను అవకతవకలకు పాల్పడ్డానని ఆరోపించడం ఏం జర్నలిజం? ప్రస్తుతం ఈ కేంద్రం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా ప్రారంభోత్సవానికి వస్తామని సమాచారం వచ్చింది. ప్రారంభోత్సవం తర్వాత ఎవరికైనా అనుమతిద్దాం అనుకున్నాం.. అందుకే దానిలోపలికి ఎవరినీ అనుమతించలేదు. వేరే కారణాలతో నాపై తప్పుడు కథనం రాయడం ఎలాంటి నైతికత?'' అంటూ అపర్ణ ఈనాడు పత్రిక కథనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్టైపెండ్ పెంచకుంటే పోరుబాటే..

ప్రభుత్వానికి వెటర్నరీ జూడాల హెచ్చరిక

- తిరుపతి వెటర్నరీ వర్సిటీలో ర్యాలీ
- వెంటనే వీసీ, రిజిస్ట్రార్‌ను నియమించాలని డిమాండ్

తిరుపతి సిటీ/లబ్బీపేట(విజయవాడతూర్పు) : వెటర్నరీ జూడాలకు స్టైఫండ్ పెంచకపోతే పోరుబాట తప్పదని వెటర్నరీ వర్సిటీ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జూనపూడి ఎజ్రా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తిరుపతి ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ పశువైద్య కళాశాలలో శుక్రవారం జూడాలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లుగా తమకు స్టైఫండ్ రూ.7 వేలే ఇస్తున్నారని.. అదీ సమయానికి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని వెటర్నరీ వర్సిటీల్లో రూ.23 వేలు ఇస్తున్నా.. తిరుపతి వర్సిటీలో మాత్రం పెంచకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న స్టైఫండ్ నిత్యావసరాలకు సరిపోవడం లేదని, వెంటనే రూ.15 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా వర్సిటీలో పాలన స్తంభించిపోయిందని, వర్సిటీకి పూర్తి స్థాయి వీసీ, రిజిస్ట్రార్‌లను నియమించాలని కోరారు. ప్రభుత్వానికి రెండు నెలలు గడువిస్తున్నామని, అప్పటికీ స్పందించకుంటే విధులను బహిష్కరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ చెంగల్రాయులుకు వినతి పత్రం ఇచ్చారు. నిరసన కార్యక్రమంలో జూడాల అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పవన్‌నాయక్, జనరల్ సెక్రటరీ ఆకాష్ పెద్ద సంఖ్యలో జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.



వర్సిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న జూడాలు

విజయవాడ జీజీహెచ్‌లో జూడాల నిరసన

తమపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కల్పించాలని, ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలని కోరుతూ విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో జూనియర్ వైద్యులు శుక్రవారం మెరుపు ఆందోళనకు దిగారు. ఐదు గంటల పాటు నిరసన వ్యక్తం చేశారు. పెనుగంచిప్రోలు మండలం నవాబుపేటకు చెందిన రవి కలుపుమందు తాగి మెడిసిన్ వార్డులో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈ సమయంలో మృతుడి బంధువులు, జూడాల మధ్య వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో మృతుడి బంధువులు జూడాలపై దాడి చేశారు. దీంతో శుక్రవారం ఉదయం సమ్మె నోటీసు తీసుకుని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్ వద్దకు వెళ్లగా.. సమస్యలేమైనా ఉంటే పరిష్కరిస్తామని, సమ్మె నోటీసు తీసుకోనని చెప్పినట్లు జూడాలు తెలిపారు. దీంతో ఉదయం 9 గంటలకు వందలాది మంది జూడాలు ఆస్పత్రి క్యాజువాలిటీ ఎదుట ఆందోళనకు దిగారు. తమకు రక్షణ కల్పించాలని, సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ నరసింహం ప్రభుత్వాస్పత్రికి చేరుకుని జూడాలతో కలిసి సూపరింటెండెంట్ చాంబర్‌లో చర్చలు జరిపారు. సమస్యలు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇవ్వడంతో జూడాలు ఆందోళన విరమించారు.



విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు

'ప్రకృతి వ్యవసాయం'కు రూ.3 కోట్ల నగదు పురస్కారం

- ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంకు ప్రతిష్టాత్మక గుల్బెంకియన్ అవార్డు
- 117 దేశాల నుంచి పోటీని ఎదుర్కొని దక్కించుకున్న రాష్ట్రం
- ప్రకృతి సాగుకు పెద్దపీట వేసిన గత వైఎస్ జగన్ ప్రభుత్వం
- ఐదేళ్లలో 10కి పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు
- ప్రపంచ ఆహార భద్రతకు కృషి చేసే సంస్థలకు ఏటా ఈ పురస్కారం



ఏంజిలా మెర్కెల్ చేతుల మీదుగా గుల్బెంకియన్ అవార్డు అందుకుంటున్న విజయ్‌కుమార్, నాగేంద్రమ్మ

సాక్షి, అమరావతి: 'ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్)'కు అత్యంత ప్రతిష్టాత్మక.. గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటీ గ్లోబల్ అవార్డు లభించింది. ఈ అవార్డు కింద రూ.3 కోట్ల నగదు పురస్కారం దక్కింది. ప్రపంచ ఆహార భద్రత, వాతావరణ సమతుల్యత, పర్యావరణ వ్యవస్థల పరిరక్షణ కోసం పనిచేసే సంస్థలు, వ్యక్తులకు ఏటా పోర్చుగల్‌కు చెందిన కలౌస్ట్ గుల్బెంకియన్ ఫౌండేషన్ అవార్డులను అందజేస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 117 దేశాల నుంచి 181 సంస్థలు ఈ అవార్డు కోసం నామినేట్ కాగా.. భారత్ నుంచి ఏపీకి చెందిన ఏపీసీఎన్ఎఫ్‌తో పాటు ఈజిప్ట్‌కు చెందిన సెకెమ్ సంస్థలు ఉమ్మడి విజేతలుగా నిలిచాయి. పోర్చుగల్ రాజధాని లిస్బన్‌లో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో జర్మనీ మాజీ చాన్సలర్ ఏంజిలా మెర్కెల్ చేతుల మీదుగా ఏపీసీఎన్ఎఫ్ తరఫున రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ మహిళా చాంపియన్ రైతు నాగేంద్రమ్మ అందుకున్నారు.

వైఎస్ జగన్ ప్రభుత్వ ప్రోత్సాహంతోనే..

రాష్ట్రంలో 2019–24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేసింది. దీంతో ప్రస్తుతం రికార్డు స్థాయిలో 4,116 గ్రామ పంచాయతీల్లో 10.37 లక్షల మంది రైతులు 12.16 లక్షల ఎకరాల్లో ప్రకృతి సాగు చేస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వ కృషి ఫలితంగా ఏపీసీఎన్ఎఫ్‌కు అజీం ప్రేమ్‌జీ ఫిలాంత్రపిక్ ఇనిషియేటివ్స్ (ఏపీపీఐ) రూ.100 కోట్ల గ్రాంట్‌ను కూడా మంజూరు చేసింది. మరో అంతర్జాతీయ సంస్థ.. కో ఇంపాక్ట్ రూ.120 కోట్ల ఆర్థిక చేయూతనిచ్చింది. జర్మనీ ప్రభుత్వం అందించిన రూ.174 కోట్ల గ్రాంట్‌తో వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఇండో–జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రోకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ అకాడమీ ద్వారా గతేడాది జూలై నుంచి 'రైతు శాస్త్రవేత్త' కోర్సుకు శ్రీకారం చుట్టారు.

ఐదేళ్లలో ఎన్నో అవార్డులు, రివార్డులు..

వైఎస్ జగన్ ప్రభుత్వ కృషితో 2022, 2023ల్లో ఏపీసీఎన్ఎఫ్‌కు వరుసగా రెండేళ్ల పాటు ఐదు విభాగాల్లో జైవిక్ ఇండియా అవార్డులు దక్కాయి. 2022లో ఫ్యూచర్ ఎకానమీ ఫోరం అందించే లీడర్‌షిప్ గ్లోబల్, 2023లో ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్, మారికో ఇన్నోవేషన్, ఎంఎస్ స్వామినాథన్ మెమోరియల్, ఆదర్శ మహిళా రైతు ఉషారాణికి స్త్రీశక్తి సైన్స్, ప్రకృతి వ్యవసాయ రైతు నారాయణప్పకు కర్మవీరచక్ర గ్లోబల్ అవార్డులు వరించాయి. ప్రకృతి సాగులో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను 45 దేశాల ప్రతినిధి బృందాలు అధ్యయనం చేశాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మేఘాలయ వంటి 12 రాష్ట్రాల్లో ప్రకృతి సాగు విస్తరణకు ఏపీసీఎన్ఎఫ్ అవసరమైన మద్దతును అందిస్తోంది.

ప్రకృతి సాగుకు మరింత ఊతం..

ప్రకృతి సాగులో ఇప్పటివరకు 10 లక్షల మంది రైతులు భాగస్వాములను చేయగలిగాం. ఈ వ్యవసాయం ద్వారా రైతులు తమ ఆరోగ్యాన్ని, జీవనోపాధులను పెంపొందించుకోగలుగుతున్నారు. అంతేకాకుండా పర్యావరణ పరిరక్షణలోనూ తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. ఇంకోవైపు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంలో సమాజానికి తమ వంతు తోడ్పాటును అందిస్తున్నారు. ప్రతిష్టాత్మక ఈ అవార్డుతో రాష్ట్రంలో ప్రకృతి సాగు విస్తరణకు మరింత ఊతమిచ్చినట్టయ్యింది. అవార్డు కింద వచ్చే నగదుతో ప్రకృతి సాగు విస్తరణకు మరింత కృషి చేస్తాం.

– టి. విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, రైతు సాధికార సంస్థ

ఆల్మట్టిలోకి తగ్గిన వరద

సాక్షి, అమరావతి: పశ్చిమ కనుమల్లో వర్షాలు తెరిపి ఇవ్వడంతో కృష్ణా, ఉపనదుల్లో ఎగువన వరద ప్రవాహం తగ్గింది. కర్ణాటకలోని ఆల్మట్టి డ్యామ్‌లోకి చేరుతున్న ప్రవాహం శుక్రవారం 33,874 క్యూసెక్కులకు తగ్గింది. ఆల్మట్టిలో నీటినిల్వ 87.22 టీఎంసీలకు చేరుకుంది. మరో 42 టీఎంసీలు చేరితే ఆల్మట్టి డ్యామ్ నిండుతుంది. తుంగభద్రలోను వరద ప్రవాహం తగ్గింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 21,463 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 29.16 టీఎంసీలకు చేరింది. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు అయిన శ్రీశైలంలోకి 412 క్యూసెక్కులు చేరుతుండగా.. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 2,166 క్యూసెక్కులను తెలంగాణ సర్కార్ తరలిస్తోంది. దీంతో శ్రీశైలంలో నీటినిల్వ 36.4 టీఎంసీలకు తగ్గింది.

దంత వైద్య విద్యార్థులకు స్టైపెండ్ రిలీజ్ చేయండి

- ఏఐడీఎస్ఏ జాతీయ ప్రెసిడెంట్ డాక్టర్ ఎండీ మంజూర్ అహ్మద్

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, కడపల్లో ఉన్న ప్రభుత్వ దంత వైద్య కళాశాలల్లోని యూజీ, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్టైఫండ్‌ను వెంటనే విడుదల చేయాలని ఆల్ ఇండియా డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐడీఎస్ఏ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎండీ మంజూర్ అహ్మద్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విజయవాడలో 25 మంది యూజీ విద్యార్థులకు ఏప్రిల్ నుంచి, పీజీ విద్యార్థులకు మూడు నెలల నుంచి స్టైఫండ్ రావడం లేదన్నారు. కడపలో యూజీలు 25 మందికి ఆరు నెలలుగా, పీజీలకు మూడు నెలలుగా స్టైఫండ్ పెండింగ్ ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో హౌస్‌సర్జన్‌లు, పీజీ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని, వెంటనే ఉన్నతాధికారులు కలగజేసుకుని స్టైఫండ్ రిలీజ్ చేయాలని ఆయన కోరారు.

'రెవెన్యూ' కార్యదర్శిగా సిసోడియా బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఆర్‌పీ సిసోడియా వెలగపూడి సచివాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆ తర్వాత స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అజయ్ జైన్ స్థానంలో ప్రభుత్వం సిసోడియాను నియమించిన సంగతి తెలిసిందే.

నిరుద్యోగులకు 'ఉపాధి' ఆన్‌లైన్ సేవలపై అవగాహన

ఉపాధి శిక్షణశాఖ డైరెక్టర్ బి.నవ్య

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి కార్యాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో అందించే సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని ఉపాధి శిక్షణశాఖ డైరెక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంప్లాయిమెంట్ విభాగం అధికారులతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అమలు చేస్తున్న నిరుద్యోగ పోర్టల్స్, అమలు తీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నవ్య మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా జాబ్ మేళాలు చేపట్టాలని సూచించారు. https://-employment.ap.gov.in పోర్టల్‌ను నిరుద్యోగులు ఉపయోగించుకునేలా అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేడీ చైతన్య, డిప్యూటీ డైరెక్టర్ హిమబిందు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.